అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదివారం 5-03-2023

సంపుటి : 9 సంచిక : 63 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు + సోపతి(వెబ్‌లో) వెల : 8.00

త్రిపురలో కొనసాగుతున్న బీజేపీ దుశ్చర్యలు

- ప్రతిపక్ష నాయకులతో పాటు జర్నలిస్టులు, ప్రభుత్వ ఉద్యోగులపై దాడులు



అగర్తలా : త్రిపురలో బీజేపీ కార్యకర్తల దాడులు కొనసాగుతున్నాయి. ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలకు చెందిన ఇండ్లతో పాటు, జర్నలిస్టుల ఇండ్లపైనా దాడులకు తెగబడుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులపైనా దాడులు ...5లో


దేశాన్ని రక్షించడమే మా లక్ష్యం

రాజ్యాంగం స్థానంలో మనుధర్మం అమలుకు బీజేపీ ప్రయత్నం

- బానిసయుగం నాటి పరిస్థితులు తెస్తున్న మోడీ సర్కారు
- వచ్చే ఎన్నికల తర్వాత శాసనసభలో కమ్యూనిస్టులుంటారు : నవతెలంగాణతో తమ్మినేని



కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పాలన దేశానికి, ప్రజలకు ప్రమాదకరమని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం చెప్పారు. బీజేపీ నుంచి దేశాన్ని రక్షించడమే లక్ష్యంగా జనచైతన్య యాత్రను చేపడుతున్నామని అన్నారు. రాజ్యాంగం స్థానంలో మనుధర్మం అమలుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదనీ, దాన్ని అడ్డుకుంటామనీ చెప్పారు. అభ్యుదయ, ప్రగతిశీల భావాలున్న తెలంగాణలో మతోన్మాద బీజేపీకి తావులేదని అన్నారు. మత రాజకీయాలను ప్రతిఘటించాలంటూ ఆయన పిలుపునిచ్చారు. ఈనెల 17 నుంచి వరంగల్‌లో ప్రారంభం కాబోతున్న జనచైతన్య యాత్ర నేపథ్యంలో నవతెలంగాణ ప్రతినిధి బొల్లె జగదీశ్వర్‌కు తమ్మినేని వీరభద్రం ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు...



ఈ యాత్ర ముఖ్యఉద్దేశమేంటీ? బీజేపీ వల్ల ప్రజాస్వామ్యానికి వస్తున్న ముప్పు ఏంటీ?

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, మతోన్మాదాన్ని ఎండగట్టడం కోసమే ఈ యాత్ర చేపడుతున్నాం. ప్రభుత్వ విధానాలతోపాటు దేశాన్ని విచ్ఛిన్నం చేస్తున్న ధోరణులను ప్రజలకు అర్థమయ్యేటట్టు వివరిస్తాం. ఇంకోవైపు రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను, సంక్షేమ పథకాల అమలుల్లో ఉన్న లోపాలను గుర్తు చేస్తాం. అయితే బీజేపీ ప్రభుత్వానికి రాజ్యాంగం పట్ల గౌరవం లేదు. ఈ దేశానికి మనుధర్మమే గొప్పదంటూ ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు చెప్తున్నారు. సోషలిస్టు, సెక్యులర్ పదాలను కూడా రాజ్యాంగం నుంచి తొలగించాలంటూ కేంద్ర మంత్రులంటున్నారు. ముస్లింలు, క్రిస్టియన్లు, దళితులు, గిరిజనులు, మహిళలపై దాడులకు పాల్పడుతున్నారు. విద్యావైద్యంతోపాటు ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటుపరం చేస్తున్నారు. రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్నారు. ఈడీ, సీబీఐ, కాగ్, సుప్రీం కోర్టును కూడా అధికార పార్టీకి అనుబంధ సంస్థలుగా వాడుకుంటున్నారు. ఇది దుర్మార్గం. ఏకపక్షంగా చట్టాలను చేస్తున్నారు. విమర్శలు చేస్తే దాడులు జరుగుతున్నాయి. ప్రతిపక్షాలను, ప్రజాస్వామ్యాన్ని ...2లో



మార్చి 8 నుండి ఆరోగ్య మహిళ

ఎనిమిది రకాల ఆరోగ్య సమస్యలకు వైద్యం

- మొదటి దశలో 100 ఆరోగ్య కేంద్రాల్లో సేవలు
- భవిష్యత్తులో 1,200ల కేంద్రాలకు విస్తరణ: హరీశ్ రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మహిళా దినోత్సవం (మార్చి 8) నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని నిర్వహించనుంది. ఈ కార్యక్రమంలో భాగంగా ఎనిమిది రకాల సమస్యలకు వైద్యం అందించనుంది. మొదటి దశలో 100 ఆరోగ్య కేంద్రాల్లో సేవలను ప్రారంభించి భవిష్యత్తులో 1,200 కేంద్రాలకు విస్తరింపజేస్తుంది. బుధవారం మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు ప్రభుత్వ కానుకగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్టు వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు తెలిపారు. శనివారం హైదరాబాద్ బీఆర్‌కె భవన్ నుంచి ఆయన కంటి వెలుగు, సీపీఆర్, ప్రత్యామ్నాయ మహిళా ఆరోగ్య కార్యక్రమాలపై పంచాయతీ, మున్సిపల్ తదితర శాఖల ఉన్నతాధికారులు, ...5లో

కులం చెపితేనే ఎరువులు

కేంద్ర ఎరువులు, రసాయనాల మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్

- అనాలోచిత నిర్ణయం : ఏఐకేఎస్



సబ్సిడీ ఎరువులు కావాలంటే కులాన్ని నమోదు చేయాలని కేంద్ర ఎరువులు, రసాయనాల మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ ఇచ్చింది. ఎరువుల రాయితీలు పొందడానికి ఎరువుల దుకాణాల్లో పాయింట్ ఆఫ్ సేల్ (పీఓఎస్) మెషీన్లను ప్రవేశపెట్టి.. తప్పనిసరి 'కులం' నమోదు చేయాలనే కేంద్రం ఆదేశం రైతులను ఆగ్రహానికి గురి చేస్తున్నది. ఇది మధ్యతరగతి, పేద రైతుల సబ్సిడీలపై ప్రభావం చూపుతుందని ఏఐకేఎస్ విమర్శించింది.

న్యూఢిల్లీ : రైతులకు అన్ని సబ్సిడీ ఎరువుల విక్రయం ప్రభుత్వ, ప్రయివేట్ రిటైల్ అవుట్‌లెట్‌లలో అమర్చబడిన పాయింట్ ఆఫ్ సేల్ (పీఓఎస్) పరికరాలతో చేయబడుతుంది. ఆధార్ కార్డులు, కేసీసీ, ఓటర్ ఐడీలతో లబ్దిదారులను గుర్తిస్తారు. దేశవ్యాప్తంగా దాదాపు 2.60 లక్షల పీఓఎస్ పరికరాలను ఇన్‌స్టాల్ చేశారు. "కొనుగోలుదారుల కేటగిరీలో కొత్త అప్‌డేట్ ప్రకారం.. రాయితీ పొందడానికి పీఓఎస్ లో 'సేల్ టు ఫార్మర్' ఎంట్రీ కింద రైతుల కుల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలి. కుల ఎంపికలుగా జనరల్, ఇతర వెనుకబడిన తరగతి (ఓబీసీ), షెడ్యూల్డ్ కులం (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగ (ఎస్టీ)లు పేర్కొంది. ఎరువుల విక్రయ సమయంలో వాటిలో ఒకదాన్ని ఎంచుకోవడం తప్పనిసరి" అని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫెర్టిలైజర్స్ జారీ చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొంది.

ఏఐకేఎస్ ఖండన

ఎరువుల దుకాణాల్లోని పాయింట్ ఆఫ్ సేల్ (ఓపీఓపిఎస్) మెషీన్‌ల వద్ద కులానికి సంబంధించిన సమాచారాన్ని సేకరించాలనే నిర్ణయాన్ని ఏఐకేఎస్ ఖండించింది. ఈ మేరకు ఏఐకేఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్ ధావలే, విజూకృష్ణన్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎరువుల రాయితీని పొందడం కోసం పాయింట్ ఆఫ్ సేల్ (ఓపీఎస్) మెషీన్ల వద్ద తప్పనిసరిగా కుల వర్గాన్ని నమోదు చేయాలనే ప్రభుత్వ ఏకపక్ష నిర్ణయం అనాలోచితమని పేర్కొన్నారు. ఈ తిరోగమన నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కేంద్ర రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖను డిమాండ్ చేశారు. రైతులు తమ కుల వివరాలను నమోదు చేయాలని కోరారనీ, అయితే కుల, మతాలకు అతీతంగా ప్రజలు వ్యవసాయం చేస్తున్నారనీ, ఎరువులు కొనడానికి ఈ వివరాల సేకరణ పూర్తిగా అనవసరమనీ, బయోమెట్రిక్ వాడకం తరచుగా మినహాయింపు కోసం ఒక సాధనంగా మారుతుందని విమర్శించారు. ప్రస్తుతం ఎరువుల సబ్సిడీల విధానం నుంచి డీబీటీ (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) స్కీమ్‌కి మారే దిశగా మోడీ ప్రభుత్వం ఎరువుల విక్రయానికి ఆధార్‌తో అనుసంధానించబడిన పీఓఎస్ మెషీన్‌ల తప్పనిసరి వినియోగాన్ని ప్రవేశపెట్టిందని ఆరోపించారు. ఎరువుల విక్రయం ...5లో

ట్రాఫిక్ పరిష్కారానికే స్టీల్ బ్రిడ్జీల నిర్మాణం

వీఎస్టీ నుంచి ఇందిరాపార్కు వరకు బ్రిడ్జి పనులను పరిశీలించిన మంత్రి కేటీఆర్

- మూడు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశాలు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

పట్టణాల్లో ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసమే తక్కువ నష్టంతో కూడిన స్టీల్ బ్రిడ్జీలు నిర్మిస్తున్నట్టు పురపాలకశాఖ మంత్రి కే తారకరామారావు చెప్పారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) పరిధిలో ఇప్పటికే పలు ప్రాంతాల్లో ఫ్లయ్‌ఓవర్లు, స్కైవేలు, స్టీల్ బ్రిడ్జీలను రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్నదని వివరించారు. వీఎస్టీ నుంచి ఇందిరాపార్కు వరకు నిర్మిస్తున్న స్టీల్ బ్రిడ్జి పనులను శనివారంనాడాయన పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తి కావల్సిన గడువు ముగిసినా, పనులు ఎందుకు నత్తనడకన సాగుతున్నాయని సంబంధిత అధికారులను ప్రశ్నించారు. మూడు నెలల్లో బ్రిడ్జి పనులన్నింటినీ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే సెంట్రల్ హైదరాబాద్ నగరానికే ప్రత్యేక గుర్తింపు వస్తుందని చెప్పారు. బ్రిడ్జి నిర్మాణ పనులు వేగవంతం చేసేందుకు అవసరమైన ట్రాఫిక్ మళ్లింపు వంటి అంశాల్లో నగర ట్రాఫిక్ పోలీస్ విభాగంతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. కార్మికులకు, పౌరులకు ఎలాంటి ...5లో

9న క్యాబినెట్ భేటి

- గవర్నర్, సీఎస్ వివాదం చర్చకు వచ్చే అవకాశం ?

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి- హైదరాబాద్

రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈనెల తొమ్మిదిన జరగనుంది. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అధ్యక్షతన ప్రగతిభవన్‌లో మధ్యాహ్నం రెండు గంటలకు క్యాబినెట్ భేటి కానుంది. ఈ సమావేశానికి మంత్రులు, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులు హాజరు కానున్నారు. సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించి మంత్రిమండలి నిర్ణయాలు తీసుకోనుందని శనివారం సీఎంవో ఒక ప్రకటనలో తెలిసింది. అయితే రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ ప్రభుత్వ ...5లో

భయాందోళనలో క్రిస్టియన్లు

వారిపై పెరుగుతున్న వివక్ష

- మతమార్పిడి ఆరోపణలతో దాడులు
- ప్రభుత్వం వారికి భరోసానివ్వాలి
- ప్రధాని మోడీకి మాజీ ఉన్నతాధికారుల లేఖ

న్యూఢిల్లీ : దేశంలోని క్రిస్టియన్ సమాజంలో భయానక వాతావరణం నెలకొని ఉన్నదని మాజీ బ్యూరోకాట్లు ఆందోళన వ్యక్తం చేశారు. వారిపై బలవంతపు మత మార్పిడి ఆరోపణలతో ఆ వర్గం ప్రజలు పూర్తి వివక్షను ఎదుర్కొంటున్నారని వివరించారు. ఈ మేరకు ప్రధాని మోడీకి 93 మంది మాజీ ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు లేఖ రాశారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో చట్టం, పరిపాలనా పరంగా క్రిస్టియన్ సమాజానికి భరోసానివ్వాలని లేఖలో వారు కోరారు. ప్రధానంగా క్రిస్టియన్ సమాజంపై ఉన్న ఆరోపణ బలవంతపు మార్పిళ్లు అనీ, 1951 జనాభా లెక్కల నుంచి చూస్తే మాత్రం



ఇది దాదాపు 2.3 శాతంగా ఉన్నదని పేర్కొన్నారు. ఈ ఆరోపణతోనే క్రిస్టియన్ సమాజం భౌతికంగా, మానసికంగా, మాటల రూపంలో దాడులకు గురైందని వివరించారు. ఈ దాడులు వ్యక్తులు, వారికి చెందిన సంస్థలపైనా జరిగాయన్నారు. విద్యా, వైద్య రంగంలో, సామాజిక సంస్కరణల్లో క్రిస్టియన్ల సహకారాన్ని మాజీ ఉన్నతాధికారులు ఉటంకించారు. ఇప్పటికీ క్రిస్టియన్లతో పాటు అన్ని ...5లో

కమీషన్ల కోసమే 9వ ప్యాకేజీ పూర్తి చేయలేదు

పనుల ఆలస్యంపై సంస్థ గుర్తింపు రద్దు చేయాలి : రేవంత్‌రెడ్డి




నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట/ గంభీరావుపేట

సింగసముద్రం 9వ ప్యాకేజీ కాలువ పనులను కమీషన్ల కోసమే పూర్తి చేయడం లేదని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఆరోపించారు. పనులు కాకపోవడంపై కారణాలను అధికారులకు ఫోన్ చేసి అడిగి తెలుసుకున్నారు. కమీషన్ల కోసం మంత్రి కేటీఆర్ పనులు పూర్తి చేయకుండా కడపకు చెందిన కాంట్రాక్టర్‌తో కుమ్మక్కయ్యారని ఆరోపించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డి పేట-గంభీరావుపేట మండలాల మధ్య తిమ్మాపూర్ గ్రామ శివారులోగల సింగసముద్రం 9వ ప్యాకేజీ కాలువను శనివారం రేవంత్‌రెడ్డి పరిశీలించారు. పనులు ఆలస్యం చేయడం ద్వారా అంచనా వ్యయం పెరిగే అవకాశం ఉంటుందన్నారు. పనులు సరిగా చేయడం లేదన్న నేపంతో ...5లో



నరేగాపై శీతకన్ను



కార్మికులకు ఏడాదికిపైగా వేతన బకాయిలు

ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద ధర్నా

- మీడియా సమావేశంలో గోడు వెళ్లబోసుకున్న 'నరేగా' కార్మికులు
- ఉపాధి హామీ రాజ్యాంగ హక్కు : బృందాకరత్



న్యూఢిల్లీ : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (నరేగా) ద్వారా కోట్లాది మంది పేదలు ఉపాధి పొందుతున్నారు. అయితే ఉపాధి హామీ చట్టాన్ని మెల్లమెల్లగా నిర్వీర్యం చేసే వ్యూహాన్ని మోడీ సర్కార్ ఎంచుకుంది. కొత్త బడ్జెట్‌లో భారీ మొత్తంలో నిధులకు కోత విధించింది. ఇప్పటికే వేల కోట్ల బకాయిలు 'నరేగా' కింద రాష్ట్రాలకు నిధులు విడుదల చేయాల్సివుంది. పశ్చిమ బెంగాల్‌లో పలు జిల్లాల్లో కార్మికులకు వేతన బకాయిలు ఏడాదికిపైగా ఉన్నాయి. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన నరేగా కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఇటీవల ధర్నాకు దిగారు. ఈనేపథ్యంలో కార్మికులు నిర్వహించిన మీడియా సమావేశానికి సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందా కరత్ హాజరయ్యారు. ఉపాధి హామీ చట్టం..రాజ్యాంగ హక్కు. నరేగా పథకంపై మోడీ సర్కార్ అప్రకటిత యుద్ధం కొనసాగిస్తోందని అన్నారు.

ఆమె ఇంకా ఏమన్నారంటే..."దళితుల, ఆదివాసీల ఎన్నో సంవత్సరాల పోరాటంతో ఉపాధి హామీ చట్టం రూపొందింది. దీనిని వీలైనంతమేరకు నిర్వీర్యం చేయాలన్నదే కేంద్రం వ్యూహం. నరేగా, అటవీ హక్కుల చట్టాన్ని ఒక క్రమపద్ధతిలో కేంద్రం నిర్వీర్యం చేస్తోంది. నరేగా కార్మికులకు రాజ్యాంగం ఇచ్చిన హక్కును తిరస్కరించేందుకు కేంద్రం వేయని ఎత్తుగడ లేదు. కేంద్ర బడ్జెట్‌లో 33 శాతం నిధులు తగ్గించింది. కోవిడ్ సంక్షోభ సమయంలో ఎంతోమంది పేదల్ని ఆదుకున్న పథకం నరేగా" అని చెప్పారు. 2023-24 బడ్జెట్‌లో 'ఉపాధి హామీ' కోసం రూ.60వేల కోట్లు మాత్రమే కేటాయించింది. ప్రస్తుత బడ్జెట్ సవరించిన అంచనాల ప్రకారం నిధుల ఖర్చు రూ.89వేల కోట్లుగా ఉంది. ప్రస్తుతం ఉపాధి పనుల డిమాండ్‌ను పరిగణలోకి తీసుకుంటే ...5లో

నవతెలంగాణ

దేశాన్ని రక్షించడమే మా లక్ష్యం



(మొదటిపేజీ తరువాయి)

బీజేపీ అపహాస్యం చేస్తున్నది. అమెరికాకు అనుకూలంగా విదేశాంగ విధానా న్ని అమలు చేస్తున్నది. ఇవన్నీ ప్రజలకు చెప్తాం.

ప్రజల్ని ఈ యాత్ర ఎలా చైతన్యం చేయనుంది?

బీజేపీ పైకి చెప్పే మాటలు విని ప్రజలు మోసపోతున్నారు. ఆకర్షణకు లోనవుతున్నారు. ఆ మాటల వెనుక నష్టమేంటో ఈ యాత్ర ప్రజలకు వివరిస్తుంది. వాస్తవాలను చెప్పి ప్రజల్లో చైతన్యం పెంపొందిస్తుంది. బీజేపీ చెప్తున్న మాటలు నమ్మిన వారికి ఆ ఆలోచనల నుంచి విముక్తి కల్పిస్తుంది.

బీజేపీతో దేశానికి ప్రమాదం అంటున్నారు... అదెలా?

బీజేపీ మిగతా రాజకీయ పార్టీల్లాంటిది కాదు. నిర్దిష్టమైన సిద్ధాంతం ఆ పార్టీకి ఉన్నది. చాతుర్వర్ణ వ్యవస్థను పునరుద్ధరించాలనీ, కులవ్యవస్థ ఉండాలనీ కోరుకునే పార్టీ అది. బ్రాహ్మణులు ఉన్నత స్థాయిలో ఉండాలనీ, వారికి శూద్రులు, దళితులు సేవ చేయాలని చెప్తున్నది. వర్ణాశ్రమ ధర్మాలు పాటించాలంటుంది. చరిత్రను వక్రీకరిస్తుంది. ఆర్యులు ఈ దేశా నికి మూలపురుషులంటూ అబద్ధాన్ని నిజం చేయాలని చూస్తున్నది. బానిస యుగం నాటి పరిస్థితులను తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నది. ఇది దేశానికి ప్రమాదకరం. దీన్నే ప్రజలకు చెప్తాం.

కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ఏం అన్యాయం చేస్తున్నది. దాన్ని ప్రజలు ఎందుకు గుర్తించడం లేదు?

నూతన ఆర్థిక విధానాల వల్ల కొన్ని సెక్షన్ల ప్రజలకు మేలు జరుగుతున్నది. 30 ఏండ్లలో ఆర్థిక వ్యవస్థ పెరిగింది. అయితే టాప్ 50 శాతం మందికే మేలు కలిగింది. మిగతా 50 శాతం మందిలో దరిద్రం పెరిగింది. డబ్బు, పదవి చుట్టూ రాజకీయాలున్నాయి. పార్టీ ఫిరాయింపులు సాధారణ అంశంగా మారిపోయాయి. మధ్యతరగతి ప్రజలు పెట్టుబడిదారీ విధానం పట్ల భ్రమల నుంచి బయటికి వస్తున్నారు. వాస్తవాలను వివరించి చెప్పడంలో కమ్యూనిస్టుల్లోనూ లోపాలున్నాయి. ఆర్థిక విషయాలను ప్రచారం చెప్పినట్టుగా బీజేపీ, ఆర్ఎస్ఎస్ మూలసిద్ధాంతాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లలేకపోయాం. ఇప్పుడు వాటిని ప్రజలకు వివరించి చైతన్యపరుస్తాం.

బీజేపీ వల్ల రాజ్యాంగానికి వచ్చిన ప్రమాదమేంటీ?

బీజేపీ పాలనలో లౌకిక ప్రజాస్వామ్యం, ఆర్థిక స్వావలంబన, సామాజిక న్యాయం, రాష్ట్రాల హక్కులు హరించబడుతున్నాయి. రాజ్యాంగ మూలాలను ధ్వంసం చేస్తున్నది. ముస్లిం మైనార్టీల పట్ల విద్వేషాలను పెంచుతున్నది. ప్రభుత్వరంగ సంస్థలుంటేనే ప్రజాస్వామ్యం ఫరిడవిల్లుతుంది. కానీ కేంద్రం పబ్లిక్ సెక్టార్‌ను నిర్వీర్యం చేస్తున్నది. కార్పొరేట్లకు కారుచౌకగా కట్టబెడుతున్నది. సామాజిక న్యాయం మృగ్యమవుతున్నది. దళితులు, గిరిజనులు, మైనార్టీలు, మహిళలపై దాడులు పెరిగాయి. కుల నిర్మూలన కోసం కాకుండా కుల వృత్తులను కాపాడేలా కేంద్రం చర్యలు తీసుకుంటున్నది. రాష్ట్రాల హక్కులపై దాడి చేస్తున్నది. జీఎస్టీ బకాయిలు రాష్ట్రాలకు రావడం లేదు. బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గుతున్నాయి. అప్పు తెచ్చుకోవాలన్నా కేంద్రం అనుమతి కావాల్సిన పరిస్థితి. ఏకపక్షంగా వ్యవసాయ చట్టాలు, విద్యుత్ సవరణ బిల్లు, నూతన విద్యా విధానాన్ని తెచ్చింది. ఫెడరల్ స్ఫూర్తికి ఇది విరుద్ధం. రాజ్యాంగం డొల్ల అని కేంద్రం చెప్పక నే చెప్తున్నది.

మతాన్ని రాజకీయాలకు మిళితం చేసి బీజేపీ పాలన సాగిస్తున్నది. ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతున్నది. వీటిని ఎలా ఎదుర్కొంటారు?

బీజేపీ పార్లమెంటరీ ఎత్తుగడల్లోనే అది ఉన్నది. మతచిచ్చు ద్వారా రాజకీయ ప్రయోజనం పొందాలన్నదే వారి విధానం. అందులో భాగంగానే మూడోసారి అధికారంలోకి రావాలని చూస్తున్నది. మతం వ్యక్తిగతం. కానీ ప్రభుత్వమే ఓ మతాన్ని నెత్తిన వేసుకోవడం సరైంది కాదు. అది లౌకిక విలువలను కాలరాయడమే అవుతుంది. బీజేపీ విధానం వల్ల హిందూమతంలో కూడా మెజార్టీ ప్రజలకు మేలు జరగదు. బ్రహ్మణులు, ఉన్నత కులాలకే ప్రయోజనం. కులవ్యవస్థ ఉండాలని చెప్పడం వల్ల శూద్రులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఎంబీసీలు మరింత అణచివేయబడతారు. హిందువుల్లో అతి మైనార్టీలైన అగ్రవర్ణాలకే బీజేపీ ప్రాతినిధ్యం వహిస్తుంది. కానీ హిందూ మతానికి మేలు చేస్తున్నట్టు ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతున్నది. హిందూ ధర్మం వేరు, హిందూత్వ రాజకీయాలు వేరు. ఈ వాస్తవాలను ఈ యాత్ర ద్వారా ప్రజలకు చెప్తాం.

పోరాటాల్లో ముందుండే కమ్యూనిస్టుల గొంతును ప్రజలు ఎందుకు వినట్లేదు. లోపం ఎక్కడుందంటారు?

బీజేపీ మూల సిద్ధాంతాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో తగిన కృషి జరగడం లేదు. ఆర్థిక విషయాలను తీసుకెళ్తే సరిపోదు. ప్రత్యామ్నాయ భావజాలాన్ని, అభ్యుదయ విలువలను ప్రజల్లో తీసుకెళ్లాలి. ఆచారాలు, సంప్రదాయాలు, పండుగలు, టీవీ, సినిమాలు, ఇంటర్‌నెట్ ఇలా అన్ని విషయాల్లోనూ ప్రత్యామ్నాయ సంస్కృతిని విస్తరింపచేయాలి. బీజేపీ భావజాలం ఎంత ప్రమాదకరమో వివరించాలి. ఈ కృషిని ఈ యాత్ర ద్వారా చేపడతాం.

అఖండ భారత్ కోసం ఆర్ఎస్ఎస్, బీజేపీ ప్రయత్నం చేస్తున్నాయి కదా? దీనిపై ఏమంటారు?

అఖండ భారత్ అమలుకు సాధ్యం కాని కల. ఎప్పుడూ భారత్ ఒకే రాజ్యం కింద ఉన్న సందర్భం తక్కువ. బ్రిటీష్ వారు వచ్చాక ఏకీకృత రూపం వచ్చింది. సంపదను దోపిడీ చేసేందుకు చేసింది. దాన్ని వ్యతిరేకించి భారత్ ఐక్యతను సాధించింది. అందులో భాగంగానే స్వాతంత్ర్యోద్యమం సాగింది. వివిధ మతాలు, భాషలు, ప్రాంతాలున్నా భిన్నత్వంలో ఏకత్వం ఉన్నది. కానీ బీజేపీ పాలనలో భిన్నత్వం నాశనమవుతున్నది. ఒకే భాష, ఒకే మతం, ఒకే సంస్కృతి అంటున్నది. ఇది దేశానికి ప్రమాదం.

పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. అయినా బీజేపీ గెలుస్తున్నది. ప్రజల నుంచి వ్యతిరేకత ఎందుకు రావడం లేదు.?

ఇటీవల గ్యాస్ ధర పెంపు దారుణం. ఉక్రెయిన్-రష్యా యుద్ధం వల్ల పెరుగుతున్నాయని చెప్తున్నారు. రష్యా నుంచి గ్యాస్‌ను తక్కువ ధరకే భారత్ కొంటున్నది. అయినా ఎక్కువ ధరకు అమ్ముతున్నది. ప్రజలపై భారాలు మోపుతున్నది. బీజేపీ అధికారంలోకి వచ్చాక గ్యాస్‌పై సబ్సిడీని క్రమంగా ఎత్తేసింది. అయితే వీధుల్లోకి వచ్చి ప్రజలు పోరాడ్డం లేదు. కానీ ధరలతో సతమతమవుతున్నారు. 2024లో వచ్చే ఎన్నికల్లో ఈ ప్రభావం ఉంటుంది. అయితే బీజేపీ వ్యతిరేక ఓట్లు చీలకుండా ప్రతిపక్షాలు ఐక్యంగా ఉండాలి. అప్పుడే బీజేపీ ఓటమి ఖాయం.

మీ యాత్రతో ప్రజలకు చేరవయ్యే ప్రయత్నం చేస్తున్నారా?

రాష్ట్రంలో నిజాం వ్యతిరేక పోరాటం సాగింది. భూ ఉద్యమాలు, వ్యవసాయ కార్మిక, రైతు పోరాటాలు, అభ్యుదయ, ప్రజాతంత్ర ఉద్యమాలకు తెలంగాణ పురిటిగడ్డ. ఇలాంటి ప్రాంతంలో మతోన్మాద బీజేపీకి తావులేదు. నేడు వామపక్షాలకు ఓట్లు రాకపోయినా ఆ ప్రభావం బలంగా ఉన్నది. రాష్ట్రంలో ఫ్యూడల్ భావజాలం ఉన్నది. మూఢవిశ్వాసాలను ప్రజలు నమ్ముతారు. ఇంకోవైపు ముస్లిం మైనార్టీలు ఎక్కువున్నారు. మతోన్మాదం వైపు ఆకర్షించేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నది. అందులో భాగంగానే మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకు ఆ పార్టీ నేతలు ప్రసంగాలు చేస్తున్నారు. ఖమ్మంలో ఇటీవల బీఆర్ఎస్ సభ బీజేపీ ఎదుగుదలను తగ్గించింది. వామపక్షాలు అందులో పాల్గొనడమే ఓ కారణంగా ఉన్నది. ప్రజలకు ఈ విషయాలను చెప్పి ప్రభావం చూపుతాం.

కమ్యూనిస్టులకు పూర్వవైభవం వస్తుందంటారా? శాసనసభలోకి మీ సభ్యులు వెళ్తారా?

తప్పకుండా వస్తుంది. అయితే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం సమయంలో ఉన్న వైభవం ఇప్పటికిప్పుడు రాకపోవచ్చు. కానీ తెలంగాణ ఆవిర్భావానికి ముందున్న పరిస్థితి వచ్చే అవకాశమున్నది. తెలంగాణ పట్ల మేం తీసుకున్న వైఖరి కొంత బలహీనతకు ఓ కారణం. రాజకీయాలు డబ్బు, ప్రలోభాల మయమైపోయాయి. మునుగోడు ఎన్నికల తర్వాత కమ్యూనిస్టుల ప్రాబల్యం పెరిగింది. సీపీఐ(ఎం), బీఆర్ఎస్, ఇతర వామపక్షాలు కలిసుండే అవకాశమున్నది. దీన్ని ఉపయోగించుకుని వచ్చే ఎన్నికల్లో శాసనసభలో కమ్యూనిస్టులు అడుగుపెట్టడం ఖాయం. ఈ యాత్ర అందుకు దోహద పడుతుంది.

స్టార్టప్‌లకు తగ్గిన నిధులు

- ఫండింగ్ ఒప్పందాల్లో 65 శాతం పతనం



బెంగళూరు: దేశంలోని స్టార్టప్‌లకు నిధుల సమీకరణ తగ్గింది. ప్రస్తుత ఏడాది ఫిబ్రవరిలో స్టార్టప్ ఫండింగ్ ఒప్పందాలు ఏకంగా 65 శాతం పడిపోయాయని ప్రయివేటు మార్కెట్ ఇంటిలిజెన్స్ కంపెనీ అయినా వెంచర్ ఇంటిలిజెన్స్ ఓ రిపోర్టులో తెలిపింది. 2023 జనవరిలో 62 డీల్‌లు, 2022 ఫిబ్రవరిలో 123 ఒప్పందాలతో పోలిస్తే గడిచిన ఫిబ్రవరిలో ఏకంగా 42 ఒప్పందాలు మాత్రమే జరిగాయి. మరోవైపు 2022 ఫిబ్రవరిలో స్టార్టప్‌లు ఏకంగా 4 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.3.2 లక్షల కోట్లు) సమీకరించగా.. గడిచిన ఫిబ్రవరిలో 536 మిలియన్ డాలర్లు (రూ.43వేల కోట్లు) మాత్రమే పొందగలిగాయి. క్రితం నెలలో టెక్నలాజీ రంగంలో అత్యధికంగా 16 స్టార్టప్ ఫండింగ్ ఒప్పందాలు జరిగాయి. వచ్చే కొన్ని నెలల పాటు పరిస్థితి ఇలాగే ఉండొచ్చని వెంచర్ ఇంటిలిజెన్సీ ఫౌండర్ అరుణ్ నట్రాజన్ పేర్కొన్నారు. నిధుల కొరత తీవ్రమవుతున్న క్రమంలోనూ స్టార్టప్ వ్యవస్థలో విలీనం, కొనుగోలు కార్యకలాపాలు కూడా బలంగా కొనసాగాయన్నారు. 2023 మొదటి రెండు నెలల్లో, భారతీయ స్టార్టప్ పర్యావరణ వ్యవస్థలో 10 విలీన, సంలీన ఒప్పందాలు జరిగాయన్నారు. రంగాల వారీగా ప్రభావం పరంగా ఫిన్‌టెక్, డి2సి ఇ-కామర్స్ సంస్థలు కొన్ని వ్యూహాత్మక సముపార్జనలను చూడగలవని నట్రాజన్ పేర్కొన్నారు. ఐటిసి వంటి పెద్ద కంపెనీలు సహా, ఇ కామర్స్ కంపెనీలు కూడా మంచి బ్రాండ్‌లను కొనుగోలు చేయడానికి వెతుకుతున్నాయన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ, టెక్ రంగంలో కీలకంగా మారుతోన్న స్టార్టప్ సంస్థలు గడ్డుకాలాన్ని ఎదుర్కొంటున్నాయని ఇటీవల పలు రిపోర్టులు వచ్చాయి. నిధులు లభ్యత తగ్గిపోయి.. నిరాశను చవిచూస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు ఇస్తున్న ప్రాధాన్యత ఈ చిన్న సంస్థలకు ఇవ్వడం లేదనే విమర్శలు నెలకొన్నాయి.

జూమ్ ప్రెసిడెంట్‌కు ఉద్వాసన



వాషింగ్టన్ : టెక్ కంపెనీల్లో ఇటీవల క్రింది నుంచి పై స్థాయి వరకు వేలాది ఉద్యోగుల తొలగింపులను చూస్తున్నాము. కానీ.. ఈ సారి ఏకంగా ఓ టెక్ దిగ్గజం ప్రెసిడెంట్ పదవికే ఎసరు రావడం విశేషం. ప్రముఖ వీడియో కాన్ఫరెన్సింగ్ సంస్థ 'జూమ్' ఎలాంటి కారణం లేకుండానే ఆ కంపెనీ ప్రెసిడెంట్ గ్రెగ్ టొంబ్‌కు ఉద్వాసన పలికింది. సేల్స్ ఆపరేషన్స్, ఎర్నింగ్స్ కాల్స్‌లో కీలక పాత్ర పోశించిన గ్రెగ్‌ను శుక్రవారం ఆ కంపెనీ తొలగించినట్లు రెగ్యూలేటరీ సంస్థలకు సమాచారం ఇచ్చింది. సంస్థ తరుపు నుంచి అన్నీ ప్రయోజనాలకు కల్పిస్తూ.. ఎలాంటి కారణం లేకుండానే తొలగించామని ఆ సంస్థ పేర్కొనడం విశేషం. ఫిబ్రవరిలో ఈ కంపెనీ తన 15 శాతానికి సమానమయ్యే 1300 మంది ఉద్యోగులను ఇంటికి పంపించింది. వైదొలగనున్న టొంబ్‌కు 45 మిలియన్ల విలువైన కంపెనీ స్టాక్స్‌తో పాటు 4లక్షల బిలియన్ డాలర్ల వేతనాన్ని చెల్లించనుంది. టొంబ్ స్థానంలో కొత్త వారిని నియమించనున్నట్లు ఆ కంపెనీ తెలిపింది.

200 స్టోర్లకు విస్తరించిన అసుస్

న్యూఢిల్లీ : ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ అసుస్ ఇండియా 200 స్టోర్లకు విస్తరించినట్లు ప్రకటించింది. న్యూఢిల్లీలోని నెహ్రూ ప్యాలెస్ వద్ద కొత్త స్టోర్‌ను తెరవడం ద్వారా ఈ మైలురాయికి చేరినట్లు తెలిపింది. వినియోగదారులకు కావాల్సిన పిసిలు, గేమింగ్ ల్యాప్‌టాప్‌లు, ఆల్ ఇన్ ఒన్ డెస్క్‌టాప్‌లు, ఇతర యాక్సెసరీలను ఇక్కడ ప్రదర్శన, అమ్మకానికి ఉంచినట్లు అసుస్ ఇండియా బిజినెస్ హెడ్ అర్నాల్డ్ సు పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా తమ రిటైల్ కార్యక్రమాలను వృద్ధి చేయడంతో పాటుగా భారతీయ మార్కెట్ పట్ల బ్రాండ్ నిబద్ధతను సైతం వెల్లడిస్తుందన్నారు. దేశంలో అసుస్ 2020లో 50 స్టోర్లను మాత్రమే కలిగి ఉండగా.. 2023 నాటికి ఆ సంఖ్య 200కు చేరిందన్నారు.

ప్రధానితో బిల్‌గేట్స్ భేటీ



న్యూఢిల్లీ : ప్రధాని మోడితో మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్ శనివారం భేటీ అయ్యారు. ఆరోగ్య రంగం, పర్యావరణ మార్పులు వంటి కీలక అంశాలపై ఇరువురూ చర్చించారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ప్రధానితో భేటీ వివరాల గురించి గేట్స్ తన అధికారిక బ్లాగ్‌లో రాశారు. భారత్ అన్ని రంగాల్లో రాణిస్తోందని పేర్కొన్నారు. భారత్ ఎంతో సమర్థమైన, భద్రమైన, అందుబాటు ధరల్లో ఉండే అనేక వ్యాక్సిన్లను పెద్ద మొత్తంలో ఉత్పత్తి చేసిందన్నారు. భారత్ తన ఆవిష్కరణలను ప్రపంచంతో పంచుకోవాలని ఆశిస్తున్నానని పేర్కొన్నారు.

హమాలీ వెల్ఫేర్ బోర్డు కోసం దశలవారీగా పోరాటం

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో వివిధ రంగాల్లో పనిచేస్తున్న ఐదు లక్షల మంది హమాలీ కార్మికుల రక్షణకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని దశలవారీగా పోరాటం చేయనున్నట్టు సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ ప్రకటించారు. శనివారం హైదరాబాద్‌లోని సీఐటీయూ సిటీ కార్యాలయంలో తెలంగాణ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ అనుబంధం) సమావేశం జరిగింది. ఆ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.రాములు అధ్యక్షత వహించిన సమా వేశంలో భూపాల్ మాట్లాడుతూ. హమాలీలకు పనిభద్రత, కనీసవేతనం, గుర్తింపు కార్డులు, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాదబీమా, పెన్షన్ వంటి కనీస సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని విమర్శించారు. అవి అమలైతే కార్మి కులకున్న 8 గంటల పని, కనీస వేతనాలు, చట్టబద్ధ హక్కులన్నీ హరించు కుపోతాయని చెప్పారు. సమ్మె చేసే హక్కు, సంఘం పెట్టుకునే హక్కు ప్రశ్నార్థకంగా మారుతాయన్నారు. కార్పొరేట్ సంస్థలకు కార్మికులను కట్టు బానిసలుగా మార్చే పనిలో మోడీ సర్కారు ఉందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను అదానీ వంటి బడా పెట్టుబడిదారులకు కారుచౌకగా అమ్మి వేస్తున్నారు. నిత్యావసర సరుకులు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచి పేదలపైన భారాలు మోపుతున్నారన్నారు. ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగూరు రాములు హమాలీల కార్యాచరణ ప్రణాళికను ప్రవేశపెట్టారు. ఈ నెల 11 నుంచి 20 వరకు హమాలీలకు వెల్ఫేర్ బోర్డు, స్థానిక సమస్యల పరిష్కారం కోసం సంతకాల సేకరణ, కరపత్రాల పంపిణీ ప్రచారం చేయా లని పిలుపునిచ్చారు. 20న మండల కేంద్రంలో ధర్నాలు చేసి తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేయాలన్నారు. 25న కలెక్టరేట్ల వద్ద ధర్నాలు చేయాల న్నారు. మోడీ సర్కారు అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ ఐదో తేదీన తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమానికి హమాలీ లు తరలివెళ్లాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శు లు పి. సుధాకర్, వై. సోమన్న యాదగిరి, వీరయ్య, రాపర్తి రాజు, ఉపాధ్యక్షు లు చెన్నయ్య, పుట్టా ఆంజ నేయులు, యు. శ్రీనివాస్, కోశాధికారి మామిడాల కనకయ్య పాల్గొన్నారు.

ఏప్రిల్ 5న ఢిల్లీలో గళం వినిపిద్దాం

కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికుల్లారా తరలిరండి

- బీజేపీ ప్రభుత్వ విధానాలు దేశానికి నష్టదాయకం
- ఐక్యపోరాటాలతో వాటిని తిప్పికొడదాం
- సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మికసంఘం ఆన్‌లైన్ బహిరంగ సభలో వక్తలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ ఐదో తేదీన ఢిల్లీలో తలపెట్టిన మజ్దూర్, కిసాన్ సంఘర్ష్ ర్యాలీని జయప్రదం చేయాలని వక్తలు కోరారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని తమ గళాలను మోడీ సర్కారుపై ఎక్కుపెట్టాలని కోరారు. మోడీ సర్కారు కార్పొరేట్ అనుకూల విధానాలు దేశ భవిష్యత్‌కే నష్టదాయకమని హెచ్చరించారు. ఐక్యపోరాటాలతో వాటిని తిప్పికొట్టాల్సిన బాధ్యత నిజమైన దేశభక్తులపై ఉందన్నారు. మజ్దూర్, కిసాన్ సంఘర్ష్ ర్యాలీని జయప్రదం చేయాలని కోరుతూ సీఐటీయూ, తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి ఆన్‌లైన్ బహిరంగ సభ నిర్వహించారు.

అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ మాట్లాడుతూ.. ఏప్రిల్ ఐదో తేదీన తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమానికి ఆహ్వానసంఘాన్ని ఏర్పాటు చేశామనీ, దానికి చైర్మెన్‌గా ప్రభాత్ పట్నాయక్ ఉన్నారని తెలిపారు. నాలుగు కేంద్రాల్లో ఏర్పాట్లు విస్తృతంగా జరుగుతున్నాయని చెప్పారు. రాష్ట్రం నుంచి వేలాది మంది తరలివచ్చి ఢిల్లీ వీధుల్లో తెలంగాణ పోరాట వారసత్వాన్ని చూపాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సుప్రీం కోర్టును అడ్డంపెట్టుకుని పోడు భూములకు పట్టాలివ్వకుండా అడ్డుకుంటున్న తీరును వివరించారు. గుడిసెలు వేసుకుని ఉంటున్న పేదలకు పట్టాలిచ్చి ఇండ్లు కట్టిస్తే బాగుంటుందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించారు. కులం, మతం పేరుతో ఉన్మాద చర్యలను ప్రోత్సహిస్తూ బీజేపీ రాజకీయ లబ్ది పొందుతున్నదనీ, వాటికి ప్రయోగశాలలుగా కర్నాటక, తెలంగాణను మార్చాలని చూస్తున్నదని విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజల ను చైతన్యపర్చాల్సిన అవసరం సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలపై ఉందని నొక్కి చెప్పారు. ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికుల పట్ల మోడీ సర్కారు అనుసరిస్తున్న విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కేంద్ర బడ్జెట్‌లో ఆహారభద్రతకు 90 వేల కోట్ల రూపాయల కోత పెట్టిన తీరును వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా ఏర్పడు తున్న ఆహార కొరతను ఆసరాగా తీసుకుని లక్షల కోట్ల రూపాయల లాభాలను గడించాలనే ఉద్దేశంతోనే అంబానీ, అదానీ కన్ను వ్యవసాయ రంగంపై పడిందన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వం దేశ సంపదను ఈస్టిండియా కంపెనీ దోచుకెళ్తే...ఇప్పుడు నార్తిండియా కంపెనీలు దేశ సంపదను కొల్లగొడుతున్నాయని విమర్శించారు. అంబానీ, అదానీలకు అనుకూలంగానే కేంద్ర ప్రభుత్వం మూడు వ్యవసాయక చట్టాలను తేవాలని చూసిందన్నారు. రైతులు ఐక్యంగా వాటిని తిప్పికొట్టారని కొనియాడారు. అదానీ కార్పొరేట్ కంపెనీల డొల్లతనంపై సెబీ, ఆర్‌బీఐ సంస్థలు ఎందుకు విచారణ చేపట్టడం లేదని ప్రశ్నించారు. దేశ ఆర్థిక స్వాతంత్ర్యాన్ని, రాజ్యాంగాన్ని, లౌకికత్వాన్ని కాపాడుకోవా ల్సిన బాధ్యత ప్రతి ఒక్క పౌరుడిపైనా ఉందని చెప్పారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు మాట్లాడుతూ.. మోడీ సర్కారు విధానాల వల్ల దేశ సంపద సృష్టికర్తలైన కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు దుర్భర జీవితాలను అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పనిప్రదేశాల్లో యూనియన్లు పెట్టుకునే హక్కు కూడా లేకుండా చేసే పనిలో మోడీ సర్కారు ఉందని విమర్శించారు. అప్రెంటిస్, ట్రైంబాండ్ పేరుతో పర్మినెంట్ ఉద్యోగాలు లేకుండా కార్పొరేట్లకు లబ్ది చేకూర్చే పనిలో బీజేపీ ఉందన్నారు. నిత్యావసరాలు, ఇతర ధరల పెరుగుదలతో కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలనే డిమాండ్ వస్తుంటే...మోడీ సర్కారు మాత్రం రోజుకు రూ.178 వేతనం అయితే చాలు అని చెప్పటం దుర్మార్గమని విమర్శించారు. ఉపాధి హామీ చట్టాన్ని బలహీనం చేసే కుట్ర జరుగుతున్నదన్నారు. పెట్టుబడికి వ్యతిరేకంగా పోరాటాలు చేయకుండా కులం, మతం పేరుతో ప్రజలను చీల్చే దుర్మార్గపు కుట్రకు ఆర్ఎస్ఎస్ పూనుకున్నదనీ, దీన్ని పసిగట్టి ప్రజలు ఐక్యమై తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ మాట్లాడుతూ..కనీస మద్దతు ధర హామీ చట్టం తీసుకొస్తామని రాతపూర్వకంగా హామీనిచ్చి రైతులను మోడీ సర్కారు నిలువునా మోసం చేసిందని విమర్శించారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు బడ్జెట్‌లో కేవలం లక్ష రూపాయలు కేటాయించడమేమిటని ప్రశ్నించారు. పత్తి కొనుగోలు బాధ్యతనుంచి కేంద్రం తప్పుకోవాలని చూస్తున్న దని విమర్శించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక రైతుల ఆత్మహత్యలు పెరిగాయన్నారు. సహకార రంగాన్ని నిర్వీర్యం చేసే బిల్లును పార్లమెంట్ ముందుకు తేవడం దారుణమన్నారు. సహకార రంగాన్ని కేంద్రం తన గుప్పిట్లోకి తీసుకుని కార్పొరేట్లకు అప్పగించే పనిలో పడిందని విమర్శించారు. విద్యుత్ సవరణ బిల్లు పాసైతే రైతులకు ఉచిత కరెంటు పోయి మీటర్లు వస్తాయన్నారు. ఇప్పుడొస్తున్న రూ.200, 300 ఇంటి కరెంటు బిల్లులు కాస్తా రూ.800, రూ.1000కి చేరే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ ఆన్‌లైన్ బహిరంగ సభకు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ అధ్యక్షవర్గంగా వ్యవహ రించారు. ఈ సభలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.జంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలను సవరించండి

కార్మికశాఖ ప్రధాన కార్యదర్శి ఐ.రాణికుముదినికి సీఐటీయూ వినతి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్‌లో కనీస వేతనాలను సవరించాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని బీఆర్‌కే భవన్‌లో కార్మికశాఖ ప్రధాన కార్యదర్శి ఐ.రాణి కుముదినికి సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు, కనీస వేతనాల సలహా మండలి సభ్యులు భూపాల్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేశ్ వినతిపత్రాన్ని అందజేశారు. 75 షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్‌లో వేతనాలు సవరించ లేదనీ, దీనివల్ల కోటి మందికి పైగా కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని ప్రధాన కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు. 2014 నుంచి ఇప్పటివరకు రెండుసార్లు కనీస వేతనాల సలహా మండలి రాష్ట్ర ప్రభుత్వానికి రెండుసార్లు ప్రతిపాదనలు పంపితే పెండింగ్‌లో పెట్టడం దారుణమని పేర్కొన్నారు. కనీస వేతనాలు సవరిస్తూ వెంటనే జీఓలు ఇవ్వాలని కోరారు. చట్టప్రకారం ప్రభుత్వం మూడుసార్లు వేతనాలు సవరించక పోవడం వల్ల కార్మికులు ఆర్థికంగా నష్టపోయారన్నారు. యజమానులు చెల్లించాల్సిన వేతనాలను ప్రభుత్వం నిర్ణయించకపోవడం వల్ల పరిశ్రమల యజమానులు విపరీతంగా లాభాలు పొందారని గుర్తుచేశారు. 2021 జూన్‌లో ఐదు రంగాలకు జీఓ నెం.21, 22, 23, 24, 25 ఫైనల్ నోటిఫికేషన్స్ ఇచ్చారనీ, అన్‌స్కిల్డ్ వర్కర్‌కు మినిమం బేసిక్ రూ.18,019, వీడీఏ రేటు రూ.12 నిర్ణయించిన విషయాన్ని ప్రస్తావించారు. గెజిట్ చేయకపోవడం వల్ల అవి అమల్లోకి రాలేదని వాపోయారు. పరిశ్రమల్లో కాంట్రాక్టు కార్మికుల సంఖ్య 90 శాతం ఉందనీ, అందులోనూ అంతర్రాష్ట్ర వలస కార్మికులు ఎక్కువ మంది ఉన్నారని చెప్పారు. వారికి కాంట్రాక్ట్ లేబర్ యాక్ట్ గానీ, 1979 అంతర్రాష్ట్ర వలస కార్మికుల చట్టం అమలు చేయడంలేదని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. వలస కార్మికుల రక్షణ కోసం కనీస చర్యలు తీసుకోవడం లేదనీ, కార్మిక శాఖ ద్వారా అన్ని పరిశ్రమల్లోనూ తనిఖీలు చేయించాలని కోరారు. కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలని విన్నవించారు. పెరుగుతున్న శాస్త్ర సాంకేతికత దృష్ట్యా రోజుకు 7 గంటలు, వారానికి 5 రోజుల పని దినం అమలు చేయాలని కోరారు. కాంట్రాక్ట్ కార్మికులకు చట్టబద్ధ సౌకర్యాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వలస కార్మికులకు 1979 అంతర్ రాష్ట్ర వలస కార్మిక చట్టం ప్రకారం హక్కులు అమలు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ రాణి కుముదిని మాట్లాడుతూ హైకోర్టులో కొందరు కేసు వేయడం వల్ల, కొత్తగా బోర్డు నామినేట్ చేయాల్సి ఉండటంతో జీఓలు ఇవ్వడం ఆలస్యమైందని తెలిపారు. సీఐటీయూ వినతిపత్రాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి పంపుతామనీ, సమస్యలను పరిష్కారమయ్యేలా చూస్తామని హామీనిచ్చారు.

సీనియర్ అధికారుల సలహాలు తప్పని సరి

- కొత్త జిల్లాల ఎస్పీలకు డీజీపీ సూచనలు

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

శాంతి భద్రతల పరిరక్షణ మొదలు క్లిష్టతరమైన నేరాల పరిశోధనలో సీనియర్ పోలీసు అధికారుల సలహాలు తీసుకుని ముందుకు సాగాలని జిల్లాల ఎస్పీలుగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన అధికారులకు రాష్ట్ర డీజీపీ అంజనీ కుమార్ సూచించారు. శనివారం కొత్త ఎస్పీలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ముఖ్యంగా భారీ ఎత్తున జన సమూహం వచ్చే ప్రాంతాలలో తొక్కిసలాటలు జరిగి ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడే ప్రమాదముంటుందని ఆ సమయంలో పలు ముందస్తు జాగ్రత్తలు ముందుగానే తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. గతంలో ఏపీలో గోదావరి పుష్కరాలు, ఇటీవల జరిగిన ఒక పార్టీ బహిరంగసభలో చోటు చేసుకున్న తొక్కిసలాటలో ప్రజల ప్రాణాలు పోయాయని ఉదహరించారు. ఇలాంటి పరిస్థితి ఎదురు కాకుండా ముందుగానే పకడ్బందీగా ప్లాన్ వేసుకొనీ, బందోబస్తు స్కీము ను తయారు చేసుకుని అమలు చేయాలని ఆయన అధికారులకు సూచించారు.

11న ఎస్సై సాంకేతిక పోస్టులకు పరీక్షలు

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో సాగుతున్న ఎస్సై తత్సమాన పోస్టులకు తుది రాత పరీక్షలో భాగంగా ఎస్సై (ఐటీ) పోస్టులకు ఈనెల 11న తుది రాత పరీక్ష జరపనున్నట్టు రాష్ట్ర పోలీసు రిక్రూట్‌మెం ట్ బోర్డు చైర్మెన్ వీవీ శ్రీనివాస రావు శనివారం తెలిపారు. అదే రోజు ఏఎస్ఐ (ఫింగర్ ప్రింట్స్) పోస్టులకూ అభ్యర్థులకు తుది రాత పరీక్ష నిర్వహిస్తున్నట్టు ఆయన చెప్పారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు ఎస్ఐ (ఐటీ) అభ్యర్థులకు టెక్నికల్ పేపర్ ఉంటుందనీ, అలాగే మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు ఏఎస్ఐ (ఎఫ్‌బీ) టెక్నకల్ పేపర్ ఉంటుందని ఆయన తెలిపారు.

ముమ్మరంగా మాణిక్‌రెడ్డి ప్రచారం

10 ఉపాధ్యాయ సంఘాల మద్ధతు

- తొమ్మిది జిల్లాల్లో భారీస్పందన



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు తుది దశకు చేరుకున్నాయి. ఈనెల 13న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో ఆయా సంఘాల అభ్యర్థులు ప్రచారంలో తలమునకలయ్యారు. మొత్తం తొమ్మిది జిల్లాల్లో 137 పోలింగ్ స్టేషన్లను కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది. అలాగే 29,720 మంది టీచర్లు ఓటును నమోదుచేసుకున్నారు. వీరందరిని ఇటు పాఠశాలల్లో, అటు వ్యక్తిగతంగానూ కలిసి ఓటును అభ్యర్థించేందుకు అభ్యర్థులు పోటీపడుతున్నారు. ప్రధానంగా తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్‌యూటీఎఫ్) నుంచి స్వతంత్ర అభ్యర్థిగా ఎమ్మెల్సీ బరిలోకి దిగిన పాపన్నగారి మాణిక్‌రెడ్డి ప్రచారాన్ని తనదైన శైలీలో నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయుల అభిమానాన్ని చూరగొనేందుకు గత రెండు నెలలుగా విస్తృతంగా జిల్లాల్లో పర్యటిస్తున్నారు. అలాగే ఆ సంఘం రాష్ట్ర నాయకత్వం చురుగ్గా అన్ని జిల్లాల్లో పర్యటిస్తూ ముందుకు పోతున్నారు. దాదాపు పది ఉపాధ్యాయ సంఘాలు మాణిక్‌రెడ్డికి ఇప్పటికే మద్దతు ప్రకటించాయి. ఆయన తరపున స్వచ్ఛందంగా ప్రచారం చేస్తున్నాయి. వ్యక్తిగత ప్రలోభాలకు లొంగరాదనీ, విద్యారంగాన్ని కాపాడుకుందామనీ, మన సమస్యలను చట్టసభల్లో ప్రస్తావించడం, చర్చించడం ద్వారా పరిష్కరించుకుందామని మాణిక్‌రెడ్డి అనేక పాఠశాలల్లో జరుగుతున్న ఎన్నికల ప్రచార సభలు, సమావేశాల్లో చెబుతున్నారు. అభ్యర్థితోపాటు ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పి.జంగయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి , ఇతర రాష్ట్రస్థాయి ఆఫీసు బేరర్ల నేతృత్వంలో మొత్తం అన్ని జిల్లాల్లో మాణిక్‌రెడ్డి తరపున ప్రచారం జరుగుతున్నది. ఇకపోతే నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల నుంచి ఉపాధ్యాయులు వచ్చి ప్రచారం చేస్తుండటం గమనార్హం. నేడు విద్యారంగం ఎదుర్కొంటున్న సవాళ్లు, మతోన్మాద ప్రభావం, యూజీసీ నిర్వీర్యం, సిలబస్‌ను కలుషితం చేయడం, ఇతర ఉపాధ్యాయుల సమస్యలు తదితర అంశాలపై ఉపాధ్యాయుల్లో చైతన్యం పెంచే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లాలో మంచి ప్రభావం కనిపిస్తున్నదనీ, టీచర్లు, లెక్చరర్లు, యూనివర్సిటీల అధ్యాపకులు ఆదరణ చూపిస్తున్నారని ఆ సంఘం నేతలు చెబుతున్నారు. సర్వీసులో చేరిననాటి నుంచి ఉపాధ్యాయ సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తున్న నేతగా మాణిక్‌రెడ్డికి మంచి గుర్తింపు ఉంది. ప్రత్యేక విద్యావాలంటీర్లను పర్మినెంట్ చేయించడంలో రాష్ట్రసంఘంతో కలిసి రాజీలేని ఉద్యమాలు నిర్వహించిన చరిత్ర మాణిక్‌రెడ్డిది. అందుకే ఉపాధ్యాయ ఉద్యమ చుక్కాని, మాజీ ఎమ్మెల్సీ చుక్కా రామయ్య ఆశీస్సులు మాణిక్‌రెడ్డికి లభించాయి. అలాగే విద్యార్థులు, యువత, గ్రాడ్యుయేట్లు, ప్రజల సమస్యలపై శాసనమండలిలో గర్జించిన ప్రొఫెసర్ డాక్టర్ కె.నాగేశ్వర్ సైతం మాణిక్‌రెడ్డికి తన సంపూర్ణ మద్దతును ప్రకటించడం విశేషం. అనారోగ్యంతో నామినేషన్ కార్యక్రమానికి చుక్కా రామయ్య రాలేకపోయినా, నాగేశ్వర్ మాత్రం దగ్గరుండి నిండు మనస్సుతో మాణిక్‌రెడ్డిచేత నామినేషన్ వేయించారు. ఆయన తనదైనరీతిలో మాణిక్‌రెడ్డికి ప్రచారం చేస్తున్నారు. ఇక ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అయితే కాలికి బొంగురం కట్టుకుని అన్ని జిల్లాల్లో తిరుగుతుండటం అందరికి తెలిసిందే. ఈనేపథ్యంలో ఉపాధ్యాయుల్లో టీఎస్‌యూటీఎఫ్ అభ్యర్థి పట్ల సానుకూలత వ్యక్తమవు తున్నది. పోరాడే సంఘం అభ్యర్థిగా గుర్తింపు వస్తున్నది. గతంలో ఉన్న ఎమ్మెల్సీలు సర్కారులో కలిసిపోవడం, ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై ప్రభు త్వంతోగానీ, సీఎంతోగాని చర్చించక నిర్లక్ష్యంగా ఉండటం, అలక్ష్యం వహించడం పట్ల వ్యతిరేకత వ్యక్తమవుతున్న సంగతి తెలిసిందే. అలాగే శాసనమండలిలోనూ ప్రస్తావించిన పాపానపో లేదు. దీంతో ఆ సంఘం నుంచి ప్రస్తుత ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థిపైనా పెదవివిరిచే పరిస్థితి ఏర్పడింది. అంతేగాక ఒకే సంఘం నుంచి తాజా ఎన్నికల్లో ఇద్దరు అభ్యర్థులు రంగంలో ఉండటంతో ఉపాధ్యా యలోకంలో విస్మయం వ్యక్తమవుతున్నది. ఈ తరుణంలో మాణిక్‌రెడ్డి హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, మేడ్చల్, వికారాబాద్, జోగులాంబ-గద్వాల, వికారాబాద్, నారాయణ్‌పేట్, వనపర్తి , నాగర్‌కర్నూల్ జిల్లాల్లో విస్తృతంగా తిరుగుతున్నారు.



పది సంఘాల మద్ధతు

టీఎస్‌యూటీఎఫ్ అభ్యర్థి పాపన్నగారి మాణిక్‌రెడ్డికి ప్రత్యక్షంగా పది ఉపాధ్యాయ సంఘాలు మద్ధతు ప్రకటించాయి. పరోక్షంగా మరికొన్ని సంఘాలు సహకారాన్ని అందిస్తున్నాయి. ప్రచారంలో పాల్గొంటున్నాయి. కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్, తెలంగాణ ఆల్ రెసిడెన్షియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్, పాలిటెక్నిక్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్, కాలేజ్ లెక్చరర్స్ అసోసియేషన్, కేజీబీవీ ఎంప్లాయిస్ అసోసియేషన్, మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ ఎంప్లాయిస్ అసోసియేషన్, బీసీ వెల్ఫేర్ టీచర్స్ అసోసియేషన్, ఐక్య గురుకులాల ఉపాధ్యాయ ఫెడరేషన్ తదితర సంఘాలు మాణిక్‌రెడ్డికి మద్దతు ప్రకటిస్తూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాలని విజ్ఞప్తి చేశాయి. విద్యారంగంతోపాటు ఉపాధ్యాయుల సమస్యలపై స్పష్టమైన అవగాహన ఉన్న మాణిక్‌రెడ్డిని శాసనమండలికి పంపాలని కోరుతున్నాయి.

మోడల్ బ్యాలెట్‌లో సీరియల్ నెం.17

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొత్తం 21 మంది అభ్యర్థులు ఆయా సంఘాల నుంచి పోటీచేస్తున్నారు. ఎన్నికల సంఘం బ్యాలెట్ పేపర్‌ను సైతం ఖరారు చేసింది. ఆ మేరకు టీఎస్‌యూటీఎఫ్ అభ్యర్థి పాపన్నగారి మాణిక్‌రెడ్డికి సీరియల్ నెంబరు 17ను కేటాయించింది. ఇప్పటికే పలుమార్లు పాఠశాలలు, ఉపాధ్యాయులను కలిసిన టీఎస్‌యూటీఎఫ్ నేతలు, తాజా మోడల్ బ్యాలెట్‌తో తుది అంకంలోకి దిగారు. మోడల్ బ్యాలెట్‌ను పట్టుకుని ఉపాధ్యాయులను ఉమ్మడిగా, వ్యక్తిగతంగా కలిసే పనిలో ఉన్నారు.

గెలిపిస్తే మీ గొంతునవుతా: మాణిక్‌రెడ్డి

"విద్యారంగం, ఉపాధ్యాయ సమస్యలు దీర్ఘకాలికంగా పెండింగ్‌లోనే ఉంటున్నాయి. శాసనమండలిలో ప్రస్తావించిన వాళ్లు మౌనంగా వహిస్తున్నారు. అధికార పార్టీతో మిలాఖత్ అయి ఉపాధ్యాయులను దారుణంగా మోసం చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో నన్ను గెలిపిస్తే వ్యక్తి గత సమస్యలకుపోకుండా, స్వార్థాన్ని చూసుకోకుండా ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారమే ఏకైక ఎజెండాగా శాసనమండలిలో మీ గొంతును వినిపిస్తా"నని నామినేషన్ కార్యక్రమంలో పది సంఘాలు బలపరిచిన టీఎస్‌యూటీఎఫ్ అభ్యర్థి పాపన్నగారి మాణిక్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

పరిశ్రమల అభివృద్ధికి.. ఐటీ హబ్ ఒక ఆరంభం

- ఇక నిజామాబాద్‌కూ పరిశ్రమలు వస్తాయ్
- తుదిదశకు పనులు.. త్వరలో ప్రారంభం : ఎమ్మెల్సీ కవిత

నవతెలంగాణ-కంఠేశ్వర్

పరిశ్రమల అభివృద్ధికి ఐటీ హబ్ ఒక ఆరంభం లాంటిదని, ఇంకా ఎన్నో పరిశ్రమలు నిజామాబాద్‌కు రానున్నాయని, త్వరలో ఐటీ హబ్ ప్రారంభిస్తామని, దీనికోసం సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఎంతో శ్రద్ధ తీసుకుంటున్నారని ఎమ్మెల్సీ కవిత తెలిపారు. వారికి ధన్యవాదాలు తెలిపారు. నిజామాబాద్ నగరంలో ఐటీ హబ్ పనులను అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తతో కలిసి శనివారం పరిశీలించారు. ఐటీ హబ్ వెబ్‌సైట్‌పై టీఆర్‌ఎస్ ఎన్నారై గ్లోబల్ కన్వీనర్ బిగాల మహేశ్ గుప్త ఎమ్మెల్సీకి వివరించిన అనంతరం కవి త వెబ్‌సైట్‌ను ప్రారంభించారు.కవిత మాట్లాడు తూ.. యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా చేపట్టిన ఐటీ హబ్ పనులు తుది దశకు చేరుకున్నాయన్నారు. అతి త్వరలో కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభం చేయిస్తామని, ఇతర జిల్లాల ఐటీ హబ్‌లతో పోల్చు కుని లోటుపాట్లను సరిదిద్ది నిజామాబాద్ ఐటీ హబ్ ను ఏర్పాటు చేసుకున్నట్టు తెలిపారు. రూ.50 కోట్ల వ్యయంతో చేపట్టిన ఐటీ హబ్‌లో 750 మంది యువతకు అవకాశం ఉందని, ఇప్పటికే 200 పై చిలుకు సీట్లు ఒప్పందాలు పూర్తి అయ్యాయని చెప్పా రు. దేశ వ్యాప్తంగా ఐటీ ఎక్స్‌పోర్ట్‌లో రెండవ స్థానం లో ఉన్నామని తెలిపారు. భవిష్యత్ ప్రణాళికతో నిర్మా ణాలు చేయించిన ఎమ్మెల్యే గణేశ్, ఎన్నారై కోఆర్డి నేటర్ మహేశ్ బిగాలకు అభినందనలు తెలియ జేశారు. జిల్లాలో విమానాశ్రయ ఏర్పాటు అంశాన్ని కూడా పరిశీలిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నిజామాబాద్ నగర మేయర్ దండు నీతూ కిరణ్ శేఖర్, బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు తెలంగాణ సాహితి 'మహిళా ఫెస్ట్'

- ప్రముఖుల అంతరంగ ఆవిష్కరణ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అంతర్జాయతీ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ సాహితి ఆధ్వర్యంలో 'మహిళా ఫెస్ట్' నిర్వహిస్తున్నది. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని దొడ్డి కొమరయ్యహాల్ బైరి ఇందిర ప్రాంగణంలో నిర్వహించనున్న మహిళా ఫెస్ట్‌లో ప్రముఖ కవయిత్రులు, రచయిత్రులు, వివిధ రంగాల్లో ప్రముఖులు ఈ సందర్భంగా తమ అంతరంగాన్ని ఆవిష్కరించనున్నారు. పురిమళ్ల సునంద, తాళ్లపల్లి యాకమ్మ, నస్రీన్‌ఖాన్, రూపా రుక్మిణి, సలీమ, విఠలాపురం పుష్పలత, మేరెడ్డి రేఖ తదితరులు మహిళా ఫెస్ట్‌ను నిర్వహించనున్నారు.

ఎవరినీ వదిలిపెట్టం

- నవీన్ హత్య కేసులో లోతైన దర్యాప్తు జరుగుతోంది: సీపీ

నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన నవీన్ హత్య కేసులో లోతైన దర్యాప్తు కొనసాగుతోందని రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ స్పష్టం చేశారు. నవీన్ హత్య కేసులో మరిన్ని విషయాలను రాబట్టేందుకు నిందితుడు హరిహరకృష్ణను శుక్రవారం పోలీసులు ఏడు రోజుల కస్టడీకి తీసుకున్న విషయం తెలిసిందే. అయితే, శనివారం ఎల్బీనగర్‌లోని రాచకొండ సీపీ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓ సమావేశంలో సీపీ మాట్లాడారు. నవీన్ హత్య కేసును అన్ని కోణాల్లో విచారిస్తున్నామని తెలిపారు. అమ్మాయి పాత్రపై ఎలాంటి సమాచారమూ లేదన్నారు. హత్య తర్వాత, అంతకు ముందు నిందితుడు ఎవరెవరిని కలిశాడని ఆరా తీస్తున్నామన్నారు. ఈ ఘటనలో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఎంతమంది ఉన్నారనే కోణంలో విచారణ జరుగుతోందని తెలిపారు. ఎవరికైనా నిందితుడితో సంబంధాలున్నట్టు తెలిస్తే ఎంతటి వారైనా వదిలే ప్రసక్తేలేదన్నారు. కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మొత్తం కేసును సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేస్తున్నారా అన్న ప్రశ్నకు విచారణలో ఉన్న సమయంలో అదనపు వివరాలు వెల్లడించలేమని సీపీ స్పష్టం చేశారు.

కార్పొరేట్ కాలేజీలను కట్టడి చేయాలి

- ఇంటర్ బోర్డు నిబంధనలు పాటించేలా చర్యలు చేపట్టాలి
- టీపీజేఎంఏ అధ్యక్షులు గౌరి సతీశ్ డిమాండ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో కార్పొరేట్ కాలేజీలను కట్టడి చేయాలని తెలంగాణ ప్రయివేటు జూనియర్ కాలేజీల యాజమాన్యాల సంఘం (టీపీజేఎంఏ) అధ్యక్షుడు గౌరి సతీశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్పొరేట్ కాలేజీల్లో విద్యార్థులు ఒత్తిడికి గురవుతూ ఆత్మహత్యలకు పాల్పడ్డం దురదృష్టకరమని అన్నారు. శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటర్ బోర్డు ప్రతిపాదించిన నిబంధనలు కార్పొరేట్ కాలేజీలు పాటించేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకే తరగతులను నిర్వహించాలన్నారు. కానీ కార్పొరేట్ కాలేజీల్లో ఉదయం ఆరు నుంచి రాత్రి 10 గంటల వరకు స్టడీ అవర్ల పేరుతో తరగతులు నిర్వహించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. మానసిక ఒత్తిడికి గురికావడం వల్లే ఇటీవల సాత్విక్ ఆత్మహత్య చేసుకున్నారని చెప్పారు. కార్పొరేట్ కాలేజీలు వ్యాపార దృక్పథంతో విద్యార్థుల మానసిక ఉల్లాసం, ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకోకుండా వ్యవహరించడం సరైంది కాదన్నారు. విద్యార్థులను మర యంత్రాలుగా తయారు చేస్తున్నాయని విమర్శించారు. ప్రజల రక్తాన్ని ఫీజుల రూపంలో జలగల్లా పీల్చుతున్నాయని చెప్పారు. కార్పొరేట్ కాలేజీల్లో పీఆర్వో విధానాన్ని నిషేధించాలని కోరారు. ఇప్పటికే వచ్చే విద్యాసంవత్సరానికి 70 శాతం వరకు ప్రవేశాలు పూర్తయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ కాలేజీలు, నిరుద్యోగ పట్టభద్రులు ఏర్పాటు చేసిన బడ్జెట్ కాలేజీలు వేర్వేరని అన్నారు. నీట్, జేఈఈ, ఎంసెట్‌లో ర్యాంకులు రాకపోయినా అధైర్య పడొద్దనీ, ఇతర ఉన్నత విద్యావకాశాలుంటాయని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం యూనిఫాం ఫీజు విధానాన్ని అమలు చేయాలన్నారు. అడ్మిషన్ల విధానం నిబంధనల ప్రకారమే చేపట్టాలని కోరారు. ఇంటర్ బోర్డు నిబంధనలు కచ్చితంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీపీజేఎంఏ కోర్‌కమిటీ సభ్యులు కె బాలకృష్ణారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి తిప్పారెడ్డి, ఎన్‌సీ పార్థసారధి, నాయకులు డి సుధీర్‌రెడ్డి, ఉస్మాన్, ఉమాశంకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో... గుండెజబ్బు పిల్లలకు శస్త్రచికిత్సలు

- మంత్రి హరీశ్ రావు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గుండెజబ్బు కలిగి శస్త్రచికిత్స అవసరమైన చిన్నారులకు ప్రభుత్వాస్పత్రుల్లోనే చేసేలా అవసరమైన మౌలిక సదుపాయాలు, సిబ్బంది తదితర ఏర్పాట్లు చేస్తున్నట్టు వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు తెలిపారు. రాష్ట్రంలో ప్రతి ఏటా ఆరు లక్షల జననాలు జరుగుతుండగా, అందులో 5,400 మంది వరకు పిల్లల్లో గుండె జబ్బులుంటున్నాయనీ, వారిలో వెయ్యి మంది వరకు శస్త్రచికిత్స అవసరముంటుందని వివరించారు. పేదలు కార్పొరేట్‌కి వెళ్ళలేక, సరైన సమయంలో వైద్యం అందక కొందరు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మానవీయకోణంలో ఆలోచించి వీరికి శస్త్ర చికిత్సలను ప్రభుత్వాస్పత్రుల్లో నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఇటీవల తొమ్మిది మంది చిన్నారులకు నిమ్స్, నీలోఫర్‌లో గుండె శస్త్రచికిత్సలు నిర్వహించిన వైద్యులకు సహకరించిన బ్రిటన్ వైద్య బృందానికి నిమ్స్‌లో శనివారం సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ డాక్టర్ వెంకట రమణ దన్నపనేని తమ బృందంతో వచ్చి నిలోఫర్, నిమ్స్ వైద్యులకు సహకారం అందించారు. అందరూ కలిసి తొమ్మిది మంది చిన్నారులకు సర్జరీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిమ్స్ ఇంచార్జి డైరెక్టర్ బీరప్ప, నిలోఫర్ సూపరింటెండెంట్ ఉషారాణి, సర్జరీలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ శుభాకాంక్షలు తెలిపారు. తనకు జన్మనిచ్చిన రాష్ట్రంలోని ప్రజలకు సేవ చేయాలని వచ్చిన డాక్టర్ రమణకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

నిమ్స్‌లో కొత్త బ్లాక్ ఏర్పాటు చేస్తున్నామనీ, 32 ఎకరాల ప్రభుత్వ భూమిని నిమ్స్‌కు అప్పగించామనీ, మరో 2,000 పడకలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. భవిష్యత్ అవసరాలు తీర్చేలా హైదరాబాద్ నాలుగు వైపులా నాలుగు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు రానున్నాయన్నారు. వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి దసరా నాటికి సిద్ధమవుతుందని తెలిపారు.

మహిళా ఉద్యోగుల హక్కులకు ప్రాధాన్యత

- టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎమ్‌డీ జి రఘుమారెడ్డి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగుల హక్కులకు తొలి ప్రాధాన్యత ఇస్తామని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్‌-ఎస్పీడీసీఎల్) సీఎమ్‌డీ జీ రఘుమారెడ్డి తెలిపారు. వారి సమస్యల పరిష్కారంలో ఏ స్థాయిలోనూ పెండింగ్ ఫైల్స్ లేవన్నారు. మింట్ కాంపౌండ్‌లోని సంస్థ ప్రధాన కార్యాలయంలో విద్యుత్ మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. దీనికాయన ముఖ్య అతిధిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి, శుభాకాంక్షలు తెలిపారు. బదిలీలు, పోస్టింగుల్లో మహిళలకు తొలి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం కోసం మింట్ కాంపౌండ్‌లో స్థలాన్ని కేటాయించామన్నారు. ప్రస్తుతం సంస్థలో 11,260 మంది రెగ్యులర్ ఉద్యోగులు ఉంటే, వారిలో 1,723 మంది మహిళా ఉద్యోగులు వున్నారని తెలిపారు. ప్రస్తుతం జూనియర్ లైన్‌మెన్ పోస్టుల్లో సైతం మహిళలకు అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. అన్నింటా మహిళలకు సమాన అవకాశాలు లభిస్తున్నాయని వివరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీమతి జ్యోతి రాణి, శ్రీమతి తులసి నాగరాణి మాట్లాడుతూ అసోసియేషన్ బిల్డింగ్ కోసం జాగా ఇచ్చినందుకు సభాముఖంగా ధన్యవాదాలు తెలిపారు. అనంతరం పలు పోటీల్లో గెలుపొందిన ఉద్యోగినులకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు టి శ్రీనివాస్, జి పర్వతం, సీహెచ్ మదన్‌మోహన్‌రావు, ఎస్ స్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ వర్సిటీ పీజీ డిప్లొమా కోర్సుల బ్రోచర్ ఆవిష్కరణ

- ప్రవేశాల దరఖాస్తుకు చివరి తేది 10

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డాక్టర బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం కొత్తగా ప్రవేశపెట్టిన పీజీ డిప్లొమా కోర్సుల బ్రోచర్‌ను ఆ వర్సిటీ ఉపకులపతి కె సీతారామారావు శనివారం విడుదల చేశారు. కామర్స్ విభాగం ఆధ్వర్యంలో ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రవేశపెట్టిన కోర్సుల్లో పీజీ డిప్లొమా ఇన్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, పీజీ డిప్లొమా ఇన్ మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, పీజీ డిప్లొమా ఇన్ హ్యూమన్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్, పీజీ డిప్లొమా ఇన్ ఆపరేషన్ మేనేజ్‌మెంట్ కోర్సులున్నాయని ఆ విభాగ డీన్ ఆనంద్‌పవార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా కోర్సులకు దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేది ఈనెల పది వరకు ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ ఘంటా చక్రపాణి, ఈ సుధారాణి, షకీలా ఖాణం, వడ్డానం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా వర్సిటీ ఇన్‌చార్జి వీసీగా విజ్జులత

- ప్రభుత్వ నియామకం
- ఉన్నత విద్యలో స్త్రీలు ముందుండాలి : మంత్రి సబిత



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం మొదటి ఇన్‌చార్జీ ఉపకులపతి (వీసీ)గా ప్రొఫెసర్ ఎం విజ్జులతను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఆమెకు విద్యామంత్రి పి సబితా ఇంద్రారెడ్డి, ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి, ఓయూ వీసీ డి రవీందర్ శనివారం మంత్రి నివాసంలో కలిసి అభినందించారు. ఉన్నత విద్యలో మహిళలు ముందంజలో ఉండేలా తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం కృషి చేయాలని మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆకాంక్షించారు. ఇన్‌చార్జి వీసీగా ఎం విజ్జులత నియామకం పట్ల ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావుకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. అంతరాజ్తీయ ప్రమాణాలకు అనుగుణంగా నూతన కోర్సులను ప్రవేశపెట్టాలని నూతన వీసీకి సూచించారు. ఈ విశ్వవిద్యాలయం అభివృద్ధికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.100 కోట్లు కేటాయించామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. వర్సిటీ అవసరాలు, ఇతర పరిస్థితులకు సంబంధించి కార్యాచరణ రూపొందించాలని ఉన్నత విద్యామండలి చైర్మెన్ లింబాద్రికి సూచించారు. బోధనా సౌకర్యాలు, విద్యార్థినులకు కావాల్సిన వసతులు, మౌలిక సదుపాయాలను అభివృద్ధి పరచాలని కోరారు. వీసీగా నియమించడం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి విజ్జులత కృతజ్ఞతలు తెలిపారు. మౌలిక వసతులను మెరుగుపర్చి విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. కోఠి మహిళా కళాశాలను తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయంగా గతేడాది ఏప్రిల్ 25న ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి వీసీని నియమించకపోవడం గమనార్హం.

ఓపెన్ టెన్త్, ఇంటర్ తత్కాల్ ఫీజు గడువు పెంపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఓపెన్ పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు తత్కాల్ ద్వారా ఫీజు చెల్లింపు గడువును రాష్ట్ర ప్రభుత్వం మరోసారి పొడిగించింది. ఈనెల పదో తేదీ వరకు ఫీజు చెల్లింపునకు అవకాశముందని తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) డైరెక్టర్ పివి శ్రీహరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఏప్రిల్ లేదా మేలో ఓపెన్ పదో తరగతి, ఇంటర్ పరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు. పదో తరగతి విద్యార్థులు రూ.500, ఇంటర్మీడియెట్ విద్యార్థులు రూ.వెయ్యి తత్కాల్ ఫీజుతోపాటు వార్షిక ఫీజును కూడా చెల్లించాలని కోరారు.

రేపటినుంచి ఎడ్‌సెట్ దరఖాస్తుల స్వీకరణ

- నోటిఫికేషన్ విడుదల



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో బీఎడ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎడ్‌సెట్-2023 నోటిఫికేషన్‌ను ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి శనివారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. సోమవారం నుంచి ఆన్‌లైన్‌లో ఎడ్‌సెట్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఎస్సీ,ఎస్టీ, వికలాంగులకు దరఖాస్తు ఫీజు రూ.500, ఇతరులు రూ.700 చెల్లించాలి. ఆలస్య రుసుం లేకుండా వాటి సమర్పణకు ఏప్రిల్ 20వ తేదీ వరకు అవకాశమున్నది. ఆలస్య రుసుం రూ.250తో అదేనెల 25 వరకు దరఖాస్తు చేయొచ్చు. దరఖాస్తుల సవరణకు చివరి తేదీ ఏప్రిల్ 30 వరకు ఉంటుంది. హాల్‌టికెట్లను మే ఐదో తేదీ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మే 18న ఎడ్‌సెట్ రాతపరీక్షను నిర్వహిస్తారు. పరీక్షా సిలబస్, ఇతర వివరాలకు https://edcet.tsche.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంటుంది. ఈ కార్యక్రమం ఉన్నత విద్యామండలి కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు, లో మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం వీసీ సిహెచ్ గోపాల్‌రెడ్డి, రిజిస్ట్రార్ టి కృష్ణారావు, ఓఎస్డీ ఎ రవికుమార్, ఎడ్‌సెట్ కన్వీనర్ ఎ రామకృష్ణ, కో కన్వీనర్ పి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

31లోగా స్కూల్ గ్రాంట్లను విడుదల చేయాలి

- మంత్రి సబితకు టీఎస్‌జీహెచ్‌ఎంఏ వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగింపు ఈనెల 31వ తేదీలోగా స్కూల్ కాంప్లెక్స్, ఎమ్మార్సీ గ్రాంట్లకు సంబంధించి మిగిలిన 50 శాతం నిధులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ హెడ్మాస్టర్ల సంఘం (టీఎస్‌జీహెచ్‌ఎంఏ) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డిని శనివారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాజభాను చంద్రప్రకాశ్, ప్రధాన కార్యదర్శి ఆర్ రాజగంగారెడ్డి నేతృత్వంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. పాఠశాల విద్యార్థుల యూనిఫారాల కుట్టు చార్జీలను విడుదల చేయాలని కోరారు. డీసీఈబీలకు గత విద్యాసంవత్సరంలోని ఎస్‌ఏ-1, 2 పరీక్ష పత్రాలు, ప్రస్తుత విద్యాసంవత్సరంలోని ఎస్‌ఏ-1, 2 పరీక్ష పత్రాల ముద్రణా ఖర్చులను విడుదల చేయాలని తెలిపారు. పాఠ్యపుస్తకాల సరఫరాకు సంబంధించిన ఖర్చులను ఎంఈవో, డీఈవోలకు చెల్లించాలని పేర్కొన్నారు. గత విద్యాసంవత్సరంలో పదో తరగతి స్పాట్ వాల్యుయేషన్ బకాయిలను విడుదల చేయాలని తెలిపారు. జెడ్పీహెచ్ఎస్ అగ్గనూరు ప్రధానోపాధ్యాయుల సస్పెన్షన్ ఎత్తేయాలని కోరారు. వజ్రోత్సవాల ఖర్చులకు సంబంధించిన నిధులనూ విడుదల చేయలేదని వివరించారు.

ఎన్టీపీసీ ప్రాజెక్టులు పూర్తిచేయండి

- ఎస్ఆర్‌పీసీ చైర్‌పర్సన్ డీ ప్రభాకరరావు ఆదేశం



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రామగుండంలో ఎన్టీపీసీ నిర్మిస్తున్న 2x800 మెగావాట్ల సూపర్ థర్మల్ పవర్ స్టేషన్ ప్రాజెక్ట్ నిర్మాణ పనుల్ని వెంటనే పూర్తిచేయాలని సదరన్ రీజియన్ పవర్ కమిటీ (ఎస్ఆర్‌పీసీ) చైర్‌పర్సన్ దేవులపల్లి ప్రభాకరరావు ఆదేశించారు. 2022లోనే ఈ ప్రాజెక్ట్ అందుబాటులోకి రావల్సి ఉందనీ, ఇప్పటికీ పూర్తికాలేదన్నారు. దీనివల్ల తెలంగాణ విద్యుత్ సంస్థలు బయటి నుంచి కరెంటు కొనాల్సి వస్తున్నదని చెప్పారు. వెంటనే ఈ రెండు యూనిట్లను కమిషన్ చేయాలని ఆదేశించారు. ఎస్ఆర్‌పీసీ సమావేశం శనివారం పూనాలో ప్రభాకరరావు అధ్యక్షతన జరిగింది. ఆయన మాట్లాడుతూ విద్యుత్ ట్రాన్స్‌మిషన్ జాతీయ నష్టాలు 4.49 శాతం ఉంటే, సదరన్ రీజియన్‌లో 3.88 శాతం మాత్రమే ఉన్నాయని తెలిపారు. సదరన్ రీజియన్ పరిధిలో వేసవి కాలంతో పాటు రబీ సీజన్ కారణంగా విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరుగుతున్నదనీ, దానికి అనుగుణంగా ట్రాన్స్‌మిషన్ లైన్లను అప్‌గ్రేడ్ చేసుకోవాల్సి ఉందన్నారు. దానిలో భాగంగా తెలం గాణలో 132 కేవీ లైన్లను 220 కేవీ లైన్లుగా అప్‌గ్రేడ్ చేస్తూ, రక్షణ చర్యలు చేపడుతున్నట్టు చె ప్పారు. నార్తర్న్ రీజియన్‌తో పోల్చితే సదరన్ రీజియన్ పనితీరు సంతృప్తికరంగా ఉన్నదనీ, దీన్ని మరింత పటిష్టం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎస్ఆర్‌పీసీ సభ్యకార్యదర్శి ఆసిత్‌సింగ్‌తో పాటు తమిళనాడు, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, కేరళ, పాండిచ్చేరి రాష్ట్రాల విద్యుత్ సంస్థల సీఎమ్‌డీలు పాల్గొన్నారు.

ప్రపంచ దేశాల మధ్య ఐక్యతే లక్ష్యం

- రష్యా, ఉక్రెయిన్ మధ్య నాటో కూటమి జోక్యం తగదు
- ఐప్సో జాతీయ మహాసభలో పల్లభ్ సేన్ గుప్తా



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ప్రపంచ దేశాల మధ్య నెలకొన్న యుద్ధ పరిస్థితులు నశించి శాంతియుత వాతావరణం నెలకొనాలని అంతర్జాతీయ శాంతి సంఘీభావ సంఘం అధ్యక్షులు పల్లభ్ సేన్ గుప్త ఆకాంక్షించారు. అణుయుద్ధం వస్తే మానవ వినాశనం తప్పదనీ, రష్యా ఉక్రెయిన్ దేశాల మధ్య ఏడాదిపైగా సాగుతూ ఉన్న యుద్ధానికి సామ్రాజ్య వాద నాటో దేశాలే కారణమని చెప్పారు. అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఐప్సో) జాతీయ మహాసభలు పంజాబ్ రాష్ట్రంలోని చండీఘర్ పట్టణంలో జరుగుతున్నాయి. మహాసభల ప్రారంభ సూచకంగా సభా ప్రాంగణం వద్ద జాతీయ పతాకాన్ని ఆహ్వాన సంఘం చైర్మెన్ ప్రొఫెసర్ హెచ్‌ఎస్ సిద్ధు, ఐప్సో పతాకాన్ని జాతీయ అధ్యక్షులు పల్లబ్ సేన్ గుప్త ఎగురవేశారు. మహాసభను పంజాబ్, హర్యానా రాష్ట్రాల హైకోర్టు సీనియర్ న్యాయవాది ఆర్ఎస్ చీమా లాంఛనంగా ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతోపాటు తమిళనాడు, బెంగాల్, కేరళ, పంజాబ్, హర్యానా, బీహార్, ఒడిస్సా, త్రిపుర, ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్, మణిపూర్ రాష్ట్రాల నుంచి 300 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. తొలుత శాంతి ఉద్యమం, ప్రగతిశీల ఉద్యమంలో సేవలు అందించి మరణించిన వారికి ఈ సందర్భంగా ఐప్సో జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్ అరుణ్‌కుమార్ సంతాపం తెలిపారు. దేశంలో పాలక బీజేపీ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ హిందుత్వ అజెండా అమలు చేస్తున్నారనీ, విద్యారంగంలో పురాణం జ్యోతిష్యం ప్రవేశపెట్టారనీ, కాషాయకరణ చేస్తూ ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వియత్నాం, క్యూబా, అమెరికా, నేపాల్, శ్రీలంక, బంగ్లాదేశ్ దేశాల నుంచి శాంతి ఉద్యమ నాయకులు పాల్గొని సౌహార్ద సందేశమిచ్చారు. సోషలిస్టు, కమ్యూనిస్టు దేశాలపైన అమెరికన్ వంటి దేశాల ఆంక్షలు, చిన్న చిన్న దేశాలు, ఇస్లామిక్ దేశాలపై దాడులు సాగిస్తూ తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నాయని విమర్శించారు. మహాసభలో ఐప్సో జాతీయ కమిటీ సభ్యులు డి.సుధాకర్, మాజీ ఎమ్మెల్సీ కె యాదవరెడ్డి, తెలంగాణ రాష్ట్ర ప్రతినిధులు జి రఘుపాల్, జి. నాగేశ్వరరావు,కేవీఎల్, పిఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

పదునుతేరాలి

ఆకాశంలో సగానికి అన్ని దిక్కులా ఉత్సవాలు జరుగుతున్న సందర్భాన ఆమెకు అభినందనలు వెల్లువెత్తుతాయి. మార్చి8 ప్రతి సంవత్సరం వస్తూనే ఉంటుంది. శుభాకాంక్షల మాలలు తయారుగానే ఉంటాయి.కానీ చెప్పుకున్న సమస్యలు తీరవు. చేసిన వాగ్దానాలూ నెరవేరవు. మహిళల స్థితిగతులూ మారవు.లింగవివక్షత రూపుమాపాలని,సమానతను సాధించాలని అందరూ ఏకగ్రీవంగానే ఒప్పు కుంటారు.కానీ ఆచరణలో అడుగులు పడటం కష్టంగానే ఉంటున్నది.ఆధునిక సైన్సు, సాంకేతికత, నైపు ణ్యాలు పెరిగి అభివృద్ధి వేగవంతమైన క్రమంలోనూ మరింత వివక్షకు మహిళ గురవడటం మనం చూస్తున్న సత్యం. అంతేకాదు ఆధునికయుగంలో మరిన్ని కొత్త సవాళ్ల కూడా స్త్రీలు ఎదుర్కొం టున్నారు. పెట్టుబడిదారీవర్గం మహిళను గడప దాటించింది కానీ స్త్రీల పట్ల పురుష సమాజపు మదిని చీకటి కోణంలోనే ఉంచింది.అయితే ఏమీ మారలేదనలేం కానీ రావాల్సిన మార్పులు ఇంకా రాలేదనే చెప్పాలి.

> చిన్నతనంలో తండ్రి ఆధీనంలో పెరిగాక భర్త కనుసన్నల్లో ఆ తర్వాత పిల్లల పర్యవేక్షణలో మహిళ ఉండాలనేది ఆ ధర్మ నియమం. స్త్రీకి స్వతంత్రమైన వ్యక్తిత్వం. ఆలోచన, అభిరుచులకు తావు లేదన్నది అందులోని అంతఃస్సారం. ఇక ఆడవారు ఎలా వుండాలి. ఏమి కట్టుకోవాలి. ఏది కట్టు కోకూడదు మొదలైన ఆంక్షలతో వారి సమస్త జీవనాన్ని నిర్దేశించమే మనుధర్మం. అది కోరుకునే సంఘ పరివారం, అధికార పీఠమెక్కి నైతిక నియమాలను ప్రవచిస్తున్నది.

ఈ సంవత్సరం మహిళా దినోత్సవాన్ని డిజిటల్, సాంకేతిక రంగంలో సమానతను సాధించాలనే లక్ష్యం పెట్టుకుని ముందుకొస్తున్న తరుణంలోనే ఇరాన్‌లో బాలికా విద్యను వ్యతిరేకించే మూకలు బాలికల విద్యాలయాలపై విషవాయువులు ప్రయోగించినట్లు తెలిసింది. ఇప్పటికి ముప్పయి స్కూళ్లపై ఈ దాడి జరిగింది.బాలికలను చదువుకు దూరం చేసే కుట్రలో భాగంగానే ఈ ప్రయోగాలు జరిగినట్లు వార్తా కథనాలు వస్తున్నాయి.ఇక్కడే కాదు అఫ్ఘనిస్తాన్‌లోనూ తాలిబన్ల పాలనలో మహిళల మీద ఆంక్షలు కొనసాగుతూనే ఉన్నాయి.విద్యకు దూరం చేయబడుతూనే ఉన్నారు. మనదేశంలోనూ ఇంకా బాలికలు విద్యగరపడంలో వెనుకబడే ఉన్నారు. ఉగ్రవాదాలు, మతోన్మాదాలు మహిళలను చీకటి యుగాలలోకి నెట్టివేస్తున్నాయి. చదువుకు, సమానతకు బద్ధ విరోధులుగా ఇవి నిలుస్తున్నాయి. మనదేశంలో ఇప్పుడు ఈ రకమైన మతఛాందస ఆలోచనలను, మూఢవిశ్వాసాలను ప్రచారంలోకి తెస్తున్నారు. ముఖ్యంగా మనుధర్మ శాస్త్రాన్ని ఆచరణలోకి తీసుకురావాలనే శక్తులు ఆధిపత్యంలోకి వచ్చాయి. మనువాదం ప్రకారం స్త్రీలు వంటింటికి పరిమితమై పిల్లలను కని వారిని పెద్ద చేయడమే వారిపనిగా భావిస్తున్నారు. భావించడమే కాదు, బహిరంగంగానే ప్రకటనలు కూడా చేస్తున్నారు.




చిన్నతనంలో తండ్రి ఆధీనంలో పెరిగాక భర్త కనుసన్నల్లో ఆ తర్వాత పిల్లల పర్యవేక్షణలో మహిళ ఉండాలనేది ఆ ధర్మ నియమం. స్త్రీకి స్వతంత్రమైన వ్యక్తిత్వం. ఆలోచన, అభిరుచులకు తావు లేదన్నది అందులోని అంతఃస్సారం. ఇక ఆడవారు ఎలా వుండాలి. ఏమి కట్టుకోవాలి. ఏది కట్టు కోకూడదు మొదలైన ఆంక్షలతో వారి సమస్త జీవనాన్ని నిర్దేశించమే మనుధర్మం. అది కోరుకునే సంఘ పరివారం, అధికార పీఠమెక్కి నైతిక నియమాలను ప్రవచిస్తున్నది. ఇది మరింత ప్రమాదకరంగా మహి ళలకు పరిణమించింది. ఒకవైపు ఆధునిక మార్కెట్ సంస్కృతి స్త్రీని సరుకుగా మారిస్తే, ఈ మత ఛాందసం బానిసగా మార్చే ప్రయత్నం చేస్తూ ఉన్నది. ఈ రకమైన రెండు దాడులను ఎదుర్కొంటున్నది నేడు స్త్రీలోకం.ఈ రెండు రకాల ఆలోచనల పర్యవసానంగానే స్త్రీలపైన హింస చెలరేగుతున్నది. మొన్నీ మధ్య తెలంగాణలో కేఎంసీలో వైద్య విద్యార్థిని ర్యాగింగ్ వల్ల ఆత్మహత్య చేసుకుని మరణించింది.దీనికి రెండు కారణాలు చెప్పుకోవచ్చు. ఒకటి స్త్రీ అనే చులకన భావనతో ఆ అమ్మాయిని పురుష డాక్టర్ సైఫ్ హేళన చేయడం. రెండోది కులపరమైన వివక్షనూ ప్రదర్శించడం.ఈ రెండు భావనలూ వెళ్లూనుకొన్న వ్యవస్థలో దుర్మార్గాలు నిత్యకృత్యమౌతునే ఉంటాయి.

ఇక పెళ్లికి నిరాకరించిందని బెంగళూర్‌లో దినకర్ అనే యువకుడు లీలా పవిత్రను పదహారు సార్లు కత్తితో పొడిచి చంపడం చూస్తే పురుషాధిక్య ఆలోచనలు నేటి యువతలో ఎంత కిరాతక పనికి ప్రేరేపిస్తున్నాయో అర్థమవుతుంది. ఇలాంటి దుర్మార్గాలు జరిగినపుడు ప్రభుత్వాలూ, ఆధిపత్య రాజ కీయాలు,వ్యవస్థలూ సైతం స్త్రీలకు ద్రోహమే తలపెడుతున్నాయి. హత్రాస్ కేసును విచారించిన న్యాయస్థానమూ ముగ్గురు దోషులను నిర్దోషులుగా విడుదల చేసింది. బిల్కిస్‌బానో కేసులో జైలు శిక్షపడిన నేరస్తులను ప్రభుత్వమే విడుదల చేసింది.అంతేకాదు, లైంగికదాడి, హత్యఘటనలో పాల్గొన్న నేరస్తులకు మద్దతుగా ప్రదర్శనలు తీయడటం, వారికి సన్మానాలు చేయడటం చూస్తుంటే మహిళకు న్యాయం దక్కటం ఎండ మావే అనేది అర్థమవుతున్నది.లైంగికదాడులు చేసే బచ్చాగాళ్ల అంతు చూస్తా మన్న ఇక్కడి కాషాయ దళాధిపతులు, వారి ప్రభుత్వాలు,నాయకులు చేస్తున్న పనులకు ఏం జవాబిస్తారు. రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు బీజేపీ నాయకుడు బ్రిజ్‌భూషణ్ మహిళా రెజ్లర్‌లను లైంగికంగా వేధిస్తు న్నాడని ఆరోపణలు వచ్చినా ఏ చర్యలూ తీసుకోలేదు.ఒకవైపు హింస, దోపిడీకి గురవుతూ మరోవైపు అన్యాయాలను వివక్షతలను ఎదుర్కొంటున్న మహిళ మరింత పదునైన పోరాటాలకు సమాయత్తమైన సవాళ్లను అధిగమించాలి.సమైక్యంగా ఉద్యమించాలి.

ఈశాన్య ఫలితాలపై బీజేపీ హైప్..నిజానిజాలు



తెలకపల్లి రవి



త్రిపుర నాగాలాండ్,మేఘాలయ ఫలి తాల తర్వాత ఈశాన్య రాష్ట్రాలలో బీజేపీ విజయాలు చారిత్రాత్మకమైనవైనట్టు మోతమో గుతున్నది. ఇందుకు ప్రధాని మోడీ వ్యక్తిగత ప్రభావం కారణమైనట్టు ఆయన పథకాలతో అభివృద్ధి, సంక్షేమం మెరుగయ్యాయని సంతోషించినందుకే ప్రజలు గెలిపించినట్టు పెద్ద ప్రచారం సాగుతున్నది. ఉత్తరాదికే పరిమితమైన పార్టీగా చెప్పుకునే బీజేపీ దేశం మూలమూలనా చొరబడిందని ఈ ఫలితాలతో తిరుగులేని విధంగా రుజువైందనే పల్లవి వినిపిస్తున్నది. త్రిపురలో వామపక్ష కూటమి, మొత్తంగా కాంగ్రెస్ పార్టీ దెబ్బతినడం కీలక పరిణామంగా చిత్రించబడుతుంది. ఎన్నికల్లో జయాపజయాలను బట్టి ఈ విధమైన వాదనలు ప్రచారాలు సాగడంలో ఆశ్చర్యం లేదు గాని పూర్తి వాస్తవమేమిటనేది కూడా అర్థం చేసుకోవడం అవసరం.ఈ ఫలితాలలో బీజేపీకి అంత సీన్ కనిపించిందా? ఎన్నికలు జరిగిన మూడు రాష్ట్రాలలోనూ వాటితోపాటు జరిగిన ఉప ఎన్నికలలోనూ బీజేపీ సాధించిన ఫలితాలేమిటి పరిమితులేమిటి? లోతుగా చూడాల్సి ఉంది.అలా చూసినప్పుడు బీజేపీ నేతలు అంతగా జబ్బలు చరుచు కోవలసిన అద్భుత ఫలితాలేమీ కాదని, అవైనా అనేక అక్రమాలు ధనబలం నిర్బంధంతో లభించినవేనని స్పష్టమవుతున్నది. పైగా ఇవిచాలా చిన్న రాష్ట్రాలను వశపర్చుకోవడం కోసం ప్రపంచంలోనే పెద్దదిగా టముకు వేసుకునే పార్టీ పడరాని పాట్లుపడటం, ఫలితాలు రాగానే ప్లేటు మార్చడం కూడా కనిపిస్తుంది. ఈ చిన్న రాష్ట్రాలలో ఇతరులతో రకరకాల బేరసారాలు మత రాజకీయాలు నెరిపిన బీజేపీ ఇదేదో దేశవ్యాపిత విజయంలా చెప్పుకుంటే మీడియా కూడా వంతపాడటం వింత గొల్పుతుంది. అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మణిపూర్, త్రిపుర రాష్ట్రాల్లో బీజేపీ అధికారానికి రావడం, మేఘాలయ మణిపూర్‌లలో మిత్రపక్షాల సాయంతో పాగా వేయడం గొప్ప పరిణామాలుగా చెప్పేవారు గతంలోనూ కేంద్రంలోని కాంగ్రెస్ ఈ తరహా ఆధిక్యత నడిపించుకుందని మర్చిపోతుంటారు. ఈశాన్య రాష్ట్రాలు గానీ జమ్మూ కాశ్మీర్‌గాని కేంద్రంలో ప్రభుత్వాన్ని బలపరిస్తే తప్ప బతకలేని దురవస్థ ఇందుకు కారణమని దేశమంతటికీ తెలుసు. మోడీ హయాంలో పెద్ద పెద్ద రాష్ట్రాలకే నిధులు కేటాయించకుండా వివక్షతో దాడులతో లోబర్చుకుంటున్న నేపథ్యం ఈశాన్యానికి మరింత ఎక్కువగా వర్తిస్తుందని చెప్పనవసరం లేదు.

> మోడీ హయాంలో పెద్ద పెద్ద రాష్ట్రాలకే నిధులు కేటాయించకుండా వివక్షతో దాడులతో లోబర్చుకుంటున్న నేపథ్యం ఈశాన్యానికి మరింత ఎక్కువగా వర్తిస్తుందని చెప్పనవసరం లేదు. పైగా అధికార అవకాశవాదంలోనూ వేర్పాటువాద పోకడలలోనూ అక్కడి పాలకపక్ష నాయకులు ఆరితేరారు గనక ఆ పని మరింత తేలికే. 35 ఏండ్లు వామపక్ష పాలనలో స్థిరత్వం కాపాడుకున్న త్రిపుర మినహా అన్నిచోట్లా ఇదే జరిగేది. దాన్నే మోడీ, హోంమంత్రి అమిత్‌షా వంటివారు తమవైపునకు తిప్పుకోవడంలో గొప్పతన మేమీ లేదు. వీటిలోని హెచ్చరికను గుర్తించడం అవ సరమే అయినా అతిశయోక్తులను ఆమోదించనవసరం లేదు.

పైగా అధికార అవకాశవాదంలోనూ వేర్పాటువాద పోకడలలోనూ అక్కడి పాలకపక్ష నాయకులు ఆరితేరారు గనక ఆ పని మరింత తేలికే. 35 ఏండ్లు వామపక్ష పాలనలో స్థిరత్వం కాపాడుకున్న త్రిపుర మినహా అన్నిచోట్లా ఇదే జరిగేది. దాన్నే మోడీ, హోంమంత్రి అమిత్‌షా వంటివారు తమవైపునకు తిప్పుకోవడంలో గొప్పతన మేమీ లేదు. వీటిలోని హెచ్చరికను గుర్తించడం అవ సరమే అయినా అతిశయోక్తులను ఆమోదించనవసరం లేదు.

త్రిపురలో జరిగిందేమిటి?

ఇప్పుడు ఎన్నికలు జరిగిన మూడు రాష్ట్రాల్లోనూ ఒక్క త్రిపురలో మాత్రమే బీజేపీ తానుగా ఆధిక్యత సాధించింది. అందుకోసం ఎన్ని దౌర్జన్యాలూ నిర్బంధాలు జరిగాయో గతవారం చెప్పుకున్నాం. స్వేచ్ఛగా ఓటేయనిస్తే తప్ప గెలుస్తామని మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ చేసిన వ్యాఖ్య నేను గుర్తుచేశాను. అలా జరగడం లేదనీ దాడులతో పాటు అక్రమాలు ధనప్రలోభాలు పెరుగుతు న్నాయని సీపీఐ(ఎం) నాయకులు అనేకసార్లు ఎన్నికల సంఘం దృష్టికి తెచ్చారు. కాని అవి ఆగిందిలేదు.. గిరిజన ప్రాంతాలలో ఎన్నికల ముందే పుట్టుకొచ్చిన త్రిప్రిమోతె పార్టీ ఓట్ల చీలికలోనూ, సీట్ల చీలికలోనూ పెద్ద ప్రభావమే చూపింది. దాంతో కేంద్ర బీజేపీ నాయకులు మంతనాలాడారు. ప్రత్యేక రాష్ట్రం, ప్రత్యేక దేశం అంటున్నా వారి మంతనాలు ఆగలేదు. ఆ ఒక్కటి తప్ప అన్నిటికీ సిద్ధమని బాహాటంగానే సంకేతాలిచ్చారు. ఇంతకూ ఈ పార్టీ ఎవరిదంటే పీసీసీ అధ్యక్షుడుగా ఉండి నిష్క్రమించిన మాజీ యువరాజు ప్రద్యుమ్నది. అంటే ఆయన కాంగ్రెస్ ఓట్లలోనూ గండిపెట్టాడనేది స్పష్టమే. సీట్ల సర్దుబాటులోనూ చివరిదాకా సాగదీసిన కాంగ్రెస్ నాయకత్వం పాత్ర మరొకటి. ఇన్నిటి మధ్య సీపీఐ(ఎం) వామపక్షాల నాయకులు ప్రాణాలకు వెరవకపోరాడారు. బీజేపీ విచ్ఛిన్నశక్తుల దాడులను ఎదుర్కొన్నారు. ఫలితాలు వచ్చాక చూస్తే కాంగ్రెస్‌తో కలిసినప్పటికీ వామపక్షాల ఓట్లశాతం పెరక్కపోగా గతసారి కన్నా పదిహేను శాతం వరకూ తగ్గినట్టు కనిపిస్తుంది. ఈ పొత్తే పొరబాటనే వాదనలు మీడియాలో మొదలైనాయి. విధాన పరమైన నిర్ణయం గనక ఇప్పుడు దానిపై తర్జనభర్జనల కన్నా సమగ్ర సమీక్ష కోసం ఎదురు చూడటం మంచిది. కాని అసలు సమస్య మాత్రం మరోసారి వేర్పాటు వాద విచ్ఛిన్నకర పోకడలు పెంచే శక్తులకు ఊతమివ్వడం. గతంలో ఆస్సాంలో కాంగ్రెస్ ఇలాగే చేయడం గుర్తుండే వుంటుంది. ఇప్పుడు బీజేపీ అదేపని చేస్తున్నది. ఇంతా చేసినా ఐటిపిఎఫ్‌తో కలిసి కూడా అది అత్తెసరు ఆధిక్యతనే తెచ్చుకోగలిగింది. బీజేపీని వ్యతిరేకించేది తానేనన్నట్టు గొప్పలు పోయే తృణమూల్ కాంగ్రెస్ కూడా అన్నిచోట్ల పోటీ పెట్టి ఓట్ల చీలికకు కారణమైంది. వీటన్నిటినీ ఉపయోగించుకున్న బీజేపీ నేతలు ఇప్పుడు మాత్రం మహిళలు యువత తమకు బాగా ఓటేశారని చెప్పుకుంటున్నారు. ఏమైనా రాజకీయంగా బీజేపీకి అంతర్గత కలహాల మధ్య వచ్చిన త్రిపుర విజయం కీలకమే అవుతుంది. ఇన్ని నిర్బంధాల మధ్య సీపీఐ(ఎం) వామపక్ష కార్యకర్తలు పునాది కాపాడుకున్న తీరు అభినందనీయం. త్రిప్రిమోతె రానున్న రోజులలో ఎలాంటి సమస్యలు, సవాళ్లు సృష్టించేది బీజేపీ అవకాశవాదం ఏ పరిణామాలకు కారణమయ్యేది చూడాల్సిందే.

> ఇన్ని నిర్బంధాల మధ్య సీపీఐ(ఎం) వామపక్ష కార్యకర్తలు పునాది కాపాడుకున్న తీరు అభినందనీయం. త్రిప్రిమోతె రానున్న రోజులలో ఎలాంటి సమస్యలు, సవాళ్లు సృష్టించేది బీజేపీ అవకాశవాదం ఏ పరిణామాలకు కారణమయ్యేది చూడాల్సిందే.

మేఘాలయలో వెనకడుగు, నాగాలాండ్‌లో జూనియర్ పాత్ర

ఈశాన్య విజయం అంటూ అతిగా చెప్పుకుంటున్న బీజేపీ మిగిలిన రెండు రాష్ట్రాలు నాగాలాండ్ మేఘాలయలో స్వంతంగా సాధించిందేమీ లేదు. మేఘాలయలో కొర్నాడ్ సంగ్మా నాయకత్వంలోని నాగాలండ్ పీపుల్స్‌పార్టీ (ఎన్‌పీపీ) 26 స్థానాలతో పెద్దపార్టీగా వచ్చింది. ఈపార్టీతో కలిసి మిశ్రమ కూటమిలో ఉన్న బీజేపీ ఎన్నికల ముందే వైదొలగింది. ఈశాన్యంలో అన్నిటి కన్నా అవినీతికరమైన ప్రభుత్వం అది అని స్వయంగా హోంమంత్రి అమిత్‌షా ప్రకటించారు. కాని ఇప్పుడు రెండుస్థానాలు గెలిచిన బీజేపీ ఆ పార్టీతోనే చేతులు కలిపి ప్రభుత్వ ఏర్పాటుకు సహకరిస్తున్నది. ఈ మేరకు సంగ్మా గవర్నర్‌ను కలిసి అవకాశం కోరాడు. అమిత్ షా సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయడానికి ముహూర్తం చూసుకుంటున్నారు. హిల్‌పీపుల్స్‌పార్టీకి చెందిన ఇద్దరు మరో ఇద్దరు స్వతంత్రులు కూడా తమతో ఉన్నారని సంగ్మా చెబుతున్నా ఆ పార్టీలు మరోలా మాట్లాడుతున్నాయి. కేంద్రం వారిని దారికి తెచ్చినా ఆశ్చర్యం లేదు. 11 స్థానాలు తెచ్చుకున్న మాజీ పాలక కూటమి భాగస్వామి యూడీపీ, రెండు తెచ్చుకున్న విపీపీపార్టీ కూడా బేరసారాలు సాగిస్తున్నాయి. ఇక నాగాలాండ్‌లో నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన నలెఫ్యూరియో నాయకత్వంలోని కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధ మవుతున్నది. నేషనలిస్టు డెమోక్రటిక్ ప్రోగ్రెసివ్‌పార్టీ (ఎన్‌డీపీపీ) నాయకుడైన రియోకు 12 మంది బీజేపీ సభ్యుల మద్దతు ఉన్నది. ఇక్కడ కూడా బీజేపీ జూనియర్ భాగస్వామి గానే వుంది. కనుక బీజేపీ ఈ రెండుచోట్ల గెలిచేసినట్టు చెప్పుకోవడం హాస్యాస్పదమే. పైగా అది మోడీ ప్రతిష్ట, బీజేపీ విధానాల విజయంగా చెప్పడం మరీ విడ్డూరం. ఈసర్కార్లు స్థిరంగా వుండటం కూడా కష్టమే. అయితే ముందే చెప్పుకున్నట్టు కేంద్రం మీద పరాధీనత వల్ల వారు అని వార్యంగా లోబడిపోతుంటారు. అందులో నిలబడినవారిని బీజేపీ తనవైపునకు తిప్పుకుంటుంది. ఈ ప్రక్రియకు ఆధ్వర్యం వహించే అస్సాం ముఖ్యమంత్రి హేమంత బిస్వాస్‌శర్మను కొందరు మరో మోడీగా వర్ణిస్తుంటారు కూడా.

మరోవిడత తర్వాతే!

హిందూత్వమే తమ సిద్ధాంతమని రెచ్చగొట్టే బీజేపీ ఈశాన్య భారతంలో అధికంగా వున్న క్రైస్తవ ఓటర్ల కోసం మరెవరికంటే అధికంగా బుజ్జగింపు విధానాలు అనుసరిస్తుంది. వారి మతపరమైన కోర్కెలకు పెద్దపీట వేస్తూ గిరిజనాభివృద్ధిని ఉపేక్షిస్తుంది. ఉత్తరాదిన గోరక్షణ గురించి గగ్గోలు పెట్టి అనేకమంది ప్రాణాలు పోవడానికి కారణమైన సంఘపరివార్ ఈశాన్యంలో మాట మారుస్తుంది. గొడ్డుమాంసం తినడం అక్కడ సర్వసాధారణం గనక ఆవును పక్కనపెట్టేస్తుంది! సెరూసలేము యాత్రలకు సహాయం వాగ్దానం చేస్తుంది. ఇవన్నీ మతసహనంతో చేస్తే పర్వాలేదు గాని ఓట్లకోసమే కావడం విపరీతం. అస్సాంలో అత్యుత్సాహంతో హిందూత్వ పాఠాలు చెప్పే ముఖ్య మంత్రి శర్మ తక్కిన ఇతర చోట్ల మొత్తం మార్చేసి అదే తన చాణక్యమంటారు. ఇవన్నీ అవకావవాద రాజకీయ విన్యాసాలే.ఉత్తరాదిలోనే పూర్తిగా గెలవలేని బీజేపీ దక్షిణాన పాగా వేసేందుకు నిరంతరం విఫలయత్నాలు చేస్తు న్నది. తూర్పు పశ్చిమాలలో కూడా దానికి ప్రత్యర్థి రాజకీయ శక్తులున్నాయి. ఒరిస్సా, బెంగాల్‌వంటి చోట్ల గెలవలేక పోతున్నది. దక్షిణాన సరేసరి. కర్నాటక కూడా చేజారి పోతుందని ఢిల్లీ నేతలు భావిస్తున్నారు. ఇప్పుడు జరిగిన ఉప ఎన్నికలలో కూడా కాంగ్రెస్ మూడు, బీజేపీ, మిత్రులు మూడు తెచ్చుకున్నారు. బెంగాల్‌లో కాంగ్రెస్ ఈ అసెంబ్లీలో చోటు సంపాదించింది. తమిళనాడులోని ఈరోడ్‌లోనూ మహారాష్ట్ర లోనూ గెలిచింది. ఇవి మిత్రపక్షాల తోడువల్ల గెలిచినవే కావడం గమనార్హం. కాంగ్రెస్ ఇప్పటికీ బీజేపీకి వ్యతిరేకంగా సరైన విధానం తీసుకోలేకపోవడం, తనే నాయకత్వం వహించాలన్నట్టు మాట్లాడుతుండడం కనిపిస్తుంది. ఇవన్నీ ఎలా ఉన్నా బీజేపీ ఈశాన్యాన చిన్నచితక పార్టీలతోకలసి సాగించే కపటనాటకాన్ని దేశవ్యాపిత విస్తరణకు సాక్ష్యంగా చూపాలనుకోవడం కుదిరేది కాదు. ఈ ఏడాది కర్నాటక, చత్తీస్‌ఘర్, మధ్యప్రదేశ్, మిజోరాం, రాజస్తాన్, తెలంగాణ, జమ్మూకాశ్మీర్ అసెంబ్లీల ఎన్నికల తర్వాత దేశ రాజకీయ ముఖచిత్రం మరింత స్పష్టమవుతుంది.

> హిందూత్వమే తమ సిద్ధాంతమని రెచ్చగొట్టే బీజేపీ ఈశాన్య భారతంలో అధికంగా వున్న క్రైస్తవ ఓటర్ల కోసం మరెవరికంటే అధికంగా బుజ్జగింపు విధానాలు అనుసరిస్తుంది. వారి మతపరమైన కోర్కెలకు పెద్దపీట వేస్తూ గిరిజనాభివృద్ధిని ఉపేక్షిస్తుంది. ఉత్తరాదిన గోరక్షణ గురించి గగ్గోలు పెట్టి అనేకమంది ప్రాణాలు పోవడానికి కారణమైన సంఘపరివార్ ఈశాన్యంలో మాట మారు స్తుంది. గొడ్డు మాంసం తినడం అక్కడ సర్వసాధారణం గనక ఆవును పక్కన పెట్టేస్తుంది! సెరూసలేము యాత్రలకు సహాయం వాగ్దానం చేస్తుంది. ఇవన్నీ మతసహనంతో చేస్తే పర్వాలేదు గాని ఓట్లకోసమే కావడం విపరీతం.

> బీజేపీ ఈశాన్యాన చిన్నచితక పార్టీలతోకలసి సాగించే కపటనాటకాన్ని దేశవ్యాపిత విస్తరణకు సాక్ష్యంగా చూపాలనుకోవడం కుదిరేది కాదు. ఈ ఏడాది కర్నాటక, చత్తీస్‌ఘర్, మధ్యప్రదేశ్, మిజోరాం, రాజస్తాన్, తెలంగాణ, జమ్మూకాశ్మీర్ అసెంబ్లీల ఎన్నికల తర్వాత దేశ రాజకీయ ముఖచిత్రం మరింత స్పష్టమవుతుంది.

రిపోర్టర్ డైరీ

సద్దిమూటలతో పోరుబాట

బహిరంగ సభలు, మహాధర్నాలకు బీరూబిర్యానీ, రూ.500 నుంచి రూ.1000 ఇచ్చినా గానీ జనాలు వచ్చుడు అంతంతే. వచ్చినోళ్లూ కుదురుగా కూర్చోవటం అరుదే. ప్రదర్శనలో నడవాలంటే ఎక్స్‌ట్రా ఇవ్వాల్సిందే. రాష్ట్రంలో ఇది ఓ ట్రెండ్‌గా మారింది. కాదుకాదు..బూర్జువా పార్టీలు అలా మార్చేశాయి. వాహనం దగ్గర నుంచి అన్నీ సమ కూర్చిపెట్టి జనాలను తరలించడం పరిపాటిగా మారింది. అంతజేసినా సభదాకా వెళ్తారా? అంటే అదీ లేదు. 'అబ్బే ట్రాఫిక్‌జామ్ అయితది. మళ్లీ ఇంటికి పోవాలంటే రెండు, మూడు గంటలు లేటవుతుంది. వచ్చామా? బీరూబిర్యానీ పుచ్చుకున్నామా? డబ్బులు ముట్టాయా? ఇంటికి పోయామా?' అన్నట్టుగా పరిస్థితి తయారైంది. ఇది నాణా నికి ఓ వైపు మాత్రమే. మరోవైపు పరికించి చూస్తే కమ్యూ నిస్టుల ధర్నాలు, సభలు దానికి భిన్నమని మరోమారు నిరూపితమైంది. సీఐటీయూ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికుల హక్కుల కోసం చేపట్టిన పాదయాత్ర ముగింపు సందర్భంగా హైదరాబాద్‌లో సభ పెట్టారు. గ్రామపం చాయతీ కార్మికులు జిల్లాల నుంచి ఐదారువేల మంది తరలొచ్చారు. ట్రైన్లు, బస్సులలో ఎవరి సొంత ఖర్చులతో వారే పొద్దుగాల్నే పట్నం చేరుకున్నారు. పంచాయతీ కార్మికులంతా ఎవ్వరి సద్ది వారే కట్టుకుని సద్దిమూటలు, నీళ్ల బాటిళ్లు, క్యాన్లతో వచ్చారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం, ఇందిరాపార్కు ఎన్టీఆర్ స్టేడియం, ఇలా దొరికిన చోటల్లా కార్మికులు ఎక్కడికక్కడ రౌండ్‌గా కిందనే కూర్చొని తమ వెంట తెచ్చుకున్న సద్ది మూటలతో కడుపునింపుకున్నరు. 'లచ్చలకు లచ్చల జీతాలు తీసుకునేటోళ్లకు మళ్లా పెంచుకున్నరు. మనకెందుకు పెంచరు? రూ.8,500 ఇచ్చి ఇద్దరు, ముగ్గురు పంచుకుని నెలంతా ఎట్ల బతకాలే? ఇయ్యాలరేపట్ల మూడు, నాలుగు వేల రూపాయలకు ఏమొస్తున్నది? జీతం పెంచేదాకా పోరాటం ఆపొద్దు' అంటూ తినేదగ్గరా మాట్లాడుకోవటం గమనార్హం. సద్దిమూటలతో వచ్చిన వారిలో నిలువెల్లా పోరాటతత్వం తొణికిసలాడుతున్నది. వారిలా సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలుగానీ ఇసుమెత్తయినా ఆలోచించినా కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యేవే.

- అచ్చిన ప్రశాంత్

లాజిక్ మిస్సయిన సర్కార్

భూమి రైతుల విశ్వాసాన్ని పెంచుతుంది. ఆత్మ గౌరవాన్ని నిలబెడుతుంది. అదే భూమిని ప్రభుత్వమేగానీ, ప్రయివేటు వ్యక్తులెవరైనా అక్రమంగా గుంజుకుంటే ఆ రైతు మనస్సు కాకవికలమవుతుంది. ధరణి చేసిన మాయతో ఎంతో మంది దళితులకు అరణ్యరోధనే మిగిలింది. దశాబ్దాల కిందట దళితులకు ఇచ్చిన అసైన్డ్, ఇనాం, భూదానం, గైరాన్ భూములను లాగేసుకుంటుంది. ప్రభుత్వ అవసరాల పేరు చెప్పి దళితుల సాగుబడితో ఉన్న భూములనే స్వాధీనం చేసుకుంటుంది. ఇటీవల సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రైతులు నిర్వహించిన అసైన్డ్ భూబాధితుల సదస్సు ఒకటి జరిగింది. అందులో ఓ రైతు మాట్లాడుతూ భూములను కొల్ల గొట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన మోసాన్ని బట్టబయలు చేశాడు. అందుకు అనేక ప్రశ్నలను సంధించాడు. సెల్‌ఫోన్ రీచార్జ్ చేయగానే కంపెనీ నుంచి సెల్‌కు సమాచారం వస్తుంది. బ్యాంకులో డబ్బులేసినా, తీసినా, వేరే అకౌంట్‌కు బదిలీ చేసినా, వెంటనే మనకు మేసేజ్ వస్తుంది. ఆధార్‌కార్డు అప్‌డేట్ చేసినా ఫోన్‌కు మేసేజ్ వస్తుంది. బట్టల దుకాణంలో బట్టలు కొన్నా...ఆస్పత్రిలో వైద్యం జరుగుతున్నా... మేసేజ్‌ల మీద మేసేజ్‌లు వస్తున్నాయి. విద్యార్థులకు ఫలితాలు కూడా మేసేజ్ రూపంలో వస్తుంటాయి. అంత టెక్నాలజీ పెరిగింది. అయితే మన రాష్ట్రంలో ప్రతి రోజు కొన్ని కోట్ల విలువైన భూములు రిజిస్ట్రేషన్లు అవుతున్నాయి. భూముల క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. అయినా పలానా రైతు భూమి మరో రైతు పేరు మీదికి మారినట్టు సెల్‌ఫోన్‌కు మేసేజ్ ఎందుకు రావడం లేదు. ధరణిలో ఆ అప్షన్ ఎందుకియ్యలేదు. భూముల క్రయవిక్రయాల్లో సెల్‌ఫోన్లకు మేసేజ్ వస్తే భూరికార్డుల మార్పు వెంటనే బాధితుడికి తెలిసిపోతుంది. దీంతోపాటు భూములు అన్యాక్రాంతమైనట్టు కూడా ఆ పట్టాదారుడికి సమాచారం అందుతుంది. మరెవరైనా కబ్జాకు పాల్పడ్డారా? లేదా కొన్నాడా, అమ్మాడా అనే విషయం ఇట్టే తెలిసిపోతుంది. భూమి చిరగని వస్త్రం...దానిపై జరుగుతున్న లావాదేవీల్లో ఈ చిన్న లాజిక్ సర్కారు మిస్సయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

- గుడిగ రఘు

దేశం కోసం!

నజర్



'ఏంటోయ్! ఏమి టిఫిన్ చేస్తున్నావు!' అన్నాడు యాదగిరి పాత సినిమాల్లో శోభన్‌బాబులా.

'ఇడ్లీలు చేస్తున్న శ్రీవారు!' అంటూ బదులిచ్చింది లక్ష్మి. తను కూడా పాత సినిమాల్లో జయసుధలా!

'అబ్బ! నాకిష్టమైన టిఫిన్ చేస్తున్నందుకు నీకు ధన్యవాదాలు!' అంటూ వచ్చి కూర్చున్నాడు యాదగిరి.

'ఇదిగో కానివ్వండి! అంటూ టిఫిన్ ప్లేటు యాదగిరి ముందు పెట్టింది!లక్ష్మి.

ప్లేటుని తేరిపార చూశాడు యాదగిరి! ఎంత చూసినా ఇడ్లీలు కనబడలేదు! పొంగణాలు మాత్రమే కనబడుతున్నాయి.

'ఏంటోయ్!ఇడ్లీలు అని చెప్పి పొంగణాలు పెట్టావు'! అన్నాడు యాదగిరి.

'అవి పొంగణాలు కావు ఇడ్లీలే! సరిగ్గా చూడండి!' అని బదులిచ్చింది లక్ష్మి.

యాదగిరి మళ్లీ ప్లేటు వంక చూశాడు. అనుమానం వచ్చి పట్టుకుని చూశాడు. నిజమే అవి ఇడ్లీలే! అయతే సైజు తగ్గింది! అందుకే పొంగణాలు మాదిరి కనబడ్డాయి!

'ఎందుకూ! ఇడ్లీల సైజు తగ్గించావు!' అన్నాడు యాదగిరి ఆశ్చర్యంగా.

'ఇడ్లీల సైజే కాదు! అన్నింటి సైజు తగ్గింది!' అంటూ భోజనం క్యారియర్ తెచ్చి యాదగిరి ముందు పెట్టింది.

అది చూసి యాదగిరి కళ్లు తిరిగాయి. నానిగాడి క్యారియర్ కన్నా చిన్నగా ఉన్నది.

'ఇంత చిన్న క్యారియర్‌తో ఆకలి ఎలా తీరుతుందీ! పని ఎట్లా చేతనవుతుంది!' నీరసంగా అన్నాడు యాదగిరి

'సిలిండర్ ధర పెరిగింది! సర్దుకోవాలి తప్పదు!' అన్నది లక్ష్మి.

'భోజనం తక్కువైతే ఎట్లా సర్దుకునేది'? మళ్లీ అడిగాడు యాదగిరి.

'గతంలో ఉన్న ధరతో సిలిండర్ కొంటే రెండు నెలలు వచ్చేది. ఇప్పుడు పెంచిన ధరతో సిలిండర్ మూడు నెలలు వస్తేనే సరిపోతుంది' అన్నది లక్ష్మి.

యాదగిరి కళ్లలో మెరుపులు కనిపించాయి. చిన్నగా నవ్వాడు.



> 'ఏం ఆలోచిస్తున్నావు!' అన్నాడు యాదగిరి. 'ఏం లేదు!ఇలాంటి పని అంబానీ, అదానీ కోసం ఎందుకు చేయడం లేదు' ఆలోచిస్తున్నాను అన్నది లక్ష్మి. 'ఎప్పుడూ అంబానీ, అదానీల మీదపడి ఏడ్వడమేనా? వారేమన్నా పాకిస్తాన్, చైనాకు చెందినవారా?ఈ భూమిపుత్రులేకదా! వారు బాగుపడితే ఈ దేశం బాగుపడుతుందని తెలుసుకోండి'!అన్నాడు ఆవేశంగా యాదగిరి! 'ఆవేశం తగ్గించుకోండి శ్రీవారు! అంబానీ, అదానీలు ఈ భూమిపుత్రులే కాదనను!మరి సిలిండర్ కొనేవారంతా పాకిస్తాన్, చైనా దేశస్తులా! మనమంతా ఈ భూమి పుత్రులం కాదా? ప్రశ్నించింది!లక్ష్మి

'ఎందుకా నవ్వులు? ఏమా మెరుపులు?' అన్నది లక్ష్మి విసుగ్గా

'చూశావా! మా మోదీ ఘనత! నీలాంటి మధ్య తరగతి మహిళలందరికీ పొదుపు చేయడం నేర్పించాడు!అన్నాడు యాదగిరి.

'భర్త మాటలకు లక్ష్మి షాక్ తిన్నది! మరీ ఇంత మూఢ నమ్మకమా? అనుకుంది!

'ఏం ఆలోచిస్తున్నావు!' అన్నాడు యాదగిరి.

'ఏం లేదు!ఇలాంటి పని అంబానీ, అదానీ కోసం ఎందుకు చేయడం లేదు' ఆలోచిస్తున్నాను అన్నది లక్ష్మి.

'ఎప్పుడూ అంబానీ, అదానీల మీదపడి ఏడ్వడమేనా? వారేమన్నా పాకిస్తాన్, చైనాకు చెందినవారా? ఈ భూమిపుత్రులేకదా! వారు బాగుపడితే ఈ దేశం బాగుపడుతుందని తెలుసుకోండి'!అన్నాడు ఆవేశంగా యాదగిరి!

'ఆవేశం తగ్గించుకోండి శ్రీవారు! అంబానీ, ఆదానీలు ఈ భూమిపుత్రులే కాదనను!మరి సిలిండర్ కొనేవారంతా పాకిస్తాన్, చైనా దేశ స్తులా! మనమంతా ఈ భూమి పుత్రులం కాదా?

ప్రశ్నించింది! లక్ష్మి.

'సిలిండర్‌కి పెట్టేధర అంబానీలకు, అదానీలకు చేరుతుందా ప్రభుత్వానికే కదా! నాకు జీతం పెరగొచ్చు కాని! నేను సిలిండర్ ధర పెరిగితే భరించకూడదా? ఆదాయపన్ను ఒక వెయ్యి ఎక్కువ కట్టకూడదా? ధరలు పెంచితే అది నేరమా? ప్రశ్నించాడు యాదగిరి.

'అబ్బో శ్రీవారి ఆర్గ్యుమెంటు చాలా పవర్‌ఫుల్‌గా ఉంది!తట్టుకోలేకపోతున్నాం గాని! మన భారతనారీ, బహు స్మృతీజీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సిలిండర్ ధర పెరిగితే నడిరోడ్డు మీద ధర్నాలు చేశారు!కదా! ఎందుకంటారు? తిరిగి ప్రశ్నించింది!

'అదీ..ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తప్పవు కదా! తేలిగ్గా అన్నాడు యాదగిరి.

'ఓహో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పెరిగే ధరలకు వ్యతిరేకంగా పోరాడుతారు! అధికారంలోకి వచ్చాక మీరే ధరలు పెంచుతారు! మళ్లీ దాన్ని సమర్థించుకుంటారు! మీరు చాలా లాజిక్ అండీ!'దీన్ని తెలుగులో ఏమంటే బాగుంటుంది చెప్పనా' అడిగింది లక్ష్మి

యాదగిరి గర్వంగా కాలర్ సర్దుకుంటూ 'చెప్పవోయ్' అన్నాడు.

'నయవంచన' అంటారు అన్నది లక్ష్మి

'అదేమిటోయ్! అంతమాట అనేశావ్!' అన్నాడు యాదగిరి.

'మీరు చేసేది పుణ్యకార్యం!అదే ఇతరులు చేస్తే అది పాపకార్యం! మీరు చేస్తే దేశం కోసం! అదే ఇతరులు చేస్తే దేశద్రోహం! మీరు ఈ దేశ సంపదను అంబానీలు,ఆదానీలకు పంచిపెడితే అది దేశం కోసం! దాన్ని ప్రశ్నిస్తే దేశద్రోహం! పది లక్షల కోట్ల మేరకు పెద్ద కంపెనీల అప్పులు రద్దు చేస్తే అది దేశభక్తి! దాన్ని ప్రశ్నిస్తే దేశద్రోహం! రెక్కలు ముక్కలు చేసుకుని సంపాదించుకున్న దబ్బులు జీఎస్‌టీ, పెట్రోల్, సిలిండర్ కోసం ఖర్చు పెట్టేవారిపై ధరల భారం ఎందుకు మోపాలన్న ఇంగిత జ్ఞానం లేనివారికి, ఈ దేశాన్ని పాలించే అర్హత లేదు!' దులిపేసింది లక్ష్మి.

యాదగిరి తలెత్తి చూడలేదు!

- ఉషాకిరణ్

జీవితాన్ని సార్థకంచేసే క్రియాశీల సౌందర్యం

కందాళ శోభారాణి యాదిలో

2023 ఫిబ్రవరి 12... సూర్యాస్తమయం వేళ. కందాళ శోభారాణి చనిపోయిందన్న వార్త... విని భరించటం కష్టమే అయింది. ఇప్పటికీ తలపులో కదులుతూ గుండె నీరవుతునే ఉంది. 20 ఏండ్ల ఆత్మీయ అనుబంధం, సామాజిక సాహిత్య దృక్పథాల సాన్నిహిత్యం మాది. 49 ఏండ్ల అకాల మరణం ఆమెది.



శోభారాణి పుట్టింది 1973, ఏప్రిల్ 29న. 2004లో కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు ఎమ్మెలో చేరటంతో తను నా విద్యార్థి అయింది. సన్నగా తగిన ఎత్తుతో తరగతి గది పాఠాలు వినటంలో శ్రద్ధను, ప్రశ్నలు వేసే సాహిత్య జిజ్ఞాసను చొరవను, చలాకీ తనాన్ని చూస్తూ ఉన్నానేమో శోభకు పెళ్లి అయిందని, ఒక కొడుకు ఉన్నాడని తెలిసినప్పుడు నమ్మలేకపోయాను. ఆడపిల్లలవి పెళ్ళిచదువులు, పెళ్లితో ఆగిపోయేవి అనుకొనే సమాజంలో పెళ్లి నా చదువుకు అడ్డం కాదు, తల్లికావటం అవరోధమూ కాదు అంటూ సరిహద్దులు విస్తరించుకొంటూ ఆమె అలా పై చదువుకు రావటం భలే ముచ్చటగా అనిపించింది. యూనివర్సిటీలో తనది వామపక్ష విద్యార్థి వర్గంతో స్నేహం. ఆమె జీవిత సహచరుడు రమేష్ పిడిఎస్‌యు రాజకీయాల నుండి వచ్చినవాడు కావడం, కమ్యూనిస్టు పార్టీ పెద్దలు పూనుకొని చేయించిన పెళ్లి (2002) కావటం అందుకు దోహదపడి ఉంటుంది.

విశ్లేషించాలనే తపన

తెలుగు ఎమ్మె విద్యార్థిగా ఉన్నప్పుడే శోభ సాహిత్యాన్ని పరీక్షలకు కాక అభిరుచితో చదవాలని, ఒక ప్రయోజనంతో విశ్లేషించాలని తపన పడటం చూసాను. బయటి విశ్వ విద్యాలయాల నుండి ఎవరు వచ్చి ఉపన్యాసాలు ఇచ్చినా, పత్రసమర్పణ చేస్తున్నా వినే తీరు, నోట్స్ రాసుకొనే తీరూ మళ్ళీ ఇలాంటి అవకాశం ఎప్పుడొస్తుందో... వచ్చిన దానిని పూర్తిగా వినియోగించుకోవాలి అన్నట్లు ఉండేది. తెలుగువిభాగంలో ఏడాదికి ఒక సెమినార్ తప్పనిసరిగా జరిగేది. అధ్యాపకులు, విద్యార్థులు కలిసి చేసుకొనే గొప్ప ఉత్సవం అది. మా అధ్యాయనానికి, పరిశోధనకు పనికివచ్చేదిగా, విద్యార్థుల అధ్యయనానికి దిశానిర్దేశం చేసేదిగా ఉండేట్లు సెమినార్లకు అంశాలను నిర్దేశించుకొనేవాళ్ళం. ఆ రకంగా పురాణ సాహిత్యం మీద సెమినార్ పెట్టాం ఆ సంవత్సరం. సెమినార్‌లో పరిశోధక విద్యార్థులకు పత్ర సమర్పణ అవకాశం ఇస్తాం. అయితే ఆ సంవత్సరం ఎమ్మె విద్యార్థులకు కూడా దానిని విస్తరింప చేద్దామని అనుకొన్నాం. ప్రత్యేకంగా వాళ్ళ కోసం ఒక సెషన్ కేటాయించాం. ఇద్దరు ముగ్గురు విద్యార్థులు కలిసి ఒక పత్రం తయారుచేయాలని అనుకున్నాం. అలా శోభ, శ్యామల, వేదవతి ముగ్గురు కలిసి స్కాంధ పురాణంలోని కౌమారికాఖండంపై పత్రం రాసి ఆ సెమినార్‌లో సమర్పించారు. వాళ్ళ పని పర్యవేక్షణ నాదే కనుక అంశాన్ని ఎన్నుకొన్న దగ్గర నుండి ఆ పురాణ భాగాన్ని చదవటం, నిఘంటువులు చూసి తెలియని పదాలకు అర్థాలు తెలుసుకొంటూ అన్వయించుకొంటూ అర్థం చేసుకొనటం ఈ మొత్తం క్రమంలో వాళ్ళ ఉత్సాహం ప్రత్యక్షంగా చూసాను. అందుకనే శోభ పీహెచ్‌డీ డిగ్రీ కోసం పరిశోధన నా పర్యవేక్షణలో చేస్తానంటే ఇష్టంగా ఒప్పుకున్నాను.

జండర్ స్పృహను పెంచుకొంది



2006లో శోభ ఎమ్మె అయిపొయింది. అదే సంవత్సరం నేను యూనివర్సిటీ ఉమెన్ స్టడీస్ సెంటర్‌కు డైరెక్టర్‌గా కొత్త బాధ్యతలు తీసుకొన్నాను. ఆ సంవత్సరమే పంచాయతీరాజ్ ఎన్నికలు ప్రకటించారు. అందులో 33 శాతం సీట్లు మహిళలకు కదా... వాళ్ళ రాజకీయ చైతన్య స్థాయిపై జిల్లా స్థాయి సర్వే సెంటర్ పక్షాన చేయాలనుకున్నాం. అందుకోసం అన్ని పంచాయితీలకు వెళ్లి సిద్ధం చేసిన ప్రశ్నావళి ప్రకారం సమాచారం సేకరించటానికి వెళ్ళాలి అని చెప్పగానే సిద్ధం అంటూ వచ్చిన యూనివర్సిటీ విద్యార్థులలో శోభ ఉంది. పంచాయితీ మెంబర్లుగా పోటీలో నిలబడ్డ స్త్రీలను కలిసి మాట్లాడి రావటంలో ఎదురైన అనుభవాలను గొప్ప భావోద్వేగంతో తాను పంచుకొన్న తీరు నాకు ఇప్పటికీ గుర్తే. ఎన్నికల ఫలితాలు వచ్చాక ఎంపికైన సర్పంచ్‌లకు తదితర స్థానిక ప్రభుత్వ పాలనాధికారులకు డివిజన్ వారీగా ఏర్పాటు చేసిన సభలకు కూడా శోభా వస్తుండేది. స్థానిక పాలనలో స్త్రీల సాధికారతలోని వాస్తవం పాలు ఎంతో, మాయ ఎంతో ఆ సందర్భం మాకు బాగా తెలియ పరిచింది. సెంటర్ కార్యక్రమాలలో భాగం అవుతూ జండర్ స్పృహను పెంచుకొంది.

రాజకీయ అవగాహన కోసం

చదువుకొంటున్న కాలంలో అభివృద్ధి చెందిన వామపక్ష దృక్పథం వల్లనే ఆమె బుర్ర రాములు ప్రభావంలోకి వెళ్ళింది. 2008లో నా దగ్గర పరిశోధనకు చేరేనాటికి మానవ హక్కుల వేదిక సభ్యురాలై వరంగల్ జిల్లా అధ్యక్షురాలిగా బాధ్యతలు నిర్వహిస్తున్నది. నిజ నిర్ధారణ కమిటీలలో భాగమై అనేకచోట్లకు తిరిగింది. ఉద్యమ అవసరాల రీత్యా సామాజిక రాజకీయ విషయాల అవగాహన కోసం అధ్యయనాలు చేసింది. అదే సమయంలో తన సాహిత్య ఆసక్తులకు తగ్గట్లుగా సాహిత్య సంస్థలతో, వ్యక్తులతో సంబంధాలు కొనసాగిస్తూనే ఉంది.

సమానత్వం కోసం

శోభ సాహిత్య అధ్యయనం సమకాలీన సామాజిక సందర్భాలు, అవసరాలబట్టి రూపొందుతూ వచ్చింది. దోపిడీ, పీడన, ఆర్థిక అసమానతలు లేని సమాజంకోసం వర్గపోరాటాల అవసరాన్ని, అనివార్యతను గుర్తించింది కనుక అభ్యుదయ విప్లవ సాహిత్యాలకు అభిమాని అయింది. నూతన ఆర్థిక విధానాలు, ప్రపంచీకరణ పెనుముప్పు సంస్కరణలు, అభివృద్ధి పేరిట దోపిడీనీ అసమానతలను పెంచి పోషిస్తాయి అని అర్థమయ్యే కొద్దీ వాటికీ వ్యతిరేక చైతన్యాన్ని ప్రోదిచేసే సాహిత్యం వైపు దృష్టి పెట్టింది. అదే సమయంలో ఈ అసమానతలలో భాగంగా స్త్రీపురుష వివక్ష అనేది కొనసాగుతుండగా స్వీయ అస్తిత్వ చేతనతో గొంతెత్తకుండా ఉండలేకపోయింది.

స్త్రీల సాహిత్య విమర్శ

ఉత్పత్తి, పునరుత్పత్తి శక్తి కూడా అయిన మహిళ సామాజిక సాహిత్య కళా, రాజకీయ రంగాలలో ప్రతిభావ్యుత్పత్తులు లేనిదానిగా ఉపాంతీకరణకు గురై చరిత్రలో మిగలకుండా పోతున్న తలకిందులు స్థితిని సరి చేయటం సాహిత్య విద్యా సాంస్కృతిక ఉద్యమంగా కొనసాగుతున్న సందర్భంలో శోభ పరిశోధన స్త్రీల సాహిత్యం కేంద్రంగా ఉండాలని, స్త్రీల సాహిత్య విమర్శ ఇప్పటివరకు ఎవరూ స్పృశించని అంశం కనుక పరిశోధనాంశం అదే చేసుకోవాలని నిర్ణయానికి వచ్చాం. అదే సమయంలో (2009-2011) తెలుగులో స్త్రీల సాహిత్యం 1900-1950 అనే అంశంపై నాకు వచ్చిన యూజీసీ మేజర్ రీసర్చ్ ప్రాజెక్ట్‌లో ప్రాజెక్ట్ ఫెలోగా పనిచేస్తూ ఈ పరిశోధన కొనసాగించింది. వేరువేరు ప్రాంతాలలో లైబ్రరీలకు తిరిగి సమాచారం సేకరించుకు రావటంలో వాటిని కార్డులపై నమోదు చేయటంలో శోభ చూపిన శ్రద్ధ, ఇష్టం ఆమె పనిని ఎంతగా ప్రేమించిందో చెప్తాయి. 'తెలుగుసాహిత్య విమర్శ - స్త్రీల కృషి' అనే అంశంపై శోభ రాసి డాక్టరేట్ పొందిన సిద్ధాంత గ్రంథాన్ని తెలుగు అకాడెమీ ప్రచురించింది. రెఫెరెన్స్ గ్రంథ గౌరవాన్ని పొందిన పుస్తకం అది. వ్యాస శోభిత, తెలుగు సాహిత్యంలో స్త్రీవాద విమర్శకులు, సాహిత్యావలోకనం అనే మరో మూడు వ్యాస సంపుటాలు కూడా ప్రచురించింది శోభ.

కుటుంబం కోసం...

పరిశోధన కాలంలో శోభా నేను కలిసి గడిపిన కాలం ఎక్కువ. సెమినార్లకు కలిసి చేసిన ప్రయాణాలు కూడా ఎక్కువే. పరిశోధన గురించి, తాను సెమినార్లకు రాసే పేపర్ల గురించి చర్చలు ఎంత సుదీర్ఘంగా నడిచేవో.!? రాసింది సరిచూసుకొంటూ ఎన్నెన్ని గంటలు గడిచిపోయేవో. మధ్యమధ్యలో చాయ్ తాగుతూనో.. తింటూనో వ్యక్తిగత, కుటుంబిక జీవితానుభవాల ముచ్చట్లు కూడా నడిచేవి. అప్పుడే నాకు తెలిసింది శోభ జీవితం నల్లేరు మీద బండినడక కాదని. ఇంటర్ చదువు పూర్తి అవుతూనే అన్నలిద్దరూ పట్టించుకోకుండా వదిలేసిన తల్లిదండ్రుల బాధ్యత భుజానికి ఎత్తుకుంది. 200 రూపాయలకు తాను పుట్టి పెరిగిన పాపయ్య పేటలోనే ప్రభుత్వ పాఠశాలలో పారా టీచర్‌గా పనిచేస్తూ, కారం మిల్లు నడుపుతూ చెల్లెలిని, తమ్ముడిని కూడా చదివించింది. వాళ్ళను చదివిస్తూనే తాను బిఎ పూర్తిచేసింది. 2002లో పెళ్లయ్యాక రమేష్ స్నేహితులు వెంకన్న, వెంకట రమణ(యాకయ్య), గిన్నె రాజు ఇచ్చిన సహకారాలతో తెలుగు ఎమ్మె ప్రవేశ పరీక్ష రాసానని మెరిట్ లిస్టులో మొదటి ఐదుగురిలో తాను ఉన్నానని ఆ రకంగా ఇలా మీ అందరి సహవాసంలోకి వచ్చానని చెప్తుండేది.

మనలో మనం



శోభకు నాకు మరొక అనుబంధం ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక. భిన్న అస్తిత్వాలతో ఉన్న రచయిత్రుల మధ్య సంభాషణకు, స్నేహానికి, సామాన్య సూత్రాన్ని, ప్రాతిపదికను చర్చలోకి తీసుకొనిరావటానికి 2009లో విశాఖ పట్నంలో జరిగిన 'మనలో మనం' సభలకు వరంగల్ నుండి వెళ్లిన మా బృందంలో శోభ కూడా ఉన్నది. మనలో మనం అనే పేరుతోనే యాడాది పాటు స్త్రీల సాహిత్యాన్ని కులమత ప్రాంతీయ అస్తిత్వ కోణాలనుండి అధ్యయనం చేయటాన్ని అలవాటు చేసుకొంటూ, ప్రచారం చేస్తూ తెలంగాణ, కోస్తాఆంధ్ర, రాయలసీమ, ఉత్తరాంధ్రలలో చేసిన నాలుగు సెమినార్లకు తాను వచ్చింది. ప్రసంగ వ్యాసాలు సమర్పించింది. 2010లో అదే ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక అయితే దానితోపాటే నడిచింది. అందుకోసం చేసిన అధ్యయనాలు, ప్రయాణాలు పరిశోధన తర్వాత కూడా మా స్నేహ సంబంధాలను సజీవంగా ఉంచాయి. అదే సమయంలో యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో పార్ట్ టైం లెక్చరర్‌గా చేరటంతో శోభ నా సహాధ్యాపకురాలు కూడా అయింది.

చురుకైన భాగస్వామ్యం

శోభ వ్యక్తిత్వంలో మరొక అంశం 2009 తర్వాత మలిదశ తెలంగాణా రాష్ట్ర ఉద్యమంలో చురుకైన భాగస్వామ్యం. రాస్తారోకోలు, మానవహారాలు, కొవ్వొత్తుల ర్యాలీలు, రహదారులపై వంటావార్పు, రాష్ట్ర సాధన దీక్షా శిబిరాలు... ఒకటేమిటి అన్నిటా తానై తిరిగింది. తెలంగాణ రాష్ట్ర సాధనకోసం జరిగిన సాహిత్య సాంస్కృతిక ఉద్యమాలలో భాగమైంది. కవిత్వాన్ని ఆయుధంగా పదునెక్కించిన కాలం ఇది. కవిత్వం రాయటమే కాదు, కవి సమ్మేళనాలలో పాల్గొనటమే కాదు తెలంగాణ కోసం ఏర్పడిన వరంగల్ రచయితల ఐక్యవేదిక పనులలో చురుకైన భాగస్వామ్యం తనది. ఆ సంస్థ పక్షాన ప్రచురించబడిన "తెలంగాణా ఉరుములు-మెరుపులు" అనే కవితా సంకలనం సంపాదకవర్గంలో శోభ కూడా ఉంది. ఆ కాలంలోనే వరంగల్‌లో ఏర్పడిన "గోదావరి సాహితీ మిత్రులు" సమూహంలోనూ తానున్నది. "ప్రపంచం ఒక పద్మవ్యూహం" అని తెలిసి కవిత్వం ఒక తీరని దాహంగా జీవించింది శోభ.

అనారోగ్యం వేధిస్తున్నా...

మైగ్రేన్ లాంటి సమస్యలున్నా తోసేసుకొంటూ తిరిగిన శోభ రెండవ ప్రసవం తర్వాత గర్భకోశ సంబంధమైన ఇబ్బందులతో, రక్త హీనతతో బాధపడుతూ వచ్చింది. కీళ్ల నొప్పులు దానికి తోడయ్యాయి. అదే ఆమెను సామాజిక సంస్థాగత కార్యక్రమాలలో ఇదివరకంతటి చురుకుగా పాల్గొననియ్యని పరిమితి అయింది. అయినా ఆమె ఎక్కడా ఆగలేదు. కరోనాకాలంలో అంతర్జాల సమావేశాలు ఏవి జరిగినా వాటిల్లో పాల్గొన్నది. స్త్రీల నవలల మీద శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం వాళ్ళు పెట్టిన సదస్సులో రంగనాయకమ్మ 'కళ్ళు తెరిచిన సీత' నవల మీద మాట్లాడింది. లత నవలలు మీద వంశీ రామరాజు గారు పెట్టిన సదస్సులో నా దగ్గర నుండే ఒక నవల తీసుకొని వెళ్లి పేపర్ సమర్పించింది. మార్క్సిస్టు సాహిత్య విమర్శపై జిజ్ఞాసవేదిక నిర్వహించిన అంతర్జాల ప్రసంగాల పరంపరను క్రమం తప్పకుండా వింటూ ఎంత బాగున్నాయి మేడం ప్రసంగాలు అంటూ ఫోన్ చేసి సంతోషాన్ని పంచుకొనేది. ఆ తర్వాత స్త్రీవాద సాహిత్య విమర్శపై ప్రజాస్వామిక వేదిక, జిజ్ఞాస కలిసి నిర్వహించిన అంతర్జాల ప్రసంగాల పరంపరలో స్త్రీల సాహిత్య విమర్శపై కృషి చేసిన శోభ ఒక ప్రసంగం చేయకపోతే ఎలా అని తన ఆరోగ్య పరిమితులు తెలిసి కూడా తనను అడిగాను. తప్పకుండా మాట్లాడతా... పుస్తకాలు తెప్పించుకొంటా... మంచం మీద పడుకొని అయినా సరే చదువుకొంటా.. రాసుకొంటా.. మాట్లాడతా అని దృఢంగా చెప్పింది. "ఆధునిక తెలుగు సాహిత్యం - స్త్రీ చైతన్యం (1911-1935)" అనే అంశం మీద 2022 సెప్టెంబర్ 18న ఆమె చేసిన ప్రసంగం యుట్యూబ్‌లో లభిస్తున్నది.

మరువలేని జ్ఞాపం

ఆరోజు తెరమీద కనబడిన శోభ అక్టోబర్‌లో బతకమ్మ పండుగ రోజుల్లో మా ఇంటికి వచ్చింది. అప్పటికి ఆమె యూనివర్సిటీలో మహాత్మా జ్యోతిరావు పూలే సెంటర్ ఫర్ రీసెర్చ్‌కి డైరెక్టర్ అయింది. యూనివర్సిటీ మహిళా కళాశాలనుండి యూనివర్సిటీ విభాగానికి బదిలీ అయింది. జ్యోతిరావు పూలే సెంటర్‌లో పరిశోధన కార్యక్రమాలు ఏమి చేపట్టవచ్చో చర్చించటానికి వచ్చింది. కీళ్ల నొప్పుల బాధ, నీరసం మొహం మీద కనబడుతున్నా వాటిని తరిమేసే కార్యోత్సాహమే ఆమె ముఖాన్ని వెలిగింప చేయటం చూసాను. సెంటర్ పనులలో తోడుగా ఉంటానని నా దగ్గర నుండి మాట తీసుకొని వెళ్లిన శోభ మూడు నెలలలో ఇలా వెళ్ళిపోతుందని ఎలా అనుకోగలను!? చదవటం, రాయటం ఉచ్ఛ్వాస నిశ్వాసాలుగా, క్రియాశీల సౌందర్యమే జీవితంగా బతికిన శోభ నాకు మరువలేని జ్ఞాపకం.

\- కాత్యాయనీ విద్మహే

కులం చెపితేనే ఎరువులు

(మొదటిపేజి తరువాయి)

కోసం ఓపీఎస్ యంత్రాలను ఉపయోగించడం, ఎరువుల సబ్సిడీలను డీబీటీకి మార్చే ప్రయత్నాలను ఏఐకేఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని పేర్కొన్నారు.

వంటగ్యాస్ సబ్సిడీలను డీబీటీకి మార్చిన అనుభవం ఉందనీ, డీబీటీ సబ్సిడీ పథకాలు సబ్సిడీలను పూర్తిగా ఉపసంహరించుకునే ఎత్తుగడ తప్ప మరొకటి కాదని తేలిందని స్పష్టం చేశారు. వ్యవసాయంలో డీబీటీ పథకాలు భూమి రికార్డులతో అనుసంధానించబడి, భూమిలేని, కౌలు రైతులను సబ్సిడీల ప్రయోజనం నుంచి మినహాయించాయని తెలిపారు. ఎరువుల సబ్సిడీ ధరలను తగ్గించాలనీ, ప్రభుత్వం నియంత్రిత ధరలకు తగినన్ని ఎరువులు సరఫరా చేయాలని కోరారు. రైతులు తెచ్చిన ఒత్తిడితో ఎరువుల ధరలు పెరగకుండా రెండేండ్లుగా నియంత్రించగలిగినప్పటికీ... వాటి సరఫరా భారీగా తగ్గిందని గుర్తుచేశారు. దీంతో రైతులకు కావాల్సినన్ని ఎరువులు అందుబాటులో లేకపోవటంతో బ్లాక్ మార్కెటింగ్ జోరుగా సాగుతున్నదని తెలిపారు. కులం సమాచారాన్ని సేకరించేందుకు తీసుకున్న ఈ తిరోగమన నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఏఐకేఎస్ డిమాండ్ చేస్తోందని అన్నారు. ప్రభుత్వం ఆధార్-సీడ్ పిఓఎస్ మిషన్ల తప్పనిసరి వినియోగాన్ని ఉపసంహరించుకోవాలనీ, రైతులకు తగినన్ని ఎరువులు నియంత్రిత ధరలకు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు.

ట్రాఫిక్ పరిష్కారానికే స్టీల్ బ్రిడ్జీల నిర్మాణం

(మొదటిపేజి తరువాయి)

ప్రమాదం జరక్కుండా రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందిరాపార్కు నుంచి పనులను పరిశీలిస్తూ మంత్రి కాలినడకన వీఎస్‌టీ వరకు వెళ్లారు. అక్కడ పూర్తయిన ర్యాంపు పైకి వెళ్లి బ్రిడ్జి నిర్మాణ పనులను పర్యవేక్షించారు. 2.8 కిలోమీటర్ల పొడవైన నాలుగు వరుసల స్టీల్ బ్రిడ్జి కోసం రూ.440 కోట్లు జిహెచ్‌ఎంసి ఖర్చు చేస్తున్నదని మంత్రి తెలిపారు. ఆర్టీసీ క్రాస్ రోడ్ వద్ద ట్రాఫిక్‌ని తగ్గించి, ముషీరాబాద్, ఖైరతాబాద్, అంబర్‌పేట నియోజక వర్గాల ప్రజల సౌకర్యార్థం ఈ బ్రిడ్జి నిర్మాణం చేయాలన్న డిమాండ్ రెండు దశాబ్దాలుగా ఉన్నదన్నారు.

ఎట్టకేలకు ఇప్పుడు పూర్తికావచ్చిందని చెప్పారు. అనంతరం ఎస్‌ఎన్‌డిపి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పలు పనులను మంత్రి పరిశీలించారు. హుస్సేన్ సాగర్ మిగులు నాలాలో చేపడుతున్న పనులు, అశోక్‌నగర్ వద్ద నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్ పనులను పరిశీలించారు. వరద ముంపు ఉన్న ప్రాంతాలను గుర్తించి, ఆ ప్రమాదాన్ని తగ్గించే విధంగా అనేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. మంత్రి వెంట ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, పలువురు జీహెచ్‌ఎంసీ అధికారులు ఉన్నారు.

హైదరాబాద్‌లో యూరోఫిన్స్ సంస్థ పెట్టుబడులు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్‌లో యూరోఫిన్స్ సంస్థ పెట్టుబడులు.. మంత్రి కేటీఆర్‌తో చర్చ తెలంగాణకు పెట్టుబడులు తరలివస్తూనే ఉన్నాయి. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్‌తో యూరప్‌కు చెందిన యూరోఫిన్స్ సంస్థ ప్రతినిధులు శనివారం భేటీ అయ్యారు. రెండు రోజుల క్రితం తైవాన్‌కు చెందిన ఫాక్స్‌కాన్ సంస్థ తెలంగాణలో పెట్టుబడులు పెడుతున్నట్టు ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా మరో సంస్థ కూడా ముందుకు వచ్చింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో సంస్థ పెట్టుబడి ప్రణాళికలపై చర్చించారు. ఈ సమావేశంలో బయోఫార్మా సర్వీసెస్ యూరప్ ప్రెసిడెంట్ నటాలియా శుమాన్‌తో పాటు ఇతరులు పాల్గొన్నారు. కేటీఆర్ దావోస్ పర్యటనలో వెయ్యి కోట్ల పెట్టుబడిని యూరోఫిన్స్ సంస్థ ప్రకటించిన విషయం తెలిసిందే.

మండలిలో విప్‌గా బాధ్యతలు స్వీకరించిన పాడి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

శాసనమండలిలో విప్‌గా ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిన ఆయనకు...గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి దక్కింది. ఈ నేపథ్యంలో ఆయనకు విప్ బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే.

మార్చి 8 నుండి ఆరోగ్య మహిళ

(మొదటిపేజి తరువాయి)

జిల్లా కలెక్టర్లు తదితరులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల సమగ్ర ఆరోగ్య పరిరక్షణ కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా 'మధుమేహం, రక్తపోటు, రక్తహీనత, ఇతర సాధారణ పరీక్షలు, ఓరల్, సర్వైకల్, రొమ్ము క్యాన్సర్ల స్క్రీనింగ్, థైరాయిడ్ పరీక్ష, సూక్ష్మ పోషకాల లోపాలను గుర్తించడం, అయోడిన్ సమస్య, ఫోలిక్ యాసిడ్, ఐరన్ లోపంతో పాటు, విటమిన్ బీ12, విటమిన్ డి పరీక్షలు చేసి చికిత్స, మందులు అందజేస్తారు. మూత్రకోశ సంబంధిత ఇన్ఫెక్షన్లు, పెల్విక్ ఇన్ఫ్లమేటరీ వ్యాధుల పరీక్షలు చేస్తారు. మెనోపాజ్ దశకు సంబంధించి పరీక్షల అనంతరం అవసరమైన వారికి హార్మోన్ రీప్లేస్మెంట్ థెరపీ చేయడంతోపాటు కౌన్సిలింగ్‌తో అవగాహన కలిగిస్తారు. నెలసరి సమస్యలపై పరీక్షలు చేసి వైద్యం అందిస్తారు. సంతాన సమస్యలపై ప్రత్యేకంగా పరీక్షలు చేసి అవగాహన కలిగించడం, అవసరమైనవారికి అల్ట్రాసౌండ్ పరీక్షలు చేస్తారు. సెక్స్ సంబంధిత అంటువ్యాధుల పరీక్షలు చేసి అవగాహన కలిగిస్తారు. అవసరమైన వారికి వైద్యం అందిస్తారు. బరువు నియంత్రణ, యోగా, వ్యాయామం వంటివాటిపై అవగాహన కలిగిస్తారు. ఉచితంగా నిర్వహించే అన్ని రకాల వైద్య పరీక్షలు, ప్రత్యేక యాప్ ద్వారా మానిటరింగ్ ఉంటుంది. తెలంగాణ డయాగ్నొస్టిక్ ద్వారా 57 రకాల వైద్య పరీక్షలు చేస్తారు. రెఫరల్ సెంటర్లుగా ప్రభుత్వ పెద్దాస్పత్రులుంటాయి. సంబంధిత మహిళకు పూర్తిగా నయం అయ్యే వరకు వైద్య సేవలు అందించే కార్యక్రమం ఇది. రెఫరల్ ఆస్పత్రుల్లో మహిళలకు సేవలు పొందేందుకు వీలుగా ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఉంటాయి....' అని మంత్రి వివరించారు.

'అన్ని జిల్లాల్లో విజయవంతంగా నిర్వహించాలనీ, ఈ ప్రత్యేక సేవల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలనీ, మార్చి 8 రోజున ప్రారంభించే కార్యక్రమాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొనాలనీ. జిల్లా కలెక్టర్లు, డీఎంహెచ్ వో చొరవతో పర్యవేక్షించాలనీ, మార్చి 8 రోజున ప్రారంభించే కార్యక్రమాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొనేలా చూడాలి. జిల్లా కలెక్టర్లు, డీఎంహెచ్‌వో చొరవతో పర్యవేక్షించాలి. జిల్లాల్లో ఎక్కడ ఈ కార్యక్రమం ప్రారంభిస్తున్నామనే వివరాలు ముందుగా ప్రజా ప్రతినిదులు, ప్రజలకు తెలియ చేయాలని .....' హరీశ్ రావు ఆదేశించారు.

10 కేసుల్లో ఒకరే బతుకున్నారు...

అకస్మాత్తుగా వచ్చే కార్డియాక్ అరెస్ట్ కేసుల్లో 10 మందికిగాను తొమ్మిది మంది మరణిస్తున్నారని మంత్రి హరీశ్ రావు తెలిపారు. దీనికి కార్డియో పల్మనరీ రిససిటేషన్ (సీపీఆర్)పై అవగాహన లేకపోవడమే కారణమని చెప్పారు. సీపీఆర్‌పై పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని ఆదేశించారు. ఇప్పటికే రాష్ట్ర స్థాయిలో జిల్లాకు ఐదు మంది చొప్పున మాస్టర్ ట్రైనింగ్ ఇచ్చామనీ, వారితో అన్ని విభాగాల వారికి శిక్షణ ఇప్పించాలని సూచించారు.

కంటి వెలుగులో రాష్ట్ర సగటు కంటే తక్కువగా జరుగుతున్న జిల్లాల కలెక్టర్లు క్యాంపులను స్వయంగా సందర్శించాలని మంత్రి హరీశ్ రావు ఆదేశించారు. కంటి వెలుగు ప్రతి ఒక్కరికి చేరేలా చూడాలని కోరారు. సగటున 14 శాతం మందికి కండ్లద్దాలు అవసరం పడుతున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, వైద్యారోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీ, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

9న క్యాబినెట్ భేటి

(మొదటిపేజి తరువాయి)

ప్రధాన కార్యదర్శి ఎ. శాంతికుమారిపై విమర్శలు చేసిన సంగతి తెలిసిందే. ఢిల్లీ కంటే రాజ్‌భవన్ దగ్గరగా ఉందంటూ, సీఎస్ అయిన తర్వాత కనీసం ప్రోటోకాల్ కూడా పాటించరా ? అంటూ ట్వీట్ చేసిన విషయం విదితమే. దీనిపై ప్రభుత్వంతోపాటు ఐఏఎస్‌ల్లోనూ చర్చకు దారితీసింది. ఈనేపథ్యంలో ఆ అంశం సైతం మంత్రివర్గంలో చర్చకు వచ్చే అవకాశం లేకపోలేదు.

రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చర్చించి తీర్మానం చేసిన దాదాపు 10 బిల్లులను ఆమోదించకుండా నెలల తరబడి రాజ్‌భవన్‌లో పెండింగ్ పెట్టిన నేపథ్యంలో సీఎస్ సుప్రీంకోర్టులో పిటిషన్ వేయడమే వివాదానికి కారణం కావడం గమనార్హం.

భయాందోళనలో క్రిస్టియన్లు

(మొదటిపేజి తరువాయి)

మైనారిటీల ప్రజలు తమ సొంత దేశంలో అనామకులుగా ఉంటున్నారని వివరించారు. వారి సొంత విశ్వాసాలను పాటించడంలో అపరాధ భావంతో ఉండాల్సిన పరిస్థితులున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ అగ్రనాయకులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఒక్క మాటతో మైనారిటీలపై హింసను ఆపగలమని మాజీ బ్యూరోకాట్లు వివరించారు.

కమీషన్ల కోసమే 9వ ప్యాకేజీ పూర్తి చేయలేదు

(మొదటిపేజి తరువాయి)

కేటీఆర్ తన అనుచరులకు పనులు అప్పగించారన్నారు. లాభాలు దండుకుని, మిగిలిన పనులను గాలికొదిలేశారని, కేటీఆర్ 2009నుంచి సిరిసిల్ల నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ఎన్నికై రూ.వేల కోట్లు సంపాదించారన్నారు. తెలంగాణ రాకముందు ఆంధ్రావాళ్లు మన రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని చెప్పిన కేటీఆర్.. తెలంగాణ వచ్చాక ఆంధ్రా కాంట్రాక్టర్లకు పెద్ద పెద్ద పనులు ఇచ్చి వారి వద్ద కమీషన్లు దండుకుంటున్నారని విమర్శించారు. పనులు ఆలస్యం కావడానికి, అంచనా వ్యయం పెరగటానికి కారణమైన సంస్థ గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కమీషన్ల కక్కుర్తితో కేటీఆర్ రైతులకు అన్యాయం చేస్తున్నారన్నారు. తక్షణమే 9వ ప్యాకేజీ పనులు పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌గౌడ్, జిల్లా డీసీసీ అధ్యక్షులు ఆది శ్రీనివాస్, సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, సిరిసిల్ల పట్టణ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు షేక్ గౌస్, ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

రేవంత్‌రెడ్డి పాదయాత్రలో ప్రమాదం

- ఒకదానికొకటి ఢీకొన్న కాన్వయ్‌లోని 6వాహనాలు

నవతెలంగాణ - గంభీరావుపేట

రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరుగుతున్న టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి హాత్ సే హాత్ జోడో యాత్రలో శనివారం ప్రమాదం జరిగింది. ఆయన కాన్వాయ్‌లోని వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. వాటిల్లో ప్రయాణిస్తున్న పలువురు నాయకులు, విలేకరులకు స్వల్ప గాయాలయ్యాయి. గంభీరావుపేట మండలంలోని సముద్రలింగపూర్ గ్రామ శివారులో ప్రాంతంలో 9వ ప్యాకేజీ కెనాల్ పనులను రేవంత్ రెడ్డి పరిశీలించడానికి వెళుతున్న క్రమంలో కాన్వాయ్‌లో వేగంగా ముందు వెళుతున్న వాహనం డ్రైవర్ సడెన్ బ్రేక్ వేయడంతో వెనుక ఉన్న వాహనాలు ఒకదానికొకటి ఢీకొట్టాయి. ఇందులో రేవంత్ రెడ్డికి సంబంధించిన నాలుగు వాహనాలు, న్యూస్ చానళ్లకు చెందిన రెండు వాహనాలు ఉన్నాయి. ఈ ప్రమాదంలో కారులో బెలూన్ ఓపెన్ కావడంతో ప్రయాణిస్తున్నవారు స్వల్ప గాయాలయాలతో బయటపడ్డారు. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు.

త్రిపురలో కొనసాగుతున్న బీజేపీ దుశ్చర్యలు

(మొదటిపేజి తరువాయి)

చేస్తున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో త్రిపురలో బీజేపీ బోటాబోటీ అధిక్యం సంపాదించింది. ఫలితాలు వెల్లడైన దగ్గర నుంచి గతంకంటే ఎక్కువగా బీజేపీ మూకలు ప్రతిపక్షాల ఇండ్లపై దాడులు చేస్తున్నాయి. ప్రత్యేకించి వామపక్ష కార్యకర్తల ఇండ్లను లక్ష్యంగా చేసుకుని బీజేపీ దాడులకు తెగబడుతోంది. ఈ దాడుల కారణంగా పశ్చిమ త్రిపుర జిల్లాలో 144వ సెక్షన్ విధించారు. ఈ దాడులను సీపీఐ(ఎం) తీవ్రంగా ఖండించింది. రాష్ట్రంలో శాంతిభద్రతలను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేసింది. కాగా, వామపక్ష కార్యకర్తల ఇళ్లపై దాడులకు సంబంధించిన వివరాల్లోకి వెళితే... జుబారాజ్‌నగర్‌లో కొత్తగా ఎన్నికైన సీపీఐ(ఎం) ఎమ్మెల్యే శైలేంద్రనాథ్‌కు చెందిన రబ్బర్ ప్లాంటేషన్‌కు కాషాయ మూక నిప్పు పెట్టింది. అగర్తలాలోని బదర్‌ఘాట్ ప్రాంతంలో సీపీఐ(ఎం) స్థానిక పార్టీ కార్యదర్శి శ్యామల్ రాయ్ ఇంటిపైనా దాడి జరిగింది. ఇక అగర్తలలోని శ్రీపల్లిలో ప్రముఖ జర్నలిస్ట్ సమీర్ ధర్ ఇంటిపైనా దాడి చేశారు. ఒక్క శ్రీపల్లిలోనే ఐదుగురు సీపీఐ(ఎం) కార్యకర్తల ఇండ్లపై దాడులు జరిగాయి. కుమార్‌ఘాట్ డివిజన్‌లోని పెచర్‌తోల్, దూద్‌పూర్, దస్ఘరి ప్రాంతాల్లో బీజేపీ దాడికి తెగబడింది. ఇక దూద్‌పూర్‌లో ఇద్దరు సీపీఐ(ఎం) కార్యకర్తలను చితకబాదారు. అలాగే జిరానియా బజార్‌లోని చిత్తరంజన్ పల్లిలో రాణా చక్రవర్తి అనే స్కూల్ టీచర్ ఇంటిపైనా దాడి జరిగింది. బిషాల్‌గడ్‌లోని చరిలం ప్రాంతంలో సీపీఐ(ఎం) కార్యకర్తల 16 ఇండ్లు ధ్వంసమయ్యాయి. ఓ ప్రభుత్వ ఉద్యోగి చేతులు విరగ్గొట్టారు. అతన్ని చికిత్స కోసం ఆసుపత్రికి వెళ్లకుండా కూడా అడ్డుకున్నారు.. గర్జి ప్రాంతంలో 'ప్రోతిబడి కోలోం' అనే స్థానిక దినపత్రికలో పనిచేస్తున్న జర్నలిస్టు ఇంటిపైనా దాడి జరిగింది. అతని రబ్బరు తోటలకు బీజేపీ మూకలు నిప్పంటించడంతో అది పూర్తిగా కాలి బూడిదైంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఖోవైలో బీజేపీ ఓడిపోయింది. నొగావ్ ప్రాంతంలోని సీపీఐ(ఎం) కార్యకర్తపై కొడవళ్లతో దాడి చేశారు. ప్రస్తుతం ఆయన ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నా. పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం.

నరేగాపై శీతకన్ను

(మొదటిపేజి తరువాయి)

దాదాపు రూ.2.72 లక్షల కోట్లు అవసరం అవుతాయని సామాజిక కార్యకర్తలు చెబుతున్నారు.

భారీగా వేతన బకాయిలు : బృందా కరత్

దేశంలో ఒక్క శాతం ధనికుల వద్ద 40శాతం వనరులున్నాయి. అయినా వారిపై అదనపు పన్ను వేయటం లేదు. మరోవైపు తమ వద్ద నిధులు లేవని, బడ్జెట్ లోటుందని కేంద్రం వాదిస్తోంది. చివరికి గ్రామీణ పేదలే బాధితులవుతున్నారు. ఉపాధి హామీ అమలుజేసిన 20 రాష్ట్రాల్లో వేతన బకాయిలు పేరుకుపోయాయి. అనేకమార్లు రాష్ట్రాలు ఈ అంశాన్ని లేవనెత్తాయి. అయినా కేంద్రం నుండి నిధులు సమయానికి విడుదల కాలేదు. ఉపాధి హామీ కార్మికుల్లో అత్యధికులు దళితులు, గిరిజనులు, మహిళలు. వీరి నుంచి పని తీసుకొని చెల్లింపులు నిలిపివేస్తున్నారు. ఇలా చేయటం నేరం. కార్మికులకు అత్యంత స్వల్ప వేతనాలు దక్కుతున్నాయి. దీనిని కూడా సవరించాలని మేం చాలా రోజులుగా కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నాం.

63 లక్షల 82 వేల మందికి కంటి పరీక్షలు

- రాష్ట్ర పౌర, సమాచారశాఖ కమిషనర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కంటి వెలుగు రెండో దశ కార్యక్రమంలో భాగంగా శనివారం నాటికి 63 లక్షల 82 వేల మందికి పరీక్షలు నిర్వహించారు. ఈ మేరకు రాష్ట్ర పౌర, సమాచారశాఖ కమిషనర్ ఒక ప్రకటన విడుదల చేశారు. 11 లక్షల 40 వేల మందికి రీడింగ్ గ్లాసెస్ ఉచితంగా అందజేశారు. 40 ఏండ్లు పైబడిన వారిలో దగ్గరి చూపు, 50 ఏండ్లు పైబడిన వారిలో మోతబిందు (కాటరాక్ట్) సమస్యలు ఎక్కువగా వెలుగులోకి వస్తున్నాయి. గ్రేటర్ హైదరాబాద్‌లో ప్రస్తుతమున్న 256 బస్తీ దవాఖానాలే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా 141 మున్సిపాల్టీల్లో 288 బస్తీ దవాఖానాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నది. ప్రభుత్వ చర్యలతో 2014లో లక్ష ప్రసవాలకు 92గా ఉన్న మాత మరణాలు 56కు, 39గా ఉన్న శిశు మరణాలు 23కి, ఐదేండ్లలోపు చిన్నారుల మరణాలు 41 నుంచి 30కి, బాలింతల మరణాలు 25 నుంచి 16కు తగ్గాయి. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు 30 శాతం నుంచి 56 శాతానికి పెరిగాయి.

పీర్జాదిగూడలో 'ఇంటింటికీ తెలుగు దేశం'



నవతెలంగాణ-బోడుప్పల్
ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాలకుల వైఫల్యాలను ఎత్తి చూపడం కోసం ప్రతి ఇంటికి తిరుగుతామని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ టీడీపీ అధ్యక్షుడు కూతాడి నరసింహ అన్నారు. తెలుగుదేశం పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఇంటింటికీ తెలుగు దేశం కార్యక్రమాన్ని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో రెండో రోజు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు టి.వెంకట్రావు, రాములు, ఖాదర్ వలీ,శ్రీనివాస్, వసంత,సుజాత, కృష్ణవేణి, ఖాజాబీ, జూబేదా బేగం,అశ్రఫ్ తదితరులు పాల్గొన్నారు.

ముంబైలో గ్లోబల్ ఫేమ్ అవార్డ్స్ 2023



ఎంట్రెప్రెన్యూర్ సాయిరాం గౌడ్

నవతెలంగాణ-హయత్ నగర్
ముంబైలో గ్లోబల్ ఫేమ్ అవార్డ్స్ 2023 నిర్వహించిన బెస్ట్ సోషల్ ఎంట్రెప్రెన్యూర్ అవార్డ్ గ్రహీత పొట్లపల్లి సాయిరాం గౌడ్ రియల్ హీరో సూపర్ స్టార్ సోను సూద్ చేతుల మీదుగా ఈ అవార్డ్ అందుకున్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని మన్సురాబాద్ డివిజన్ వినాయక నగర్ కాలనీకి చెందిన పొట్లపల్లి సాయిరామ్ గౌడ్ హైదరాబాద్‌కి వచ్చాక స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి వారి నివాసంకి వెళ్లి శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అవార్డు గ్రహీత తల్లిదండ్రులు, బీజేపీ నాయకులు కడారి యాదగిరి, నవీన్ గుప్తా,పారంద సాయి, జయతేజ, రోహిత్ రెడ్డి, రవి తేజ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ హైదరాబాద్ నగరానికి స్టీల్ బ్రిడ్జి తలమానికం

- స్టీల్ బ్రిడ్జ్ నిర్మాణ పనులతోపాటు ఎస్ఎన్‌డీపీ పనులను తనిఖీల్లో
- పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్



నవతెలంగాణ-సిటీబ్యూరో,అడిక్‌మెట్
సెంట్రల్ హైదరాబాద్ నగరానికి ప్రభుత్వం నిర్మిస్తున్న వీఎస్టీ-ఇందిరాపార్క్ స్టీల్ బ్రిడ్జి తలమానికంగా మారబోతున్నదని పురపాలకశాఖ మంత్రి కే.తారకరామారావు అన్నారు. శనివారం ఆయన స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులతోపాటు ఇతర అభివద్ధి కార్యక్రమాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఇందిరాపార్క్ వద్ద కొనసాగుతున్న స్టీల్ బ్రిడ్జి పనుల వరకు చేరుకున్న మంత్రి కేటీఆర్, స్టీల్ బ్రిడ్జ్ పురోగతిని జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. స్టీల్ బ్రిడ్జి పనుల పురోగతిని తెలుసుకున్న అనంతరం ఆయన పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. స్టీల్‌బ్రిడ్జ్ పనులు తుది దశకు చేరుకున్న నేపథ్యంలో మూడు నెలలలోగా బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందుకు అవసరమైన ట్రాఫిక్ మళ్లింపు వంటి అంశాలలో నగర ట్రాఫిక్ పోలీస్ విభాగంతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఎట్టి పరిస్థితులలో మూడు నెలల్లోగా నిర్మాణం పూర్తి చేసేందుకు అవసరమైతే అదనపు బందాలను ఏర్పాటు చేసి, నిర్మాణ పనులను వేగవంతం చేయాలని వర్కింగ్ ఏజెన్సీని కేటీఆర్ ఆదేశించారు. నిర్మాణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో అటు కార్మికులకు, నగర పౌరులకు ఎలాంటి ప్రమాదం జరగకుండా కట్టుదిట్టమైన రక్షణ చర్యలను కూడా తీసుకోవాలని సూచించారు. నిర్మాణ పనులను పరిశీలించుకుంటూ వీఎస్టి చేరుకున్న మంత్రి కేటీఆర్ అక్కడ దాదాపుగా పూర్తయిన ర్యాంపు పైనుంచి బ్రిడ్జి నిర్మాణ పనులను పర్యవేక్షించారు.

ఇప్పటికే హైదరాబాద్ నగరంలో పూర్తయిన ఎస్ఆర్డీపీ ఫ్లైఓవర్ల మాదిరి ఈ స్టీల్ బ్రిడ్జి అద్భుత నిర్మాణంగా మారబోతున్నదని అభిప్రాయ పడ్డారు. 2.62 కిలోమీటర్ల పొడవైన నాలుగు వరుసల స్టీల్ బ్రిడ్జి కోసం దాదాపు రూ.426కోట్ల నిధులను జీహెచ్ఎంసీ ఖర్చు చేస్తున్నట్లు మంత్రి కేటీఆర్ తెలిపారు. ఆర్టీసీ క్రాస్ రోడ్ వద్ద ట్రాఫిక్‌ని తగ్గించి, ముషీరాబాద్, ఖైరతాబాద్, అంబర్పేట్ వంటి నియోజక వర్గాల ప్రజల సౌకర్యార్థం ఈ బ్రిడ్జి నిర్మాణం చేయాలన్న డిమాండ్ రెండు దశాబ్దాలుగా ఉన్నదని, ఇంతటి కీలకమైన ఈ బ్రిడ్జి నిర్మాణం సత్వరంగా పూర్తి చేయాలన్న లక్ష్యంతోనే సాధారణ కాంక్రీట్ నిర్మాణం కాకుండా స్టీల్ బ్రిడ్జి మార్గంలో బ్రిడ్జి నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. స్టీల్ బ్రిడ్జ్ నిర్మాణం రానున్న 3 నెలల్లో పూర్తి అవుతుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేసిన కేటీఆర్, ఆ తర్వాత లక్షలాదిమంది నగర పౌరులకు ట్రాఫిక్ రద్దీ సమస్య నుంచి ఉపశమనం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. స్టీల్ బ్రిడ్జి నిర్మాణంతోపాటు ఎస్ఎన్‌డీపీ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పలు మౌలిక సదుపాయాల కార్యక్రమాలను మంత్రి కేటీఆర్ పరిశీలించారు. హుస్సేన్‌సాగర్ సర్‌ప్లస్ నాలాలో చేపడుతున్న పనులను సమీక్షించారు.

అశోక్‌నగర్ వద్ద కొనసాగుతున్న రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఇప్పటికే ఎస్ఎన్‌డీపీ కార్యక్రమంలో భాగంగా వరద ముంపు ఉన్న ప్రాంతాలను గుర్తించి, వరద ప్రమాదాన్ని తగ్గించే విధంగా అనేక కార్యక్రమాలను చేపట్టినట్లు కేటీఆర్ తెలిపారు. హుస్సేన్ సాగర్ వరద నీటి ద్వారా లోతట్టు ప్రాంతాల ప్రజలకు భవిష్యత్తులో ముంపు ఇబ్బందులు రాకుండా ఉండేందుకు హుస్సేన్ సాగర్ సర్ప్లస్ నాలకు భారీ ఎత్తున నిధులు కేటాయించి రిటైనింగ్ వాల్ వంటి పనుల నిర్మాణం కొనసాగిస్తున్నట్లు తెలిపారు. వర్షాకాలం ప్రారంభం నాటికి ఈ పనులన్నీ పూర్తి అయ్యేలా స్థానిక ఎమ్మెల్యే, ఇతర ప్రజా ప్రతినిధుల సహకారంతో వేగంగా ముందుకు పోవాలని ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు.

షెడ్యూల్ ప్రకారమే బదిలీలు, పదోన్నతులు

- పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పింగిలి శ్రీపాల్ రెడ్డి



నవతెలంగాణ-సిటీబ్యూరో
బదిలీలు పదోన్నతుల షెడ్యూలు ప్రకారం తప్పకుండా జరుగుతాయని పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పింగిలి శ్రీపాల్ రెడ్డి తెలిపారు. ఆ సంఘం హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.తిరుపతి రెడ్డి అధ్వర్యంలో శనివారం సైదాబాద్ మండలంలోని వివిధ పాఠశాలల్లో ప్రచారం నిర్వహించి.. పీఆర్టీయూ టీఎస్ అభ్యర్థి గుర్రం చెన్నకేశవ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ చెప్పింది చేయడం పీఆర్టీయూ టీఎస్ సంఘం నైజ అని, సీపీఎస్ రద్దు కోసం ప్రభుత్వాన్ని ఒప్పించడంతో పాటు ఈ షెడ్యూల్లోనే పండిత పీఈటీల ఉన్నతీకరణ సైతం జరుగుతుందని తెలిపారు. ఏప్రిల్ ఒకటి నుంచి నూతన హెల్త్ స్కీమూ వర్తింపజేసేలా విధివిధానాలను ఖరారు చేస్తారని, ఉపాధ్యాయుల సమస్యలను పీఆర్టీయూ టీఎస్‌కు వదిలేయమని అన్ని సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా ముందు ఉంటామన్నారు. తమకు మరింత బలాన్ని చేకూర్చాలని గుర్రం చెన్నకేశవరెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటుతోనే గెలిపించాలని కోరారు. శ్రీపాల్ రెడ్డి ఇచ్చిన వివరణ సంతృప్తి చెందిన ఉపాధ్యాయ సోదర సోదరీమణులు పీఆర్టీయూ టీఎస్ వెంట ఉంటామని తమ సమస్యల పరిష్కారం సాధించగల నేత గుర్రం చెన్నకేశవరెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటుతో దిగ్విజయంగా గెలిచేలాగా ముందుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సైదాబాద్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మందడి వెంకట్ రెడ్డి, లక్ష్మీనారాయణ వి.ప్రశాంత్ రెడ్డి, సాంబశివరావు, సురేష్ కుమార్ దాసు, కె. వెంకటరెడ్డి, శ్రీనివాస్, వి.అశోక్, శ్రీనివాస్ రెడ్డి, నరసరాజు, రాజు, రాష్ట్ర, జిల్లా, మండల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

టెంకాయలకే పరిమితమవుతున్న బీజేపీ కార్పొరేటర్

- నిధులు ఉన్న అభివృద్ధి సున్నా

అభివృద్ధి చెయ్యలేని అసమర్ధ పాలకులు ఎందుకు?

- మాజీ కార్పొరేటర్ గంధం జోష్న నాగేశ్వరరావు



నవతెలంగాణ-ఉప్పల్
రామంతపూర్ డివిజన్‌లో అభివృద్ధి పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా తయారయ్యాయని రామంతపూర్ మాజీ కార్పొరేటర్ గంధం జోష్న అన్నారు. గత హయాంలో మంజూరైన నిధులను ఇప్పటివరకు పనులు ప్రారంభించడం నిరసిస్తూ శనివారం మాజీ కార్పొరేటర్ గంధం జోష్న ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కొబ్బరికాయలు కొడుతూ వినూత్న నిరసన చేపట్టారు. అనంతరం ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రామంతపూర్ రాజేంద్రనగర్‌లో ఎస్సీ సబ్ ప్లాన్‌లో భాగంగా 87 లక్షల రూపాయలతో కమిటీ హాల్ నిర్మించి అందులో బస్తి దావఖన ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని కోరారు.

నిధులు మంజూరైన అసమర్థ పాలకుల అలసత్వం వల్ల టెంకాయ కొట్టడం వరకే పరిమితం అయ్యారు. పదవీ కాలం చేపట్టి రెండు సంవత్సరాలు దాటిన ఇప్పటి వరకు కమిటీ హాల్ నిర్మాణం పూర్తి కాక పోవడము విడ్డూరంగా ఉంది అన్నారు. కాంగ్రెస్ నాయకులు హాథ్ సే హాథ్ జోడో పాదయాత్రలో రామాంతపూర్‌ని అభివృద్ధి చేసింది మేమే అని గొప్పలు చెప్పుకుంటూ జనాలకు నవ్వులు తెప్పిస్తున్నారని, వారు గతంలో కమిటీ హల్ నిర్మాణం చేపట్టి శిలాఫలకాలపైనా వారి పేరు పెట్టుకోవటం తప్ప, డ్రైనేజి గురించి కానీ, మంచినీటి పైపు లైన్ గురించి పట్టించుకోలేదని వాపోయారు ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మధుసూధన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కొప్పు నర్సింగ్ రావు, తుట్ నరసింహ,చంబు సాయి, ప్రశాంత్,అలె రమేష్,ముత్యాల మధు,సాగర్,బొసాని పవన్,చాంద్ పాషా,అనంద్,మల్లేష్,వెంకటేష్ పాల్గొన్నారు.

మహిళా దినోత్సవం నాడే కాకుండా ప్రతిరోజు గౌరవించాలి



నవతెలంగాణ-సిటీ బ్యూరో
మహిళలను మహిళా దినోత్సవం రోజే కాకుండా ప్రతిరోజు గౌరవించుకుంటే మంచిదని పేజ్ స్కూల్ ప్రిన్సిపాల్ కే .భారతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడవాళ్ళం గౌరవించడం కుటుంబం నుంచే మొదలు కావాలని తెలిపారు. మహిళలు కుటుంబ బాధ్యతలు నెరవేర్చడంలో వారిది కీలక పాత్రని తెలిపారు. పూర్వం రోజుల్లో పిల్లలకి మంచి, చెడు చెప్పడానికి ఉమ్మడి కుటుంబాలు తాత, నాయనమ్మ, బాబాయ్, పిన్ని, మామ, అత్త వంటి వారు ఉండడం వలన సమస్యలు వచ్చినా వారు చక్కదిద్దేవారు. ప్రస్తుత పరిస్థితిలో తల్లిదండ్రులు ఉద్యోగ నిర్వహణలో బిజీగా ఉండడం వలన పిల్లలు మంచి చెడు చెప్పడానికి వీలుకాక పిల్లలు పెడదారులు పడుతున్నారని అన్నారు. మహిళలను గౌరవించడం కుటుంబాన్నుంచే తల్లిదండ్రులు నేర్పించడం వల్ల అక్క, చెల్లినీ గౌరవించే సాంప్రదాయం మొదలైతే కుటుంబం బాగుంటుందని, ఇంటిలో స్త్రీ, పురుష భేదం లేకుండా సమాన విద్య అవకాశాలు కల్పిస్తే మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించగలరని తెలిపారు.

తల్లితండ్రులకు పూజ చేసిన విద్యార్థులు



నవతెలంగాణ-వనస్థలిపురం
వనస్థలిపురం డివిజన్ పరిధిలోని శ్రీ చైతన్య పాఠశాలలో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా ఫ్యామిలీ బ్లెస్ కార్యక్రమాన్ని యాజమాన్యం నిర్వహించారు. ఈ సందర్భంగా చైతన్య పాఠశాలలో కుటుంబ వాతావరణం నెలకొంది. విద్యార్థిని, విద్యార్థులు తల్లితండ్రుల ప్రాముఖ్యతను తెలియజేయడం కోసం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాఠశాల ఏజీఎం సతీష్, ప్రిన్సిపాల్ రాజలక్ష్మిలు పూర్వం తల్లితండ్రులకు పాద పూజ చేశారు. పెద్దపల్లిలో తల్లితండ్రుల పాదాలను కడిగి వారి పాదాలకు పూలతో పూజ చేసి వారి వద్ద నుండి ఆశీర్వాదం తీసుకున్నారు. ఆనాటి పూర్వ వైభవాన్ని మళ్లీ నేడు వనస్థలిపురం శ్రీ చైతన్య విద్యార్థుల చేత ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి చేయించారు. ఈ కార్యక్రమంలో నిర్వహించిన స్కూల్ యాజమాన్యాన్ని విద్యార్థుల తల్లితండ్రులు అభినందించారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఎగ్జిక్యూటివ్ డీన్ ప్రవీణ్, రీజనల్ ఇన్‌చార్జి వెంకటరెడ్డి, కోఆర్డినేటర్ రఘు వంశీ, డిన్ సుజన్, రాథోడ్, ఏజీ మల్లేష్, సి బ్రాంచ్ ఇన్చార్జి రఘుపతి, ప్రైమరీ ఇన్‌చార్జి ప్రసన్న, ప్రీ ప్రైమరీ ఇన్‌చార్జి దుర్గా, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో ఫుడ్ ఫెస్టివల్



నవతెలంగాణ-సిటీ బ్యూరో
నాగోల్‌లోని అజయ్ నగర్ కాలనీలో శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఫుడ్ ఫెస్టివల్ ఎంతో ఘనంగా నిర్వహించడం జరిగిందని కృష్ణవేణి స్కూల్ ప్రిన్సిపాల్ కె ప్రేమానంద చారి తెలిపారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కృష్ణవేణి స్కూల్ ప్రెసిడెంట్ పి . జైపాల్ రెడ్డి గారు మరియు అకాడమిక్ మేనేజర్ బాలాజీ గారు ఈ ఫుడ్ ఫెస్టివల్ ప్రారంభించి విద్యార్థులు ప్రదర్శించిన ఆహార పదార్థాలను తిలకించారని తెలిపారు

పి.జయపాల్ రెడ్డి గారు మాట్లాడుతూ విద్యార్థులు ఉద్దేశించి ఆహారపు అలవాట్లు మరియు మన సాంప్రదాయ ఆహార పదార్థాల విశిష్టతను వివరించారు సాంప్రదాయ ఆహార పదార్థాలు ఆరోగ్యానికి మేలు చేస్తాయని ప్రస్తుతం మారుతున్న ప్రపంచంలో వ్యక్తిగత పనుల్లో లీనమై సరైన ఆహారం తీసుకుంటలేరని. రెడీమేడ్ ఆహారం అలవాటు పడి తమ ఆరోగ్యాన్ని కాపాడుకోలేక పోతున్నారని దీనివలన అనారోగ్యం గురి అవుతున్నారని తెలిపారు ఫుడ్ ఫెస్టివల్ లో విద్యార్థులు ప్రదర్శించిన ఆహార పదార్థాలను ప్రత్యేక విద్యార్థి దగ్గరికి వెళ్లి అభినందించారు ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఉమాదేవి ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు

అరోరాలో ఘనంగా జాతీయస్థాయి స్పోర్ట్స్ మీట్

నవతెలంగాణ-బోడుప్పల్
పర్వతాపూర్‌లోని అరోరా టెక్నాలజికల్ అండ్ రీసెర్చ్ ఇనిస్ట్యూట్ కాలేజీలో స్టూడెంట్ ఆక్టివిటీ కమిటీ మరియు క్రీడా క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజులపాటు ,జాతీయస్థాయి స్పోర్ట్స్ మీట్ ఉత్కర్ష్ నీ ఘనంగా నిర్వహించారు, ఈ జాతీయ స్థాయి స్పోర్ట్స్ మీట్‌లో క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, టేబుల్ టెన్నిస్ మరియు క్యారమ్ పోటీలను నిర్వహించారు. పోటీలలో వివిధ ఇంజనీరింగ్ కళాశాలలు నుంచి వచ్చిన విద్యార్థులను పాల్గొన్నారు, ఈ సందర్భంగా పోటీలలో గెలుపొందిన క్రీడాకారులకు నగదు బహుమతులు, ప్రశంస పత్రాన్ని మరియు టోపీలు అందజేశారు , ఈ ముగింపు కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ శ్రీకాంత్ జట్ల మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో రాణించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ మీట్ కన్వీనర్ డాక్టర్ అజయ్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్ వేణుగోపాల్, అసిస్టెంట్ రిజిస్టర్ బాలకృష్ణారెడ్డి, వివిధ విభాగాధిపతులు, సాక్ కోఆర్డినేటర్ శ్రవణ్ కుమార్ రెడ్డి, క్రీడా క్లబ్ విద్యార్థులు మరియు సాక్ విద్యార్థులు పాల్గొన్నారు.



వీఎం హోం వాకర్స్ సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



నవతెలంగాణ - సరూర్‌నగర్
సరూర్‌నగర్ వీ.ఎం.హోమ్ వాకర్స్ అసోసియేషన్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాను అని ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అన్నారు. శుక్రవారం గడ్డిఅన్నారం డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జక్కుల శ్రీశైలం యాదవ్ ఆధ్వర్యంలో సుధీర్‌రెడ్డిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ సరూర్ నగర్ వి.ఎం హోంలో ఆరోగ్యరీత్యా వచ్చే వాకర్స్ అందరూ నామీద ఉన్న అభిమానంతో నన్ను సన్మానించడం ఎప్పటికీ మర్చిపోలేనని, అందరికీ ఏ చిన్న పని ఉన్నా తన వద్దకు వస్తే తప్పకుండా న్యాయం చేస్తానని అని అన్నారు. ఈ కార్యక్రమంలో వీఎం హోం వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బేర బాలకిషన్, బబ్బూరి ఆనంద్ కుమార్, పీవీటీ మార్కెట్ వ్యాపారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు కైరం కొండ ధనంజయనేత, కొండ గిరి గౌడ్, ఐలయ్య యాదవ్, దుబ్బాక శశిధర్ రెడ్డి,కబీర్దాస్ గౌడ్,మేకల వెంకటేశ్వర్ రెడ్డి.రావికేశవ నాయుడు,వేణుగోపాల్ గౌడ్,డాక్టర్ సోమన్న, వాకర్స్ పాల్గొన్నారు.

జంతువుల సంరక్షణ కేంద్రాన్ని సందర్శించిన జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్



నవతెలంగాణ-నాగోల్
నాగోల్ డివిజన్లోని పతుల్లగూడలో గల జంతువుల సంరక్షణ కేంద్రాన్ని శనివారం జీహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నరసింహారెడ్డి సందర్శించి అక్కడి పనితీరును పరిశీలించారు. గ్రేటర్ పరిధిలోని కుక్కల దాడుల సంఘటనల నేపథ్యంలో ఆయన నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణా సురేందర్ నాథ్ యాదవులతో కలిసి జంతువుల సంరక్షణ కేంద్రంలోని వెటర్నరి శాఖ పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీధి కుక్కలకు పిల్లల నియంత్రణ ఆపరేషన్ చేసే గదులను పరిశీలించి రోజుకు ఎన్ని ఆపరేషన్లు జరుగుతున్నాయని వాటి విధి విధానాలను అడగగా దానికి అనిమల్ ఫర్ పీపుల్స్ ప్రైవేట్ సంస్థ మరియు జిహెచ్ఎంసి వెటర్నరీ శాఖ పర్యవేక్షణలో ఆపరేషన్లు, సంరక్షణ ప్రక్రియ కొనసాగుతుందని అక్కడ సిబ్బంది తెలిపారు. అదేవిధంగా అందుబాటులో ఉన్న చనిపోయిన జంతువులకు సంబంధించి క్రిమియేషన్ కేంద్రం పనితీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హయత్ నగర్ సర్కిల్ వెటర్నరీ డాక్టర్ యాదగిరి యు సి డి బలరాం బిజెపి నాయకులు సురేందర్ నాథ్ యాదవ్, శ్రీధర్ గౌడ్ లతోపాటు పాల్గొన్నారు

ఆలయాల అభివృద్ధికి కృషి

మంత్రి సత్యవతి రాథోడ్

నవతెలంగాణ-ఉప్పల్
ఆలయాల అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. శనివారం ఎన్జీఆర్ఐ జీఈ క్యాపిటల్ వద్ద గల అభయ ఆంజనేయ స్వామి దేవాలయంలో తెలంగాణ రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అభయ ఆంజనేయ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆలయాలలో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత మరియు దేవాలయ పూజారులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ కమిషనర్ భారతి హోలికెరి, సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్ దీపికా రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, చైర్మెన్ లక్ష్మీనారాయణ, కొక్కొండ జగన్, బింగి శ్రీనివాస్, కొల్లూరి శ్యామ్, ఈవో భాగ్యలక్ష్మి, శ్రీకాంత్, పూజారులు రవి తదితరులు పాల్గొన్నారు.




వీధి కుక్కల పట్ల చిన్నారులు అప్రమత్తంగా ఉండాలి

కార్పొరేటర్ దడిగ శంకర్



నవతెలంగాణ-బడంగ్‌పేట్
నేటి సమాజంలో చిన్నారులు అప్రమత్తంగా ఉండాలని కార్పొరేటర్ దడిగ శంకర్ అన్నారు. శనివారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న గుర్రంగూడ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వీధి కుక్కల నుండి రక్షణ కొరకు కార్పొరేటర్ దడిగ శంకర్, సానిటేషన్ ఇన్స్‌పెక్టర్ వి.యాదగిరితో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కుక్కలను రాళ్లతో, కట్టెలతో కొట్టకూడదని, స్కూల్ నుండి వచ్చేటప్పుడు, పోయేటప్పుడు ఒంటరిగా కాకుండా గుంపులుగా కలిసి వెళ్లాలని, కుక్కలు మనల్ని వెంబడించినప్పుడు పరిగెత్తడం లాంటిది చేయకూడదన్నారు. ఇంటి దగ్గర ఉన్నప్పుడు షాప్ వెళ్లాల్సి వస్తే ఇంట్లోని పెద్దవారిని మాత్రమే వెళ్లమనాలని అదేవిధంగా కార్పొరేషన్ అధికారులను కుక్కలకు పట్టుకొని వెళ్లి వాటికి ఆంటీ రాబిస్ వ్యాక్సినేషన్, అంటీ బర్త్ కంట్రోల్ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పారిశుద్ధ్య సిబ్బంది తదతరులు పాల్గొన్నారు.



నాగోల్‌లో... నాగోల్ డివిజన్లో మన్సురాబాద్‌లో గల ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు శనివారం వీధి కుక్కలపై అప్రమత్తతో పాటు పలు అంశాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ తగిన సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బందీలో ఉన్న కుక్కల వద్దకు వెళ్ళవద్దని, ఒక వేళ దాడి జరిగితే నిశ్చలంగా నిలబడి చేతులు శరీరానికి దగ్గరగా ఉంచుకోవాలని ఆమె తెలిపారు. కుక్కలు వేసవిలో ఆగ్రహంతో ఉంటాయని, దీంతో దాడి చేసే అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. కుక్క అరుస్తూ మీ దగ్గరికి వచ్చినప్పుడు వేగంగా నడవడం మానుకొని ఎప్పటికీ వెనకకు తిరిగకూడదని, పరిగెత్తకూడదని పేర్కొన్నారు. కుక్క దాడి జరిగినప్పుడు బంతిలా ముడుచుకొని ముఖం మరియు తల వెనుక వైపు చేతులు కప్పడం ద్వారా తీవ్రమైన గాయాల నుండి తప్పించుకోవచ్చని అన్నారు. కుక్క కాటుకు గురైనట్లయితే గాయాన్ని పది నిమిషాల పాటు ప్రవహించే నీటిలో ఒత్తిడిని ఉపయోగించి కడగాలి వెంటనే వైద్య సహాయం తీసుకొని యాంటీ రేబిస్ వాక్సినేషన్ వేయించుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ మారుతి దివాకర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సంతోష్ నగర్‌లో : సైదాబాద్ డివిజన్ పరిధిలోని సంకేశ్వరం బజార్ ప్రభుత్వ పాఠశాల డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపూర్ అరుణ రవీందర్ రెడ్డి, డీసీ జయంత్, వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ అశోక్, డాక్టర్ రామచంద్ర రెడ్డి, పాఠశాల హెడ్మాస్టర్ రేణుక, ఉపాధ్యాయులు విద్యార్థి సిబ్బంది ఆధ్వర్యంలో బస్తీలలో ర్యాలీ నిర్వహిస్తూ, వీధికుక్కల జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కుక్కకాటు నుంచి ఎలా రక్షించుకోవాలో విద్యార్థులకు వివరించారు. కుక్కలకు బహిరంగ ప్రదేశాల్లో ఆహారం వేయవద్దని తెలిపారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కార్పొరేటర్ కొత్త కాపు అరుణ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. వీధి కుక్కల విషయంలో జీహెచ్ఎంసీ నిబంధనలు అందరూ పాటించాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక నాయకులు సిబ్బంది పార్టీ శ్రేణులు విద్యార్థులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు పర్మినెంట్ చేయాలి

సీఐటీయూ డిమాండ్

నవతెలంగాణ - మీర్‌పేట్
ఎన్నో ఎళ్లుగా పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను పర్మనెంట్ చేయాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు రుద్ర కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మీర్‌పేట్ మున్సిపల్ కార్పోరేషన్ పారిశుద్ధ్య కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా సంవత్సరాల నుండి పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేసి కనీస వేతనాలు 26వేలు ఇవ్వాల న్నారు. ప్రతి కార్మికుని ఇన్సూరెన్స్ చేయించాలని, డ్రెస్సులు కుట్టడానికి ఇస్తున్న డబ్బులను పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా యాదగిరి, కార్యదర్శిగా నర్సింహ, కోశాధికారిగా భారతమ్మ, కమిటీ సభ్యులుగా రవి, కమలమ్మ, జగన్, సత్తయ్య, నర్సింహ్మ, భారతమ్మ, అంజమ్మ లక్ష్మీ, ప్రభాకర్, వెంకటమ్మ నారమ్మ, శ్రీధర్, లలిత, భాస్కర్, రాజు, శివప్ప తదితరులు ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట్ మున్సిపల్ కన్వీనర్ పెంటయ్య, దాసరి బాబు, ప్రజా సంఘాల నాయకులు యాదయ్య పాల్గొన్నారు.

పాడి కౌశిక్ రెడ్డికి బండారి లక్ష్మారెడ్డి అభినందనలు



నవతెలంగాణ-నాచారం

రాష్ట్ర శాసనమండలి ప్రభుత్వ విప్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డిని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బండారి లక్ష్మారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఫైర్ బ్రాండ్‌గా ముఖ్యమంత్రి కేసీఆర్‌కు నమ్మిన బంటు పాడి కౌశిక్ రెడ్డి గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించి, శాసనమండలి ప్రభుత్వ విప్‌గా పదవి బాధ్యతలు చేపట్టడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరెన్నో ఉన్నతమైన పదవులు అవరోధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సాయిజెన్ శేఖర్, సాయి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పనుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు



నవతెలంగాణ-మల్కాజిగిరి

పనుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని గౌతమ్ నగర్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ అన్నారు. శనివారం గౌతమ్ నగర్ పరిధిలోని వాణినగర్‌లో రూ.20 లక్షలతో చేపట్టనున్న కమ్యూనిటీ హాల్ పనులను కార్పొరేటర్ ఏఈ దివ్య జ్యోతితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కమ్యూనిటీ హాల్ పనులు పూర్తి అయ్యాయనీ, త్వరలోనే ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుతో కలిసి ప్రారంభించనున్నట్టు తెలిపారు. డివిజన్‌లో పెండింగ్ ఉన్న పనులను ఎమ్మెల్యే సహకారంతో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మేకల రాము యాదవ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలి

- ఎన్నికల కేంద్రాల వద్ద అన్ని రకాల మౌలిక వసతులు ఏర్పాటు చేయాలి
- ఈనెల 12న ఉదయం 8 గంటల నుంచి బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామాగ్రి పంపిణీ
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను జిల్లా వ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో ఎలాంటి ఇబ్బందుల్లేకుండా నిర్వహించాలనీ, ఈ విషయంలో సంబంధిత శాఖల అధికారులు ఇప్పటి నుంచే అవసరమైన చర్యలు తీసుకోవాలనీ, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి, డీసీపీ జానకీ, జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్, ఆర్డీవోలు రవి, మల్లయ్య, సెక్టోరియల్ అధికారులు, నోడల్ అధికారులు, ఏసీపీలుతో ముందస్తు ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 13వ తేదీన జరిగే ఎన్నికలకు జిల్లా వ్యాప్తంగా 14 పోలింగ్ కేంద్రాలు, పది లొకేషన్లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఒక రోజు ముందుగానే ఈనెల 12న ఉదయం 8 గంటల నుంచి జిల్లా కలెక్టరేట్లోని స్ట్రాంగ్ రూమ్ నుంచి ఎన్నికల అధికారులు, సిబ్బందికి బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లతో పాటు ఎన్నికల సామాగ్రిని అందజేస్తామని చెప్పారు. జిల్లాలో 14 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి వెబ్కాస్టింగ్ ద్వారా ఎన్నికలు నిర్వహిస్తున్నామన్నారు. పోలింగ్ జరుగుతున్న తీరు ఎప్పటికప్పుడు తెలుస్తోందన్నారు. ఓటింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించాలనీ, జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్తు సౌకర్యం కల్పించడంతోపాటు లైటింగ్, ఓటర్లకు ఇబ్బంది లేకుండా టెంట్ వేసి తాగునీటి వసతి తదితర మౌళిక సదుపాయాలు కల్పించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఇప్పటికీ ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే వాటిని పరిష్కరించి పోలింగ్ రోజున ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల సామాగ్రి సమీకరణలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. బ్యాలెట్ బాక్సులు, బ్యాలట్ పేపర్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ఏర్పాటు నుంచి పోలింగ్ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్సులు రిసెప్షన్ కేంద్రానికి చేరే వరకు పూర్తి బాధ్యత వహించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 14 పోలింగ్ కేంద్రాలు, 10 లొకేషన్లు, వెబ్కాస్టింగ్ ఏర్పాటు చేయడంతో పాటు 144 సెక్షన్ అమలులో ఉంటుందని కలెక్టర్ వివరించారు. ఎన్నికలు ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్సులను సరూర్‌నగర్‌లోని స్టేడియంకు తరలించి అక్కడ భద్రపర్చనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి, డీసీపీ జానకీ, జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్, ఆర్డీవోలు రవి, మల్లయ్య, సెక్టోరియల్ అధికారులు, నోడల్ అధికారులు, ఏసీపీలు, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పికెట్ నాలాపై వంతెన నిర్మాణం వేగవంతం చేయండి



నవతెలంగాణ-బేగంపేట్

పికెట్ నాలాపై వంతెన నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి ఏప్రిల్ చివరి నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. శనివారం మినిస్టర్ రోడ్డులో గల పికెట్ నాలాపై చేపట్టిన వంతెన నిర్మాణ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బందిని మరింతగా పెంచి పనులు వేగంగా జరిగే విధంగా పర్యవేక్షణ జరపాలని చెప్పారు. ప్రతి ఏడాదీ వర్షాకాలంలో నాలాకు ఎగువ నుంచి వచ్చే నీరు సక్రమంగా వెళ్ళకపోవడం వల్ల పరిసర కాలనీలు ముంపునకు గురై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. నగరంలో ఉన్న అనేక నాలాల పరిధిలో ఇలాంటి పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు. వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ చొరవతో పూర్తి స్థాయిలో నాలాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించి సమగ్ర నాలా అభివృద్ధి కార్యక్రమం చేపట్టినట్టు వివరించారు. అందులో భాగంగా కరాచీ బేకరీ వద్ద కూడా పికెట్ నాలాపై రూ.10 కోట్లతో నాలాలోని నీరు ఎలాంటి ఆటంకాలు లేకుండా వెళ్ళిపోయే విధంగా నూతనంగా వంతెనను నిర్మించిన విషయాన్ని గుర్తు చేశారు. మినిస్టర్ రోడ్డులో కూడా ఉన్న వంతెన శిథిలావస్థకు చేరడం, నీటి సరఫరా సక్రమంగా జరగక ముంపు సమస్య ఏర్పడుతుందని చెప్పారు. సమస్య పరిష్కారం కోసం పాత వంతెనను తొలగించి గతంలో ఉన్న దానికంటే ఎత్తులో వాహనాల రాలపోకలు సులువులుగా సాగేలా వెడల్పుగా నిర్మిస్తున్నట్టు చెప్పారు. వంతెన నిర్మాణంతో అన్నానగర్, రసూల్‌పురా బస్తీ, ఇక్రిశాట్ తదితర అనేక కాలనీలకు ముంపు సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుందని చెప్పారు. బేగంపేట నాలా పనులు కూడా ముమ్మరంగా సాగుతున్నాయని పేర్కొన్నారు. నాలా వెంట ఉన్న కాలనీల్లో డ్రయినేజీ, వాటర్ పైప్ లైన్ పనులు పూర్తయ్యాయనీ, రోడ్డు నిర్మాణం పనులు కూడా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారు లను ఆదేశించారు. ఏండ్ల క్రితం నిర్మించిన నాలాల నిర్వహణను గత ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం, ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు కూడా వరద ముంపు సమస్యకు ఒక కారణంగా పేర్కొన్నారు. నాలాల వెంట ఉన్న ప్రజలు పడుతున్న ఇబ్బందులను పరిష్కరించిన ఘనత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుందని తెలిపారు. మంత్రి వెంట బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరి మాజీ కార్పొరేటర్ అత్తిలి అరుణ గౌడ్, జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, కిషన్, వాటర్ వర్క్స్ డైరెక్టర్ కృష్ణ, సుదర్శన్, వాటర్ వర్క్స్ రమణారెడ్డి, శానిటేషన్ శ్రీనివాస్, ఎలక్ట్రికల్ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

50 మందికి పైగా కిడ్నీ దాతలకు సన్మానం



నవతెలంగాణ-బేగంపేట్

ప్రజల్లో మూత్రపిండాల వ్యాధులపైన, మూత్రపిండాల ఆరోగ్యం పైన అవగాహన పెంపొందించడానికి ప్రతి ఏడాదీ మార్చిలో రెండో గురువారాన్ని ప్రపంచ కిడ్నీ దినోత్సవంగా పాటిస్తున్నారు. ఈ సందర్భంగా హైటెక్ సిటీలోని యశోద హాస్పిటల్స్ ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకుని కిడ్నీ దానం చేసిన 50 మందికి పైగా కిడ్నీ దాతలను సత్కరించుకోవడం సంతోషంగా ఉందని యశోద హాస్పిటల్స్, సీనియర్ నెఫ్రాలజిస్ట్ అండ్ కిడ్నీ ట్రాన్స్ ప్లాంట్ స్పెషలిస్ట్ డాక్టర్ రాజశేఖర చక్రవర్తి అన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ నెఫ్రాలజిస్ట్, పద్మభూషణ్ డాక్టర్.ఎం.కె.మణి మాట్లాడుతూ దేశంలో కిడ్నీ సంబంధిత వ్యాధిగ్రస్తుల సంఖ్య రోజురోజుకూ విపరీతంగా పెరిగిపోవడం ఆందోళనకరం అన్నారు. మన దేశ జనాభాలో 17శాతం మంది ప్రజలు మూత్రపిండాల సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారని తెలిపారు. ప్రతి ఏడాదీ కొత్తగా 5 లక్షల మంది డయాలసిస్ దశకు చేరుకుంటున్నారన్నారు. మనకు కిడ్నీలు అనే ఓ వ్యవస్థ ఉందనీ, అవి ఆరోగ్యంగా ఉంటేనే మనం బాగుంటామనీ, గుండె, కాలేయంతోపాటు కిడ్నీలు కూడా సమానంగా పని చేస్తాయని గ్రహించకపోవడమే ఇందుకు కారణమని డాక్టర్.ఎం.కె.మణి అభిప్రాయపడ్డారు. ఈ సమస్యను పరిష్కరించడానికి ఏకైక మార్గం ప్రజలకు కిడ్నీ వ్యాధులపై అవగహన కల్పించడం, కిడ్నీ వ్యాధులను నివారించడానికి కిడ్నీ సంభదిత అధిక ప్రమాదం ఉన్న వ్యక్తుల్లో క్రమం తప్పకుండా స్క్రీనింగ్ టెస్టులు చేయించుకోవడం ఉత్తమమనీ, ప్రముఖ నెఫ్రాలజిస్ట్, పద్మభూషణ్ డాక్టర్. ఎం.కె.మణి తెలిపారు. కేర్ ఫర్ యువర్ కిడ్నీ ఫౌండేషన్ వ్యవస్థాపక ధర్మకర్త, జాకబ్ వర్గీస్, ప్రముఖ నెఫ్రాలజిస్ట్, పద్మభూషణ్ డాక్టర్.ఎం.కె.మణి, డాక్టర్. రాజశేఖర చక్రవర్తి, డాక్టర్.పవన్ గోరుకంటి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసి కిడ్నీ దానం చేసిన కిడ్నీ దాతలను వారి కుటుంబాలను సత్కరించారు.

నిరుపేదలకు అండ న్యూ లైఫ్ ఫౌండేషన్



తెలంగాణ-నాచారం

నిరుపేదలకు అండ న్యూ లైఫ్ ఫౌండేషన్ అని వ్యవస్థాపకురాలు నసీమా బాను అన్నారు. నిరుపేదలకు, నిరాశ్రయులకు అండగా నిలుస్తున్నట్టు చెప్పారు. 2022 నుంచి ఆడపిల్లల పెండ్లిళ్లకు ఆర్థిక సహాయం, అనారోగ్య సమస్యలతో హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న నిరుపేదలకు అండగా ఆదుకుంటునందుకు హర్షం వ్యక్తం చేశారు. నాచారంలోని నిరుపేద కుటుంబానికి నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అందరి న్యూస్ యూట్యూబ్ ఛానెల్ ఫౌండర్, స్థానిక రిపోర్టర్ వేర్పుల మహేష్ పాల్గొని నిరుపేదలకి ఉచితంగా నిత్యావసర సరుకులు అందజేశారు. అనంతరం మహేష్ మాట్లాడుతూ న్యూ లైఫ్ ఫౌండేషన్ ద్వారా నసీమా భాను మాథర్ దేరిస్సా సేవా భావాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఎందరో అభాగ్యులకు అండగా నిలుస్తుందన్నారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులు చూపిన సేవా మార్గంను కొనసాగిస్తూ.తన సొంత డబ్బులతో అందరికి అండగా నిలుస్తున్న నసీమా బానుకు అండగా నిలిచి, తనకు తోచిన సహాయం ఎల్లప్పుడూ చేస్తామని మహేష్ హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో న్యూ లైఫ్ ఫౌండేషన్ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

విద్యా వాలంటీర్లకు జీతాలు అందజేత



నవతెలంగాణ-నాచారం

మల్లాపూర్ ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు వాలంటీర్లు, ఒక ఆయమ్మ జీతాలను బీఎల్ఆర్ ట్రస్ట్ చైర్మెన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి అందజేశారు. ప్రభుత్వ పాఠశాల్లో పని చేస్తున్న వాలంటీర్లు, ఆయమ్మకు 3 నెలలుగా వేతనాల్లేక ఇబ్బందులు పడుతున్నట్టు తెలుసుకున్న బండారి లక్ష్మారెడ్డి శనివారం పాఠశాలకు వెళ్లి రూ.78 వేలు నగదు వేతనంగా అందజేశారు. ఉప్పల్ నియోజకవర్గంలో ప్రజలకు ఏ సమస్య వచ్చినా నేనున్నానంటూ ముందుకు వచ్చి వారి సమస్యలను పరిష్కరించడంలో బీఎల్ఆర్ ట్రస్టు చేస్తున్న కృషిని ప్రజలు అభినందిస్తున్నారు. పేద విద్యార్థులకు చదువులకు చేయూత, ప్రమాద బారిన పడిన వారికి ఆర్థిక సహాయం, నిరుద్యోగులకు ఉచిత ఉద్యోగ శిక్షణ, నమ్ముకున్న కార్యకర్తలకు నేనున్నానంటూ భరోసానిస్తూ బీఎల్ఆర్ ట్రస్ట్ ఎందరో అభాగ్యులకు ఆసరాగా నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా మల్లాపూర్ ప్రభుత్వ పాఠశాల వాలంటీర్లు, ఆయమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు బీఎల్ఆర్ ట్రస్ట్ చైర్మన్ బండారి లక్ష్మారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, బీఎల్ఆర్ ట్రస్ట్ ప్రతినిధి కటార్ల భాస్కర్, యాదిరెడ్డి, సంతు యాదవ్, కాల్వల అంజి, లంబు శ్రీను, శశి, సాబీర్ అలీ, శ్రావణ్, వాసుదేవ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

అలెక్సా వార్షికోత్సవ ఆఫర్లు

నవతెలంగాణ - హైదరాబాద్

భారతదేశంలో అలెక్సాను విడుదల చేసి ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకోవడాన్ని అమెజాన్ వేడుక చేసుకుంటుంది. భారతదేశంలో లక్షలాది మంది వినియోగదారుల అవసరాలను గత కొన్ని సంవత్సరాలుగా ఈ ఏఐ తీర్చడంతో పాటుగా సంగీతం వినిపించడం, స్మార్ట్ హోమ్ అప్లయెన్సస్ నియంత్రించడం, సమచారం తెలపడం, అలారంను సెట్ చేయడం, రిమైండర్లను ఏర్పరచడం, బిల్లు చెల్లింపులు వంటి వాటికి నమ్మకమైన సహచరిగా ఉండటంతో పాటుగా వినోదం సహా మరెన్నో అంశాలలో తోడ్పడుతుంది. ఈ సంతోషాన్ని వేడుక చేయడంలో భాగంగా అమెజాన్ ఇప్పుడు భారీ రాయితీలు మరియు ప్రత్యేకమైన డీల్స్‌ను తమ అత్యుత్తమ విక్రయాలు జరుపుకుంటున్న ఎకో స్మార్ట్ స్పీకర్లు, ఫైర్ టీవీ ఉపకరణాలు సహా అలెక్సా ఉపకరణాలపై అందిస్తుంది. ఈ డీల్స్ 72 గంటల పాటు అందుబాటులో ఉంటాయి. మార్చి 02, 2023 ఉదయం 12 గంటల నుంచి 04 మార్చి 2023 రాత్రి 11.59 గంటల వరకూ ఇవి లభ్యమవుతాయి.

వీల్డింగ్ ఇన్‌ఫ్లుయెన్స్, నర్చరింగ్ ట్రస్ట్ నివేదికను ఆవిష్కరించిన ఏఎస్ సీఐ ఫ్యూచర్ బ్రాండ్స్

నవతెలంగాణ - హైదరాబాద్

అడ్వర్టైజింగ్ స్టాండర్డ్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, ఫ్యూచర్ బ్రాండ్ల భాగస్వామ్యంతో, ముంబైలో జరిగిన గెటిట్రైట్ ఏఎస్ సీఐ బ్రాండ్ ఇన్‌ఫ్లుయెన్సర్ సమ్మిట్ 2023 లో విల్డింగ్ ఇన్ఫ్లుయెన్స్, నర్చరింగ్ ట్రస్ట్ నివేదికను ఆవిష్కరించింది. ఈసందర్భంగా ఏఎస్ సీఐ సెక్రటరీ జనరల్ అండ్ సీఈఓ మనీషా కపూర్ మాట్లాడుతూ... వినియోగదారులను రక్షించడానికి మార్గదర్శకాలను అందించడంతో పాటు, ప్రకటనల పర్యావరణ వ్యవస్థ గెటిట్రైట్, ఈ అధ్యయనం, సమ్మిట్ ఆ దిశలో ఒక ముందడుగన్నారు. ఇన్ఫ్లుయెన్సర్లు అద్భుతమైన, విభిన్నమైన మనస్సులు గలవారు, ఇది ఉత్తేజకరమైన భిన్నమైన ప్రకటనల క్రొత్త సంస్కరణను అందిస్తుందన్నారు. వారి కంటెంట్ ఇంతకు ముందెన్నడూ చూడని విధంగా ప్రేక్షకులతో సంబంధాలకు దారితీసిందన్నారు. వినియోగదారుల ఆసక్తి ప్రధానంగా విశ్వాసం, ప్రామాణికత, పారదర్శకత సుస్థిరమైన క్రియేటర్ ఆర్థిక వ్యవస్థకు పునాదిగా ఉండటం చాలా ముఖ్యమన్నారు.

మహారాజశ్రీ గౌరవ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కొత్తగూడెం.
ఇ.ఎ. నెం. 204/2018 ఇన్
ఇ.పి నెం. 29/2013 ఇన్
ఒ.యస్. నెం. 184/2011

బిట్వీన్ :
దారా రామనరసింహం (died) Rep. by L.R.
దారా ధీరజ్, తండ్రి : రమేష్
...... పిటీషనర్ / డిక్రీ హోల్డర్
మరియు
గుడుమసు భరతమూర్తి మరియు ఇతరులు
....డిహెచ్ఆర్. ఓ.యస్. నెం. 75/2013

టు,
1) శ్రీమతి గుడుమసు భరతమూర్తి, తండ్రి : (లేటు) వెంకటనర్సయ్య, వయస్సు : 50 సం.లు, వృత్తి : వ్యాపారం, నివాసం : కొత్తగూడెం పట్టణం మరియు మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.
2) మెసర్స్ విష్ణుశ్రీ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్, రిప్ బై మేనేజింగ్ డైరెక్టర్ వి. వెంకటేశ్వర్లు, తండ్రి : పెద్ద మల్లయ్య, వయస్సు : 53 సం.లు, వృత్తి : వ్యాపారం, నివాసం : ఫ్లాట్ నెం. 207, దేవి గార్డెన్స్, స్ట్రీట్ నెం.8, హబ్సిగూడ, హైదరాబాద్.
...రెస్పాండెంట్/డిహెచ్ఆర్ ఓ.యస్. నెం. 75/2013

ఇ.ఎ. నోటీస్

డిక్రీ హోల్డర్‌పై ఇ.పి. లో .Retable Distribution గురించి రెస్పాండెంట్స్/ జడ్జిమెంట్ డెటర్ అయిన మీపై డిక్రీ హోల్డర్ వారికి రావలసిన నగదు మరియు రెస్పాండెంట్స్ / డిక్రీ హోల్డర్ అయిన రెస్పాండెంట్స్/ జడ్జిమెంట్ డెటర్ ఇ.పి. నెం. 86/2016 ఇన్ ఓ.యస్. నెం. 75/2013లో వచ్చిన నగదును పంచుటకై డిక్రీ హోల్డర్స్ మధ్యన అనగా ఓ.యస్. నెం. 184/2011 మరియు ఓ.యస్. నెం. 86/2016 మరియు ఓ.యస్. నెం. 75/2013 మధ్య పిటీషన్‌లో మీ హాజరు గురించి ది. 24.3.2023న ఉ.గం. 10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీరు ఏమైనా అభ్యంతరములు ఉంటే మీరు గాని మీ అడ్వకేట్ ద్వారా గాని తెలుపుకొగలరు. లేని యెడల మీ పరోక్షముగా తీర్పు జరుగును.
(శ్రీ కోర్టు వారి అనుమతితో//

కొత్తగూడెం.
ది.4.3.2023

ఇట్లు
రేపాక వెంకటరత్నం
అత్తలూరి మనోరమ,
న్యాయవాదులు, కొత్తగూడెం.
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.
సెల్ : 9849125619

IN THE COURT OF HON,BLE METROPOLITAN SESSION JUDGE CITY CRIMINAL COURTS, AT NAMPALLY, HYDERABAD
Criminal Revision NO 160 OF 2022

Between:
Begari Ananthaiah @ Anand ...Petitioner
AND
K. Narsing Rao 8s another ...**Respondents**

To,
K. Narsing Rao, S/o. Late K Ramulu, aged about: 47 years, Occa: Business,
R/o. H.No.2-2-185/20/1, Ramakrishna Nagar,
Amberpet, Hyderabad.
...Respondent No.1

Please take notice that the above named Petitioner filed the above Criminal Revision Petition Filed U/Sec.397 of Cr.P.C. against the respondents herein and the same is stand posted to 17-03-2023 for your appearance in the above case and shall appear at 10:30 a.m. before this Hon'ble Metropolitan Session Judge, City Criminal Courts at Nampally, Hyderabad, in person or by an Advocate, failing which the Hon'ble Court will proceed with the matter as per the law.

// **By Court Order/ /**
K. GOV HAN REDDY
(AP/567/86) Advocate
M. Durganandam,
M. Goverdhan,
B. Gangadhar Rao,
Advocates
R/o. H.No.1-6-430/1, Zamisthanpur, Musheerabad, Hyderabad-20
Cell No.8919568336

IN THE COURT OF THE HON'BLE PRL. JUNIOR CIVIL JUDGE, VIKARABAD DISTRICT AT VIKARABAD
I.A.NO 58 OF 2020
IN
O.S.No. 39 of 2020

Between:
Voggu Amruthamma ......Petitioner/Plaintiff
VS
Gorige Rukkamma and others ...Respondents/ Defendants

To,
D1. Gorige Rukkamma, W/o. late Ananthaiah, aged about 83 years, Occ: House hold, R/o. H.No. 3-1-25, Yennepally, Vikarabad, Vikarabad District
D4. G.Ramadevi, W/o.late Ananthaiah, Aged about 25 years, Occ: House hold,R/o. 3-1-25, Yennepally, Vikarabad, Vikarabad District.
D5. G.Mokal, S/o.late Ananthaiah, Aged 3years, minor under Guardianship of natural mother Ramadevi, W/o.Ananthaiah, Aged about 25 years, Occ: House hold,R/o. 3-1-25, Yennepally,Vikarabad, Vikarabad District.
D6. Malleswari, W/o. Mallesham, Aged about 30 years, Occ; Agricultural,R/o. Nagaram village, Dharur Mandal, Vikarabad District.

Please take notice that, the Plaintiff named herein above filed the above suit against you all for partition and separate possession and the notices/summons were sent on your addresses and the same was not delivered for various reasons as you are avoiding to take notices. The above suit stands posted to 20-03-2023 for your notice and appearance with written statement and counter if any.Therefore, please make it be convenient to present on 20-03-2023 before the Hon'ble Prl. Junior Civil Judge, at Vikarabad at 10.30 AM either personally or through an Advocate with your written statement and counter if any. Failing which please note that, the matter will be heard and decided in your absence as per material papers available on record. Hence, this notice.

(**By Order of the Court)**
M.Vittal Advocate
Flat No.102, Aditya Silicon Heights, Tellapur, R.C,.Puram Mandal, Sanga Reddy district-502032.
CELL 9848110808

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT: ANAKAPALLE
I.A.629/2022 in O.S.77/2016

Between :
Elcy Cleetus ...Petitioner/Plaintiff
And
Cherukuri Rama Prasad & others ...Respondents/Defendants

NOTICE

To,
Respondent No.3:
Cherukuri Lalitha,
W/o. Cherukuri Rama Prasad,
R/at Plot No.410, Road No.81,
Jubilee Hills, Hyderabad-500033,
Telangana State.

Take notice that the above I.A.629/2022 and suit O.S.77/2016 stood posted to **27-03-2023** for your appearance. During the course of issuance of notices through Court, you have evaded the receipt of the same, hence you are hereby required to appear either in person or through your duly appointed counsel on your behalf on **27-03-2023 at 10:30 A.M**. without fail, or else you will be set exparte and the matter will be decided in your absence.

(By Order of the Hon'ble Court)
SUNDARESWARAN VINOD KRISHNA
Advocate, Visakhapatnam.
Cell: 91826 30019

IN THE COURT OF HON.BLE VI ADDL. JUNIOR JUDGE, RANGA REDDY DISTRICT COURT , AT L.B.NAGAR
O.S.No. 140 of 2023

Between:-
Jagini Venkatesh and another ...**Plaintiff**
AND
The Tehasildar Saroornagar and others ....Defendants.

To
All Concerned
(Defendant No-2)

Whereas, Jagini Venkatesh and anotherhave Instituted the above suit for declaration to declare them as legal heirs and successors of late jagini Balamani,and the above case is posted to 17-03-2023 at about 10-30 Am, for filing any objections from any one for if no objectionwill recive from any one the matter will be decided on merits before the said Hon'ble Court.

// **By Order of the Hon'ble Court** //

K CHANDRA MOULY
ADVOCATE
Shop No 13, 1st Floor,
Vijayaraghava Chambers,
Hyderabad-50
Mobile: 8897834274

PUBLIC NOTICE

The General Public is hereby informed that our client M/s. Shriram Finance Limited, Himayathnagar Branch, Hyderabad is dealing with financing business. In the course of business, Smt. Shaik Reshma Begam, W/o. Shaik Mazurali, aged about 30years, Occupation: Housewife, R/o. H.No.4-48/1/1, Ravalkole Village, Medchal-Malkajgiri District, has approached our client for trade finance and accepted to deposit her title deeds in the respect of the property SCHEDUE OF PROPERTY:- All that the House bearing No.5-42/2, admeasuring an area of 240 square yards or its equivalent to 200.64 square meters, with a plinth area of 400 square feet with ACC Roof, within the limits of Gramkantam, Situated at Ravalkole Village and Grampanchayat, Medchal Mandal, Medchal-Malkajgiri District and bounded by:-North House of Gamapala Narsimha, South : Road, East : House of S.K. Munwar Ali, West : House of Farooq, as security for the loan availed by her. If any person or persons having any claim or interest in the above property may approach the undersigned within seven days from the date of this publication or else our client will proceed with the transaction.

M.VANAMA RAJU
ADVOCATE, HYDERABAD
Mobile No.9963874156

PUBLIC NOTICE
IN THE COURT OF THE HON'BLE ADDITIONAL SENIOR CIVIL JUDGE, R.R. DISTRICT AT; IBRAHIMPATAN
I.A No. 13 of 2023
IN
O.S. No. 2007 OF 2014

Between:
G.Varalaxmi @Laxmi .... Petitioner/Plaintiff
And
Koshika Kotaiah and others .... Respondents/ Defendants

TO
Koralla Krishna Reddy, S/o. K. Malla Reddy, Age 62 Years, Occ: Business, R/o. 301, Gayatri Nilayam, Gagan Mahal Road, Domalaguda, Hyderabad.

It is to bring to the notice to you of addressee no.5 of the above petition the petitioner/plaintiff was filed the above application i.e., I.A No. 13 of 2023 in OS No. 2007 of 2014 on the file of Hon'ble Addl Senior Civil Judge. RR District at Ibrahimpatan to set-aside the dismissal order dated 08-12-2022. The Hon'ble court was directed the petitioner to serve the notice upon you if you having any objections or claims over the said issue may appear before the above said court on 20.03.2023 at 10:30 AM either in person or through an Advocate, otherwise the matter will be decided as per law.

(BY ORDER OF THE COURT)
PONNAM RAVINDAR
ADVOCATE

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT: ANAKAPALLE
I.A.628/2022 in O.S.77/2016

Between :
Elcy Cleetus ...Petitioner/Plaintiff
And
Cherukuri Rama Prasad & others ...Respondents/Defendants

NOTICE

To,
Respondent No.3:
Cherukuri Lalitha,
W/o. Cherukuri Rama Prasad,
R/at Plot No.410, Road No.81,
Jubilee Hills, Hyderabad-500033,
Telangana State.

Take notice that the above I.A.628/2022 and suit O.S.77/2016 stood posted to **27-03-2023** for your appearance. During the course of issuance of notices through Court, you have evaded the receipt of the same, hence you are hereby required to appear either in person or through your duly appointed counsel on your behalf on **27-03-2023 at 10:30 A.M**. without fail, or else you will be set exparte and the matter will be decided in your absence.

(By Order of the Hon'ble Court)
SUNDARESWARAN VINOD KRISHNA
Advocate, Visakhapatnam.
Cell: 91826 30019

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT: ANAKAPALLE
I.A.627/2022 in O.S.77/2016

Between :
Elcy Cleetus ...Petitioner/Plaintiff
And
Cherukuri Rama Prasad & others ...Respondents/Defendants

NOTICE

To,
Respondent No.3:
Cherukuri Lalitha,
W/o. Cherukuri Rama Prasad,
R/at Plot No.410, Road No.81,
Jubilee Hills, Hyderabad-500033,
Telangana State.

Take notice that the above I.A.627/2022 and suit O.S.77/2016 stood posted to **27-03-2023** for your appearance. During the course of issuance of notices through Court, you have evaded the receipt of the same, hence you are hereby required to appear either in person or through your duly appointed counsel on your behalf on **27-03-2023 at 10:30 A.M**. without fail, or else you will be set exparte and the matter will be decided in your absence.

(By Order of the Hon'ble Court)
SUNDARESWARAN VINOD KRISHNA
Advocate, Visakhapatnam.
Cell: 91826 30019

IN THE COURT OF THE HON'BLE II. ADDL. DISTRICT JUDGE AT VIJAYAWADA
EP No. 56/2019 in OS No. 848/2014

Between:
Suramalla Prashanth Kumar .... DHR
and
M/s. Nestham Life sciences and 2- others. .... JDRS.

1st JDR: M/s. Nestham Life Sciences, Regd. firm. D.No.5-5-35/15A/NR, Plot. No. 65, Prashanthi Nagar, IDA, Kukatpally, Hyderabad.
2nd JDR: K.Siva Koti Ram, S/o. Late. Krishna Murthy, Managing Partner, R/o. 27-B-G-1, Sumathi Apartments, Plot No. 844, JayaPrakash Nagar, Near Engineers Colony Park, Yellareddy guda, Hyderabad - 500073.
3rd JDR: Chanumolu Narasimha Rao, S/o. Guravaiah, Partner of the firm, R/o. Flat No.502, Rishi Kalyana Residency, Nizampet, Kukatpally, Hyderabad-500072.

పై నెంబరు EP ని JDRs 1 to 3 లపై డిక్రీ బాకీని ఖర్చులతో రాబట్టుకొనుటకు దాఖలు చేయగా అందుపై EPలో JDRs 1 to 3లకు U/Order-21, Rule-22 ప్రకారము నోటీసుల నిమిత్తం ది.28-03-2023నకు శ్రీ కోర్టువారు వాయిదాగా వేసి వున్నారు. కావున ఆ రోజు ఉదయం గం.10.30 ని.లకు JDRs 1 to 3 స్వయంగా కానీ, అడ్వకేట్ గారి ద్వారా కానీ పై కోర్టులో హాజరై ఆక్షేపణలు ఉన్న తెలుపుకోవలెను. లేని యెడల పరోక్షమున తీర్మానించబడును.
వాయిదా తేది: 28-03-2023

/// BY COURT ORDER ///

బోసు జయమ్మ
DHR తరపు అడ్వకేట్, విజయవాడ

మహారాజా శ్రీయుత గౌరవనీయులైన అదనపు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు, ఖమ్మం నందు
ఓ.యస్ నెం : 540/2014

బిట్వీన్
బైరు మల్లేశ్వరి .... వాది
మరియు
బండి వెంకటేశ్వర్లు(డైడు)మరియు ఇతరులు ..... ప్రతివాది

అంతటి గాయత్రి భర్త: వీరేష్, వయస్సు :- 32, వృత్తి : గృహిణి, నేలకొండపల్లి, గ్రామం, మండలం, ఖమ్మం జిల్లా.
దాసగాని నాగశ్రీ భర్త:వీరబాబు, వయస్సు: 30సం, వృత్తి: గృహిణి, నేలకొండపల్లి గ్రామం, మండలం,ఖమ్మం జిల్లా.

పై నెంబర్ గల దావా నందు మీరు ప్రతివాది గా వుండి వున్నారు. ఇట్టి దావా మీ హాజరు నిమిత్తం ది.21/03/2023 న పై కోర్టు నందు వాయిదా ఉండి వున్నది. కావున ఆ రోజు అనగా ది.21.03.2023న ఉ॥గం॥10:30 ని॥లకు మీరు స్వయంగా కానీ, లేదా మీ తరుపు న్యాయవాది గారి ద్వారా గాని పై కోర్టు నందు హాజరై అభ్యంతరములు తెలుపవలయును లేనియెడల మీ పరోక్షంలో కేసు నిర్ణయించబడును.
(కోర్ట్ వారి అనుమతితో).....

ఇట్లు,
ఏడుసూతల శ్రీనివాసరావు
వై. అనురాధ
న్యాయవాదులు, ఖమ్మం పట్టణం.
సెల్ : 9849039167.

IN THE COURT OF THE HON'BLE II. ADDL. DISTRICT JUDGE AT VIJAYAWADA
EP No. 57/2019 in OS No. 879/2014

Between:
Purnachander Ragi .... DHR
and
M/s. Nestham Life sciences and 2- others. .... JDRS.

1st JDR: M/s. Nestham Life Sciences, Regd. firm. D.No.5-5-35/15A/NR, Plot. No. 65, Prashanthi Nagar, IDA, Kukatpally, Hyderabad.
2nd JDR: K.Siva Koti Ram, S/o. Late. Krishna Murthy, Managing Partner, R/o. 27-B-G-1, Sumathi Apartments, Plot No. 844, JayaPrakash Nagar, Near Engineers Colony Park, Yellareddy guda, Hyderabad - 500073.
3rd JDR: Chanumolu Narasimha Rao, S/o. Guravaiah, Partner of the firm, R/o. Flat No.502, Rishi Kalyana Residency, Nizampet, Kukatpally, Hyderabad-500072.

పై నెంబరు EP ని JDRs 1 to 3 లపై డిక్రీ బాకీని ఖర్చులతో రాబట్టుకొనుటకు దాఖలు చేయగా అందుపై EPలో JDRs 1 to 3లకు U/Order-21, Rule-22 CPC ప్రకారము నోటీసుల నిమిత్తం **ది.28-03-2023**నకు శ్రీ కోర్టువారు వాయిదాగా వేసి వున్నారు. కావున ఆ రోజు ఉదయం గం.10.30 ని.లకు JDRs 1 to 3 స్వయంగా కానీ, అడ్వకేట్ గారి ద్వారా కానీ పై కోర్టులో హాజరై ఆక్షేపణలు ఉన్న తెలుపుకోవలెను. లేని యెడల పరోక్షమున తీర్మానించబడును.
వాయిదా తేది: 28-03-2023

/// BY COURT ORDER ///

బోసు జయమ్మ
DHR తరపు అడ్వకేట్, విజయవాడ

IN THE COURT OF THE HON'BLE II. ADDL. DISTRICT JUDGE AT VIJAYAWADA
EP No. 58/2019 in OS No. 880/2014

Between:
Ch. Mithun Kumar .... DHR
and
M/s. Nestham Life sciences and 2- others. .... JDRS.

1st JDR: M/s. Nestham Life Sciences, Regd. firm. D.No.5-5-35/15A/NR, Plot. No. 65, Prashanthi Nagar, IDA, Kukatpally, Hyderabad.
2nd JDR: K.Siva Koti Ram, S/o. Late. Krishna Murthy, Managing Partner, R/o. 27-B-G-1, Sumathi Apartments, Plot No. 844, JayaPrakash Nagar, Near Engineers Colony Park, Yellareddy guda, Hyderabad - 500073.
3rd JDR: Chanumolu Narasimha Rao, S/o. Guravaiah, Partner of the firm, R/o. Flat No.502, Rishi Kalyana Residency, Nizampet, Kukatpally, Hyderabad-500072.

పై నెంబరు EP ని JDRs 1 to 3 లపై డిక్రీ బాకీని ఖర్చులతో రాబట్టుకొనుటకు దాఖలు చేయగా అందుపై EPలో JDRs 1 to 3లకు U/Order-21, Rule-22 CPC ప్రకారము నోటీసుల నిమిత్తం **ది.28-03-2023**నకు శ్రీ కోర్టువారు వాయిదాగా వేసి వున్నారు. కావున ఆ రోజు ఉదయం గం.10.30 ని.లకు JDRs 1 to 3 స్వయంగా కానీ, అడ్వకేట్ గారి ద్వారా కానీ పై కోర్టులో హాజరై ఆక్షేపణలు ఉన్న తెలుపుకోవలెను. లేని యెడల పరోక్షమున తీర్మానించబడును.
వాయిదా తేది: 28-03-2023

/// BY COURT ORDER ///

బోసు జయమ్మ
DHR తరపు అడ్వకేట్, విజయవాడ

పెంచిన సిలిండర్ ధరలను తగ్గించాలి



నవతెలంగాణ-అంబర్‌పేట

కేంద్రం పెంచిన వంట గ్యాస్ సిలిండర్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ(ఎం) అంబర్‌పేట జోన్ కమిటీ ఆధ్వర్యంలో తిలక్ నగర్ చౌరస్తాలో మహిళలతో కట్టెలమోపు ఎత్తుకుని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ నగర కార్యవర్గ సభ్యులు ఎం.మహేందర్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సామాన్య ప్రజలపై అనేక భారాలు మోపుతుందన్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో ఎలక్షన్లు పూర్తవగానే వంటగ్యాస్ సిలిండర్ ధరలు అమాంతం పెంచేసి రూ.1,155 వరకు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట జోన్ నాయకులు జి.రాములు, బి.సుబ్బారావు, ఎల్.సోమయ్య, డిఎల్ మోహన్, వరలక్ష్మి నాగమ్మ, పర్వతాలు, మంగమ్మ, డి.బీరమ్మ రాజు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



నవతెలంగాణ-అంబర్‌పేట

అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్ అన్నారు. అంబర్‌పేట డివిజన్ ఆకాష్ నగర్‌లో నూతన సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అవసరం ఉన్న చోట నూతన సీసీ రోడ్డు పనులు పనులు చేపట్టినట్టు తెలిపారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. స్థానిక బస్తీ ప్రజలకు ఇబ్బంది కలగకుండా త్వరితగతిన పనులను పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బస్తీ ప్రజలు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, డివిజన్ ప్రధాన కార్యదర్శి జాఫర్, అతిక్, రఫిక్, హైమద్, సంతోష్ చారి, వర్క్ ఇన్‌స్పెక్టర్ దుర్గ, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ కాలేజీలను నిషేధించాలి

- కాలేజీ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలి
- కార్పొరేట్ కాలేజీలను నిషేధించాలి
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య



నవతెలంగాణ-అడిక్‌మెట్

విద్యార్థులను పీల్చి పిప్పి చేస్తూ ఆత్మహత్యలకు దోహదం చేస్తున్న కార్పొరేట్ కాలేజీలను నిషేధించి బీసీ కాలేజ్ హాస్టల్స్‌కు సొంత భవనాలు నిర్మించాలనీ, విద్యార్థులు పూర్తి ఫీజులు స్కీం పునరుద్ధరించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. శనివారం బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల రామకృష్ణ అధ్యక్షతన విద్యానగర్ జూబ్లీ హాల్ కమ్యూనిటీలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్.కృష్ణయ్య హాజరై మాట్లాడారు. శ్రీ చైతన్య నారాయణ కాలేజీలు ఎక్కువ ఫీజులు లాగుతూ రాష్ట్ర ప్రజలను దోచుకుంటున్నాయన్నారు. బలవంతపు చదువులతో విద్యార్థులను వేధింపులకు పాల్పడుతూ ఆత్మహత్యలకు ప్రేరేపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కాలేజీల వల్ల విద్యా వ్యవస్థ భ్రష్ట పడుతుందనీ, వీటిని వెంటనే నిషేధించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 295 బీసీ కాలేజ్ హాస్టళ్లకు 321 బీసీ గురుకుల పాఠశాలలకు ఒక్క దానికి కూడా సొంత భవనాలు లేవనీ, కేటాయించిన ప్రభుత్వ స్థలాలను కూడా ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తున్నారన్నారు. దొరల కార్లు వెళ్లడానికి మాదాపూర్, కొండాపూర్, గచ్చిబౌలి, కోకాపేటలో ఫ్లైఓవర్లను రూ.వేల కోట్లు వెచ్చింది ఏర్పాటు చేస్తున్నారు కానీ చదువుకుని భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించే విద్యార్థులను అద్దె భవనాల్లో ఉంచుతూ వారికి ఏమాత్రం సౌకర్యాలు కల్పించకుండా వారి భవిష్యత్తును దెబ్బతీస్తున్నారన్నారు. మంత్రివర్గ ఉప సంఘం హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలు 25 శాతం పెంచాలని నిర్ణయం తీసుకుందనీ, నిత్యావసర ధరలు 100శాతం పెరిగితే 25శాతం పెంచడం ఏమైనా న్యాయమా అని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలేజీ హాస్టల్ విద్యార్థుల మిస్ చార్జీలను రూ.1500 నుంచి రూ.3 వేలకు హాస్టల్ విద్యార్థుల మెస్ రూ.950 నుంచి రూ.2వేలు విద్యార్థుల రెండేండ్ల ఫీజుల బకాయిలు రూ.3,500 కోట్లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ, నీల వెంకటేష్, సుధాకర్, రాజ్ కుమార్, అనంతయ్య, పగిళ్ల సతీష్, నందగోపాల్, మోదీ రాందేవ్, రాజేందర్ తిరుపతయ్య కట్ట హరీష్, మణికంఠ, అనిల్, నిఖిల్, భాస్కర్‌ప్రజాపతి పాల్గొన్నారు.

కోఠి ఈఎన్టీ ఆస్పత్రిలో ప్రపంచ వినికిడి దినోత్సవ వేడుకలు



- కం క్లియర్ శస్త్ర చికిత్స ద్వారా చిన్నారుల్లో కొత్త ఉత్సాహం
- ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

అప్పుడే పుట్టిన శిశువులకు నియోనేటల్ పరీక్ష ద్వారా వినికిడి సమస్యను తెలుసుకోవచ్చని కోఠి చెవి, ముక్కు, గొంతు హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ టి.శంకర్ అన్నారు. ప్రపంచ వినికిడి దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కోఠి ఈఎన్‌టీ హాస్పిటల్ ఆడిటోరియంలో కాంక్లియర్ ఇంప్లాంట్ శస్త్ర చికిత్స నిర్వహించుకున్న చిన్నారులతో నిర్వహించిన కార్యక్రమంలో ఈఎన్‌టీ వైద్యులు కేకును కట్ చేసి వరల్డ్ హియరింగ్ డే ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు వివిధ దేశభక్తుల వేషధారణలో సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం డాక్టర్ టీ.శంకర్ మాట్లాడుతూ చిన్ననాటి నుంచి వినికిడి సమస్య ఉన్న చిన్నారులకు 2009 నుంచి 500 పైగా కాం క్లియర్ ఇంప్లాంట్ శస్త్ర చికిత్సలు నిర్వహించామని తెలిపారు. శస్త్ర చికిత్సల అనంతరం స్పీచ్ థెరపీకి వచ్చే చిన్నారులకు ప్రపంచ వినికిడి దినోత్సవాన్ని నిర్వహించడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. ఎక్కువగా వినికిడి సమస్యలు మేనరికం వంశపారంలో ఉంటే మిగతా వారికి వస్తున్నాయని తెలిపారు. కం క్లియర్ వస్త్ర చికిత్స ద్వారా ఎంతో మందికి వినికిడి సమస్య దూరమైందని చెప్పారు 99శాతం చిన్నారులు వినికిడి సమస్యను జయించారని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆనంద్ ఆచారి, హైదరాబాద్ ఈఎన్‌టీ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ సుదర్శన్ రెడ్డి. కార్యదర్శి మౌనికా రెడ్డి, జయ మనీషా శోభన్ బాబు, తన్వీర్ సింగ్, డాక్టర్ వాణి కిరణ్, నాగరాజు, ఆడియాలజిస్ట్ డాక్టర్ కార్తీక వీణ, గ్రేసీ నర్సింగ్ సూపరింటెండెంట్ కస్తూరి, హెడ్ నర్స్ గౌరీ దేవి, టీచర్లు భాగ్య, శోభ, జానకి, సంధ్య. హరీష. తదితరులు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు.

శానిటరీ సమస్యలపై డిప్యూటీ మేయర్ సమీక్ష



నవతెలంగాణ-ఓయూ

జనావాస ప్రాంతాల్లో పరిశుభ్రతను పాటించేలా అన్ని చర్యలు తీసుకోవాలనీ, విధుల్లో సరైన సమయ పాలన పాటించాలని నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్ రెడ్డి అన్నారు. స్కూళ్ళు, కాలేజీలు, ఇతర జన సముదాయాల వద్ద ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలోని ఐదు డివిజన్ల శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్ల (ఎస్ఎఫ్ఏ)తో శనివారం తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంప్ కార్యాలయంలో టీటీయూసీ కార్మిక విభాగం అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. అటెండెన్స్ విషయంలో తప్పనిసరిగా జాగ్రతలు తీసుకోవాలనీ, బయోమెట్రిక్ ఖచ్చితంగా అమలు చేయాల్సిందే అన్నారు. సికింద్రాబాద్‌ను మోడల్ సర్కిల్‌లా తీర్చిదిద్దాలన్నారు. వివిధ కార్యక్రమాలకు సైతం తాము విధులు చేపట్టాల్సి వస్తోందనీ, అందువల్ల వేర్వేరు ప్రాంతాల్లో విధులకు వెళ్ళనప్పుడు అటెండెన్స్ (బయోమెట్రిక్) సమస్యలు వస్తున్నాయని ఎస్ఎఫ్ఏలు డిప్యూటీ మేయర్ దృష్టికి తీసుకెళ్లారు. ఫింగర్ ప్రింట్ వద్ద ఇబ్బందులు వచ్చినా మెమోలు జారీ చేస్తున్నారని వాపోయారు. పెట్రోల్ అలవెన్సులు, రాంకీ సిబ్బందితో సహకారం, పండుగ సెలవులు, సమ్మర్‌లో పని గంటల విషయాన్ని కూడా వివరించగా మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేందుకు కృషి చేస్తానని డిప్యూటీ మేయర్ పేర్కొన్నారు. బస్తీ ప్రాంతాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలనిఆమె సూచించారు.



10న తెలంగాణ బచావో సదస్సు

నవతెలంగాణ-ఓయూ

ఆర్ట్స్ కాలేజ్ దగ్గర ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్న తెలంగాణ బచావో సదస్సు పోస్టర్స్‌ను శనివారం విద్యార్థులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విజేఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాసంపల్లి అరుణ్ కుమార్ మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యమకారులను నిండా ముంచిందన్నారు. రాష్ట్ర ఖజానాను ఆగం చేశారన్నారు. అమర వీరుల కుటుంబాలకు న్యాయం చేయడం లేదన్నారు. ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి రాష్ట్ర ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నారన్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించకుండా నిరుద్యోగ భృతి అమలు చేయలేదనీ, రైతులకు రుణ మాఫీ చేయకుండా మోసం చేశారనీ, ప్రభుత్వ యూనివర్సిటీలను నిర్వీర్యం చేశారని చెప్పారు. విద్యార్థులకు ఫీజ్ రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం లేదనీ, కార్పొరేట్ విద్యను పెంచి పోషించారనీ, దళితులకు మూడెకరాలు ఇవ్వకుండా వాళ్ళ ఆత్మగౌరం దెబ్బ తీశారన్నారు. ఇంత మోసం చేస్తున్న కేసీఆర్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడం కోసం ఈ నెల10వ తేదీన నిర్వహించనున్న సదస్సుకు భారీగా ఉద్యమకారులు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ డప్పుగోపి, నగేష్, భాస్కర్, శ్యామ్, వెంకట్, శరత్ పాల్గొన్నారు.

'మూసీ ప్రక్షాళన-పరిష్కార మార్గాలు-భవిష్యత్ కర్తవ్యాలు'పై సదస్సు



నవతెలంగాణ-ఓయూ

మూసీ ప్రక్షాళన-పరిష్కార మార్గాలు-భవిష్యత్ కర్తవ్యాలు అనే అంశంపై శనివారం ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల మన్నూర్ హాల్‌లో మూసీ ప్రక్షాళన పోరాట సమితి ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి పాల్గొని మాట్లాడారు. వికారాబాద్ లోని అనంతగిరిలో పుట్టి వాడపల్లి వరకు 250 కిలోమీటర్లు ప్రవహిస్తున్న మూసీ నది పట్ల పాలకుల నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా మూసీ మాత్రం మురుగు నీటితో మురికి కుంటల మారి అనేక జీవ రాశులకు ముప్పుగా పరిణమించిందన్నారు. మూడు జిల్లాల ప్రజలను అనేక అనారోగ్యాలకు గురవుతూ ప్రాణాంతకంగా మారిందన్నారు. వ్యవసాయ పంటలకు ఈ నీటితో దిగుబడి తగ్గుతుందన్నారు. పశుపక్ష్యాదులు విషపు గాలుల వలలో చిక్కి అర్థాంతరంగా తనువు చాలిస్తున్నారు. స్వేచ్ఛ గాలులతో నగరం నడి మధ్యన నుంచి పారాల్సిన మూసీ కార్పొరేట్ల కుట్రలకు వాళ్ళ కంపెనీల వ్యర్థాలకు కూపంగా మారి తన సహజత్వాన్ని కోల్పోయిందన్నారు. సుందరంగా స్వచ్ఛమైన నీళ్ళతో సవ్వడి చేసిన నది పట్ల పాలకుల నిర్లక్ష్యానికి అనేక కారణాలు లేకపోలేదని వక్తలు అభిప్రాయ పడ్డారు. థేమ్స్ నదిలాగ భాగ్యనగరానికి కళ తేవాల్సిన ఈ నది ప్రక్షాళనకు - పరిష్కార మార్గాలు - భవిష్యత్ కర్తవ్యాలు నిర్ణయించే భాగంలో భాగంగా ఈ సదస్సుకు, పాదయాత్రకు ముందుకు వచ్చిన ఓయూ కంప్యూటర్ సైన్స్ సీనియర్ ప్రొపెసర్ వెంకట దాస్ అభినందించారు. పర్యావరణ రక్షణకు పాదం పాదం కలిపి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి కాలుష్యాన్ని నియంత్రించి మూసిని సుందరీకరించుకుందాం అని పిలుపునిచ్చారు. ప్రకృతి కవి జయరాజ్ రాసిన పాటలను, మూసి ప్రక్షాలనకు సంబంధించి చైతన్యం కల్పించడంలో భాగంగా రవికిరణ్ రూపొందించిన వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. డా.దుబ్బ రంజిత్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ప్రొఫెసర్ వెంకట దాస్, న్యూడెమొక్రసీ కార్యదర్శివర్గ సభ్యులు కె.గోవర్ధన్, పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు జి.ఝాన్సీ, ప్రకృతి కవి జయరాజ్, బానొత్ రమణా నాయక్, జర్నలిస్ట్ పాశం యాదగిరి, ప్రొఫెసర్ రాజారావు, ప్రొఫెసర్ సైదానాయక్, పిట్ల శ్రీశైలం, సామాజిక కార్యకర్త లుబ్నా సర్వత్, డా.ఈ. ఉపేందర్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు పి.మహేష్, ఉపాధ్యక్షులు గడ్డం శ్యామ్, శివారెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రవికిషోర్, రంగనాథ్, నాగేశ్వరరావు, శ్రీనయ్య, వెంకటేష్, మధు, పూర్ణ పాల్గొన్నారు.

భవిష్యత్ అవసరాలు తీర్చడంలో వాణిజ్యశాస్త్రం కృషి భేష్



నవతెలంగాణ-ఓయూ

ప్రపంచ వ్యాప్తంగా మారుతున్న కాలానికి అనుగుణంగా వాణిజ్య విద్యలో బహుళ విధానాలు అవసరమని ఉస్మానియా విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పప్పుల లక్ష్మీ నారాయణ అన్నారు. విద్యార్థుల భవిష్యత్ అవసరాలను తీర్చడంలో వాణిజ్య విభాగం చేస్తున్న కృషిని ఈ సందర్భంగా కొనియాడారు. వాస్తవిక దృక్పథంతో పాఠాలు బోధించేందుకు పరిశ్రమ నిపుణుల అవసరం ఉందనీ, ఫలితంగా సిద్ధాంత పరంగా అభ్యాసాల మధ్య అంతరం తగ్గించేందుకు ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్ అవసరం ఉందని రిజిస్ట్రార్ వివరించారు. ఈ దిశగా ఉస్మానియా విశ్వవిద్యాలయం నాయకత్వ పాత్ర పోషిస్తుందన్నారు. అసోసియేషన్ ఆఫ్ చార్టర్డ్ సర్టిఫైడ్ అకౌంటెంట్స్‌తో గురువారం ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ డిపార్ట్‌మెంట్ ఎంఓయూ కుదుర్చుకుంది. ఏసీసీఏ ప్రతినిధులు సాజిద్ ఖాన్, బి.శరవణ కుమార్, క్రిష్టోఫర్ దాస్, పవన్ కుమార్, ఓయూ ప్రతినిధులు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.లక్ష్మీనారాయణ, కామర్స్ ఫ్యాకల్టీ డీన్ ప్రొపెసర్ ఎం.గంగాధర్, విభాగాధిపతి ప్రొఫెసర్ డి.చెన్నప్ప, ప్రొ.వి.అప్పారావు ఇతర ఫ్యాకల్టీ సభ్యులు అవగాహనా ఒప్పందం కార్యక్రమంలో పాల్గొన్నారు. విశ్వవిద్యాలయాల నుంచి డిగ్రీలు పొందిన విద్యార్థులు ప్రొఫెషనల్‌గా మారటానికి ఏసీసీఏ అవసరమైన అత్యాధునిక నైపుణ్యాలను అందిస్తుందని భారత డైరెక్టర్ సాజిద్ ఖాన్ అన్నారు. ఉమ్మడి కోర్‌తో సిలబస్‌ను పొందుపరచడం, మూల్యాంకన విధానాలను మార్చడం, ఉపాధ్యాయులకు ఎఫ్‌డిపి ప్రోగ్రామ్‌లు నిర్వహించడం, విద్యార్థులను ఉపాధి నైపుణ్యాలతో సన్నద్ధం చేయడం ద్వారా విద్యార్థులను సిద్ధంగా ఉంచడం ద్వారా దశల వారీగా విశ్వవిద్యాలయంతో టై అప్ ప్రయాణం సాగిస్తామని వివరించారు.



15న మాన్యశ్రీ కాన్షీరామ్ జయంతి ఉత్సవాలు

నవతెలంగాణ-ఓయూ

బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు మాన్యశ్రీ కాన్షీరామ్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 15వ తేదీన ఉస్మానియా యూనివర్శిటీలో కాన్షిరాం జయంతి ఉత్సవాలు నిర్వహిస్తామని బీఎస్ఎఫ్ వ్యవస్థాపకులు, మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. శనివారం యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ఆవరణంలో బీఎస్ఎఫ్ ఓయూ అధ్యక్షులు బోరెల్లి సురేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థి, ప్రజా సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో బహుజన రాజ్యం సాధించిన మహోన్నతమైన వ్యక్తి, సబ్బండ వర్గాలకు రాజ్యాధికార రుచి చూపించిన ఆదర్శప్రాయుడు, రాజనీతి పితామహులు మాన్యశ్రీ కాన్షీరామ్ అనీ, అలాంటి వ్యక్తి జయంతిని పురస్కరించుకుని ఉస్మానియా యూనివర్సిటీలో ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మాన్యశ్రీ కాన్సిరాం జయంతి ఉత్సవాలు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు రహీం, మాదిగ జేఏసీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ అంకని రంజిత్, డాక్టర్ ఆలూరి సుధాకర్, అధికార ప్రతినిధి ఎర్రవెల్లి కృష్ణ, మాల మహానాడు ఓయూ ఇన్‌చార్జి సంకీ ప్రసాద్, బీసీ జేఏసీ నాయకులు శ్రీనాథ్‌రావు, పాల్గొన్నారు.

సిటీ కళాశాలలో సామాజిక శాస్త్రాల పరిశోధనపై కార్యశాల

నవతెలంగాణ-హైదరాబాద్



ప్రభుత్వ సిటీ కళాశాలలో చరిత్రశాఖ ఆధ్వర్యంలో సామాజిక శాస్త్రాల్లో పరిశోధన పద్ధతులపై జాతీయ కార్యశాల నిర్వహించారు. ఇందులో వక్తలుగా ఉస్మానియా విశ్వవిద్యాలయ చరిత్రశాఖ అధిపతి ఆచార్య జి.అంజయ్య పాల్గొని సామాజిక శాస్త్రాల్లో వివిధ పరిశోదనా పద్ధతులపై, సమాచార సేకరణ, వనరులు మొదలైన అంశాలపై ప్రసంగించారు. అనంతరం జరిగిన సమావేశంలో మను ఉర్దూ విశ్వవిద్యాలయ సోషియాలజీ ఆచార్యులు డాక్టర్. కే.ఎం ఖాజా జియా మైనర్, మేజర్ రీసెర్చ్ ప్రాజెక్ట్ ప్రతిపాదనల తయారీలో పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశాలైన సాహిత్య సమీక్షా, ఫండింగ్ ఏజెన్సీల సమాచారం, పరికల్పనకు సంబంధించిన విషయాలపై చర్చించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఐజాజ్ సుల్తానా మాట్లాడుతూ అధ్యాపకులు పరిశోధనపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్.బి.సుదక్షణ మాట్లాడుతూ సామాజిక శాస్త్రాల్లో పరిశోధన ఇంకా ముందుకు సాగాల్సిన అవసరం ఉందనీ, ఈ కార్యక్రమం అధ్యాపకులకు పరిశోధనపై మంచి అవగహన కల్పించిందన్నారు. ముగింపు సమావేశంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బాలభాస్కర్ మాట్లాడుతూ సామాజిక శాస్త్రాల్లో పరిశోధన పద్ధతులపై ఇలాంటి కార్యక్రమం జరగడం మంచి పరిణామం అనీ, ఇలాంటి అవకాశాలను అందిపుచ్చుకుని అధ్యాపకులు పరిశోధనలు సాగించాలన్నారు. ఈ కార్యశాలకు రాష్ట్రంలోని వివిధ డిగ్రీ కళాశాలల నుంచి అధ్యాపకులు హాజరయ్యారు. సిటీ కళాశాల అన్ని విభాగాల్లో అటు విద్యార్థి కేంద్రక, ఇటు అధ్యాపకులకు బహు విధాల ఉపయోగపడే కార్యక్రమాలను నిర్వహించటం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.

పేదల జీవితాలతో చెలగాటమాడుతున్న కేంద్రం



నవతెలంగాణ-హిమాయత్‌నగర్/సిటీబ్యూరో

బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత విచ్చల విడిగా వంట గ్యాస్ ధరను పెంచుతూ పేద ప్రజల జీవితాలతో చెలగాటమాడుతుందని సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి, తెలంగాణ శ్రామిక మహిళా ఫోరం రాష్ట్ర కన్వీనర్ పి.ప్రేమ్ పావని అన్నారు. సీపీఐ హైదరాబాద్ జిల్లా ఆధ్వర్యంలో వంట గ్యాస్ సిలిండర్ ధరను పెంచడాన్ని వ్యతిరేకిస్తూ శనివారం హిమాయత్ నగర్ లోని జిల్లా పార్టీ కార్యాలయం ఎదుట రోడ్డుపై కట్టెల పొయ్యితో వంట చేస్తూ నిరసన తెలిపారు. అనంతరం రోడ్డు పైనే సామూహిక భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్, ఈటి.నరసింహ, జిల్లా సహాయ కార్యదర్శులు స్టాలిన్, కమతం యాదగిరి, జిల్లా కార్యవర్గ సభ్యులు పడాల నళిని, శ్రీకాంత్, మల్లేష్, కాంపల్లి శ్రీనివాస్, మహిళా సంఘం నాయకులు చక్రి, రాధిక, జ్యోతి, కౌన్సిల్ సభ్యులు మన్నన్, కుమార్, రాజ్ కుమార్, విద్యార్థి నాయకులు కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేట : అడ్డు అదుపు లేకుండా నిరంతరం వంట గ్యాస్ ధరలు పెంచి దేశంలోని సామాన్య ప్రజలను కేంద్రంలోని బీజేపీ సర్కార్ లూటీ చేస్తుందని ఏఐటీయూసీ సీనియర్ నాయకులు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్ అన్నారు. ప్రజల సొమ్మును కొల్లగొట్టి అదానీ, అంబానీ లాంటి దొంగలకు చౌకీదార్ ప్రధాని మోడీ కట్టబెడుతున్నాడని ధ్వజమెత్తారు. పెంచిన వంట గ్యాస్, వాణిజ్య గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్, హైదరాబాద్, అంబర్‌పేట చే నెంబర్ చౌరస్తాలో శనివారం నిరసన ప్రదర్శన నిర్వహించింది. వందలాదిమంది ఆటో డ్రైవర్లు పాల్గొని నిత్యం ధరలు పెంచుతున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేస్తూ ప్రధాని నరేంద్ర మోడీ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ ప్రదర్శనలో ఏఐటీయూసీ హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి, ఏఐటీయూసీ ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్, హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.మల్లేష్, నేతలు ఒమర్ ఖాన్, కృష్ణ మూర్తి, రవీందర్ రెడ్డి, భూపాల్ గౌడ్, రాజు, లతీఫ్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.



99ప్లాట్స్ ఎక్స్పో డాట్ కామ్ డిజిటల్ సేవలు

నవతెలంగాణ-బంజారాహిల్స్



దేశంలోనే మొదటిసారిగా వినియోగదారుల కోసం అన్ని వివ రాలతో కూడిన వెంచర్స్ ఆన్‌లైన్ సేవలను 99 ప్లాట్స్ ఎక్స్పో డాట్ కామ్ పేరిట డిజిటల్ అండ్ టీవీ మీడియా కార్నివాల్ ఎక్స్పోను ప్రారంభిస్తున్నట్టు సంస్థ సీఈఓ మాదిరెడ్డి జగన్ తెలిపారు. శనివారం అమీర్‌పేటలోని ఎక్సోడ్స్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో 99ప్లాట్స్ ఎక్స్పో డాట్కామ్ను ఆయన వెంచర్స్ డైరెక్టర్లో కలిసి ప్రారంభించి లోగోను ఆవిష్కరించారు. బిజీ జీవితంలో వినియోగదారుల సమయాన్ని దృష్టిలో పెట్టుకుని అన్ని అనుమతులు కలిగిన వెంచర్లను ఓ వేదికగా తీసుకువచ్చామన్నారు. నగరంతోపాటు ఇతర ప్రాంతాల్లోని ఆయా వెంచర్ల పూర్తి వివరాలను పొందుపర్చామనీ, డిజిటల్, మీడియా సేవలను అందిస్తున్నామని తెలిపారు. వినియోగదారుడికి అన్ని తామై వారి సందేహాలను ఉచితంగా నివృత్తి చేస్తామన్నారు.

బ్లూ క్రాస్ హైదరాబాద్ వద్ద మార్స్ పెట్ కేర్ స్వచ్ఛంద సేవ

నవతెలంగాణ - హైదరాబాద్

పెంపుడు జంతువుల కోసం అత్యుత్తమ ప్రపంచాన్ని సృష్టించాలనే సంస్థాగత లక్ష్యాలకు కట్టుబడి, పెట్‌కేర్ మరియు న్యూట్రిషన్‌లో అగ్రగామి మార్స్ పెట్‌కేర్ అండ్ న్యూట్రిషన్, తమ వలెంటీరింగ్ కార్యక్రమాన్ని బ్లూ క్రాస్ ఆఫ్ హైదరాబాద్ (బీసీహెచ్) వద్ద నేడు నిర్వహించింది. ఈ అసోసియేట్ వలెంటరింగ్ కార్యక్రమంలో మార్స్ ఇంటర్నేషనల్ ఇండియా లిమిటెడ్ వద్ద పెట్‌కేర్ మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తోన్న సలీల్ మూర్తి నేతృత్వంలోని 30 మంది అసోసియేట్లు తమ సమయాన్ని వలెంటీర్ కార్యక్రమాల కోసం వెచ్చించారు. పెంపుడు జంతువుల పట్ల ఉన్న ప్రేమ, ఆసక్తి, పెంపుడు జంతువులు కోరుకునే ప్రపంచాన్ని సృష్టించాలనే మార్స్ సంస్థ యొక్క లక్ష్యాన్ని సజీవంగా ముందుకు తీసుకువచ్చింది.

'అవిచ్ఛిన్న ప్రక్రియల ద్వారా పరిశీలను, గణాంకాలు'పై జాతీయ స్థాయి శిక్షణా శిబిరం



నవతెలంగాణ-హైదరాబాద్

అవిచ్ఛిన్న ప్రక్రియల ద్వారా పరిశీలను, గణాంకాలు (నాన్ డిస్ట్రక్టివ్ అండ్ టెస్టింగ్ ఎవల్యూషన్) అనే అంశం పై జాతీయ స్థాయి శిక్షణ శిబిరం ప్రభుత్వ సిటీ కళాశాలలోని భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ విభాగం పదార్థాల భౌతిక, రసాయన ధర్మాలను అవిచ్ఛిన్న ప్రక్రియల ద్వారా గణాంకాలు (నాన్ డిస్ట్రక్టివ్ అండ్ టెస్టింగ్ ఎవల్యూషన్) అనే అంశం పై శిక్షణా కార్యక్రమాన్ని ఇండియన్ సొసైటీ ఫర్ నాన్ డిస్ట్రక్టివ్ టెస్టింగ్ (ఐఎస్ఎన్టీ) వారి సహకారంతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షుడుగా హాజరైన కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాల భాస్కర్ మాట్లాడుతూ శాస్త్రీయ పద్ధతుల్లో జరుగుతున్న ప్రయోగాలను విద్యార్థులు నిశితంగా పరిశీలించి తమ విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ప్రసిద్ధ పరిశోధన కేంద్రమైన డీఆర్డీఓ నుంచి ఈ కార్యక్రమానికి వక్తలుగా డాక్టర్. కె.శ్రీనివాస్, ఎం.వెంకటరెడ్డి, డాక్టర్.ఫణి, సూర్య కిరణ్ హాజరై, అవిచ్ఛిన్న ప్రక్రియల ద్వారా గణాంకాల్లో జరుగుతున్న ఆధునిక పరిశోధనలను వివరించారు. మిధాని నుంచి జి..ప్రవీణ్ కుమార్, ఎన్డీఈ పారిశ్రామిక రంగాల్లోని అనువర్తనాలను వివరించారు. ఈ విధానాలను కేంద్రక పరిశ్రమల్లో ఏ విధంగా ఉపయోగిస్తారో ఎన్.ఎస్.సి. కె.సోమ శేఖర రెడ్డి వివరించారు. వైద్య సాంకేతిక పరిశ్రమల్లో ఎక్స్- రే ఉపయోగాలను, ఎం క్యూ ఎస్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సీనియర్ మేనేజర్ ఎం.రాజ నరేంద్ర వివరించగా, ఫ్రెషర్స్‌కి ఉద్యోగ అవకాశాలను, ఆర్కిమెడిస్ గ్రీన్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ జి.సూర్య ప్రకాష్ వివరించారు. మించేరి రవి పూర్వ అసోసియేట్ డైరెక్టర్ ఎన్ పీసీఐఎల్ విశ్వనాథ్ మద్దిపట్ల వైస్ చైర్మన్ ఐఎస్ఐఎన్టీ హైదరాబాద్ చాప్టర్ ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథులుగా పాల్గొని వారి అమూల్య సందేశాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమానికి భౌతిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్.ఎస్. ఇ.నైనా వినోదిని హాజరై ఈ అంశం ప్రాముఖ్యతను వివరించగా, సమన్వయ కర్తగా డాక్టర్.డి.చిన్ని కృష్ణ వ్యవహరించారు. అధ్యాపకులు, డాక్టర్.వై.వాసుదేవరెడ్డి, డాక్టర్.కె.పర్వతాలు, డాక్టర్.ఎస్.లక్ష్మి శ్రీనివాస రావు, డాక్టర్. డి.సువర్ణ రవి బాతే, డిగ్రీ, పీజీ విద్యార్థులు హాజరయ్యారు.

పేద ప్రజలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలి



నవతెలంగాణ-అడిక్‌మెట్

పేద ప్రజలకు నిత్యావసర సరుకులను ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 14 రకాల సరుకులు అందచేయాలని ప్రగతిశీల యువజన సంఘం (పి.వై.ఎల్) రాష్ట్ర కమిటీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేసింది. శనివారం విద్యానగర్ మార్క్స్ భవన్‌లో పీవైఎల్ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పీవైఎల్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి కె.కాశీనాథ్, కె.ఎస్ ప్రదీప్ హాజరై మాట్లాడారు. కార్పొరేట్లకు రాయితీలు ఇస్తూ ప్రజలకు పన్నుల భారం మోపుతున్నారన్నారు. రాష్ట్రంలో 17వేల రేషన్ షాపుల ద్వారా కేంద్రం ప్రభుత్వం బియ్యం మాత్రమే 5 కేజీలు పంపిణీ చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా 5 కేజీలు కలిపి మొత్తం పది కేజీలు అది కూడా సన్న బియ్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీటితోపాటు వంట నూనె, కంది పప్పు, పెసర పప్పు, గోధుమ పిండి, పంచదార, టీ పొడి, ఉప్పు, పసుపు, కారం, చింతపండు, పల్లీలు, సబ్బులు, వంట గ్యాస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్యాస్ ధరలు విపరీతంగా పెంచి, సబ్సిడీ కూడా ఎత్తేస్తున్నారనీ, ఇది కార్పొరేట్ల అనుకూల నిర్ణయం అన్నారు. ప్రజలను నిలువు దోపిడీ చేసి, కార్పొరేట్లకి దోచి పెట్టడం సరికాదన్నారు. ప్రజలకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలనీ, లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పీవైఎల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాకేష్, కోశాధికారి ఈశ్వర్, ప్రతాప్, బుచ్చిరాజు, వెంకటేష్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ సెట్ వాయిదా

నవతెలంగాణ-ఓయూ

ఈ నెల 13వ తేదీన జరగాల్సిన తెలంగాణ స్టేట్ ఎలిజిబులిటి టెస్ట్ (టీఎస్ సెట్ 2022)ను ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంఓ వాయిదా వేసినట్టు సెట్ మెంబర్ సెక్రెటరీ ప్రొ.మురళీ కృష్ణ ఒక ప్రకటన పేర్కొన్నారు. ఈ నెల 14, 15 తేదీల్లో జరగాల్సిన సెట్ యధాతథంగా జరుగుతుందన్నారు. 13న వాయిదా పడిన సెట్ డేట్ త్వరలోనే వెల్లడించనున్నట్టు చెప్పారు.

తమన్నా, విజయ్ దేవరకొండ ఫ్యాషన్ ఎంపిక మింత్ర

నవతెలంగాణ - హైదరాబాద్

మింత్ర తన తాజా బ్రాండ్ క్యాంపెయిన్ 'ప్రతిరోజూ అసాధారణంగా కనిపించండి'లో భాగంగా తన బ్రాండ్ అంబాసిడర్‌లు తమన్నా భాటియా, విజయ్ దేవరకొండలతో వరుస యాడ్ ఫిల్మ్‌లను విడుదల చేసింది. మహిళల వెస్ట్రన్ వేర్ మరియు ఎత్నిక్ వేర్‌లను తమన్నా భాటియా ప్రమోట్ చేసే రెండు వాణిజ్య చిత్రాలలో, విజయ్ దేవరకొండ పురుషుల క్యాజువల్ వేర్‌లను ప్రమోట్ చేసే ఒక యాడ్ ఫిలింలో కనిపించారు. దేశం నలుమూలల ఉన్న వారి లక్షలాది మంది అభిమానులను ఆకర్షించేలా ఫ్యాషన్ కథనాన్ని మింత్రా సమిష్టిగా రూపొందించింది.

సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే కాలేరు చిత్రపటాలకు క్షీరాభిషేకం

నవతెలంగాణ-అంబర్‌పేట

కన్నడ సంఘాల ఆధ్వర్యంలో కాచిగూడ సాహిత్య అకాడమీలో సీఎం కేసీఆర్, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కాచిగూడ ఇన్‌చార్జి డాక్టర్ శిరీష యాదవ్, డాక్టర్ ఓంప్రకాష్ యాదవ్, కాచిగూడ డివిజన్ అధ్యక్షులు ఎర్ర భీష్మాదేవ్, కర్ణాటక సాహిత్య మందిర్ ప్రెసిడెంట్ సురేంద్ర కోటగిరి, కార్యదర్శి రాఘవేంద్ర దేశాయ్, నరసింహమూర్తి జోష్, బీఆర్ఎస్ నాయకులు దాత్రిక్ నాగేందర్ బాబ్జి, సదానందు, బబ్లు, మన్నే శ్రీనివాస్ యాదవ్, శ్రీకాంత్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



మౌలిక సమస్యలు పరిష్కరించేందుకు ఎల్లవేళలా కృషి

నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజక వర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద ప్రగతి యాత్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఎమ్మెల్యే కేపీ వివేకానందతో కలిసి మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డి డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ ఇన్‌ఛార్జి కమిషనర్ రామకృష్ణా రావు, 2వ డివిజన్ పరిధిలో ఐడిపిఎల్ కాలనీలో మజిపిఆర్ లేఅవుట్, శ్రీ సాయి కృష్ణ కాలనీలలో స్థానిక కార్పొరేటర్ చిట్ల దివాకర్‌తో కలిసి డ్రైనేజీ నిర్మాణ పనులను, రోడ్స్, మంజీర నీటి పైప్ లైన్, స్ట్రీట్ లైట్స్, పార్క్ అభివృద్ధి సమస్యలపై పర్యవేక్షించి పరిశీలించారు. ఆనంతరం కాలనీవారు ఏర్పాటు చేసిన సమవేశంలో పాల్గొని కాలనీల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడు కృషి చేస్తామని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు విజయలక్ష్మి సుబ్బారావు, సురేష్ రెడ్డి,గాజుల సుజాత, బాలాజీ నాయక్, ఏనుగుల శ్రీనివాస్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు ఏనుగుల అభిషేక్ రెడ్డి,సయ్యద్ సలీమ్ , సీనియర్ నాయకులు సుబ్బారావు, ఆవుల జగన్ యాదవ్, శ్రీనివాస్, బొర్రా చందూ, కోలన్ సునీల్ రెడ్డి, చంద్రగిరి సతీష్, జనరల్ సెక్రటరీ ముఖ్యులు పాల్గొన్నారు.

పదో తరగతి టాలెంట్ టెస్ట్‌కు విశేష స్పందన

నవతెలంగాణ - మేడ్చల్

మేడ్చల్ పట్టణంలోని స్ఫూర్తి జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో శనివారం పదవ తరగతి విద్యార్థులకు నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌కు విశేష స్పందన లభించింది. స్ఫూర్తి జూనియర్ కళాశాలతో పాటు పట్టణంలోని వివిధ పాఠశాలల్లో చుడువుతున్న పదవ తరగతి విద్యార్థులకు నిర్వహించిన టాలెంట్ టెస్ట్ కు సుమారు 800 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా టాలెంట్ టెస్ట్ కు హాజరైన విద్యార్థినీ, విద్యార్థులకు కళాశాల యాజమాన్య సభ్యులు మంజుల ప్రకాష్,కమలాకర్ రెడ్డి,దేవరాజ్,గణేష్, సత్యనారాయణలు అభినందనలు తెలియజేశారు.



మాదక ద్రవ్యాల నిర్మూలనపై నిరంతర నిఘా

- **రూ.కోటి విలువగల 400కిలోల గంజాయి స్వాధీనం**
- **నలుగురు అంతర్రాష్ట్ర నిందితుల అరెస్టు**

నవతెలంగాణ-సిటీబ్యూరో, హయత్‌నగర్



రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మాదక ద్రవ్యాలను నిర్మూలించేందుకు నిరంతర నిఘా ఉంచినట్టు రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ తెలిపారు. చౌటుప్పల్ వలిగొండ రహదారిలో గుట్టుచప్పుడు కాకుండా గంజాయిని తరలిస్తున్న అంతర్రాష్ట్ర గంజాయి ముఠా గుట్టును చౌటుప్పల్ పోలీసులు రట్టు చేశారు. ముఠాలోని నలుగురు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి కోటి విలువ గల 400కిలోల గంజాయి, డీసీఎం, కారుతోపాటు ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. శనివారం ఎల్బీనగర్‌లోని సీపీ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ డీఎస్ చౌహాన్ వివరాలను వెల్లడించారు. హన్మకొండకు చెందిన బోనోతు వీరన్న, శ్రీశైలంకు చెందిన కే.శ్రీశైలం, హైదరాబాద్‌కు చెందిన కే.శంకర్‌నాయక్, వరంగల్‌కు చెందిన పి.సూరయ్యలు ఒక ముఠాగా ఏర్పడ్డారని తెలిపారు. సులువుగా డబ్బులు సంపాదించాలని గంజాయిని స్మగ్లింగ్ చేస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ అన్నవరం నుంచి హైదరాబాద్, రామజమండ్రి, ఖమ్మం, తొర్రూరు, తిరుమలగిరి, మోత్కూర్, వలిగొండ, చౌటుప్పల్ మీదుగా మహారాష్ట్రతోపాటు ఇతర రాష్ట్రాలకు గంజాయిని తరలిస్తున్నారు. పోలీసులకు పట్టుబడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారని తెలిపారు. ఎవరికీ అనుమానం రాకుండా డీసీఎం వాహనంలోపల గంజాయి తరలించేందుకు వీలుగా ప్రత్యేక ఏర్పాటు చేశారన్నారు. గంజాయి తరలించే సమయంలో కొంత దూరంలో పైలెట్‌గా ఓ వాహనం వెళ్లేదన్నారు. పక్కా సమాచారంతో పైలెట్ వాహనంతోపాటు గంజాయిని తరలిస్తున్న డీసీఎంను అడ్డుకుని తనిఖీ చేయగా గంజాయిని గుర్తించామని తెలిపారు.

ఈ కేసులో మొత్తం ఏడుగురు నిందితులను గుర్తించామన్నారు. నలుగురిని అరెస్టు చేశామని మరో ముగ్గురి కోసం గాలిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో భువనగిరి డీసీపీ రాజేష్ చంద్ర, చౌటుప్పల్ ఏసీపీ ఉదయ్ రెడ్డి, చౌటుప్పల్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున రెడ్డి, మహేష్ గౌడ్, రామన్న పేట ఇన్స్‌పెక్టర్ మోతీరాం తదితరులు పాల్గొన్నారు.

మీర్‌పేట్‌లో ఏడు లక్షల విలువగల హెరాయిన్ పట్టివేత

మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో హెరాయిన్ తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాలోని ముగ్గురు నిందితులను ఎల్బీనగర్ ఎస్‌వోటీ, మీర్‌పేట్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి ఏడు లక్షల విలువ గల 10గ్రాముల హెరాయిన్, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. శనివారం ఎల్బీనగర్‌లోని సీపీ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ డీఎస్ చౌహాన్ వివరాలను వెల్లడించారు. నిజాంపేట్‌కు చెందిన పి.సిద్ధార్థ్, పటాన్‌చెర్వుకు చెందిన వి.నిఖిల్ వర్మా, వీ.యశ్వంత్ స్నేహితులు. సిద్ధార్థ్ గంజాయి, హెరాయిన్‌కు బానిసయ్యాడు. ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో మాదకద్రవ్యాలను సరఫరా చేయడం మొదలు పెట్టాడు. ఈ క్రమంలో మిగిళిన స్నేహితులకు అలవాటు చేశాడు. మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారిని ముగ్గురు సప్లయ్ దారులుగా మారారు. రూ.8వేలకు కొనుగోలు చేస్తూ గ్రాముకు రూ.10వేల చొప్పున విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ముగ్గురిని అరెస్టు చేశారు. ఈ సమావేశంలో ఎల్‌బీనగర్ ఎస్‌ఓటీ డీసీపీ మురళీధర్, మీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్ మహేందర్ రెడ్డి, ఎల్‌బీనగర్ ఎస్‌వోటీ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజుల్లో పనులు పూర్తి చేయాలి

- **అధికారులకు ఆదేశించిన ఎండీ దానకిశోర్**
- **గోదావరి పైపు లైన్ పనుల ఏర్పాట్లు పరిశీలన**

నవతెలంగాణ-సిటీబ్యూరో



రెండు రోజుల్లో మరమ్మతు పనులను పూర్తిచేయాలని జలమండలి ఎండీ దానకిశోర్ ఆదేశాలు జారీచేశారు. హైదరాబాద్ మహా నగరానికి తాగునీరు అందిస్తున్న గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లై ఫేజ్-1లో సిద్దిపేట జిల్లా కుకునూర్‌పల్లి వద్ద రైల్వే క్రాసింగ్ దగ్గర ఉన్న 3000 ఎంఎం డయా పంపింగ్ మెయిన్ పైపు లైన్ బ్రిడ్జ్ పాసింగ్ - బైపాసింగ్, ఇంటర్ కనెక్షన్ పనులను జలమండలి ఎండీ దానకిశోర్ శనివారం పరిశీలించారు. నూతన రైల్వే ట్రాక్‌కు ఇబ్బంది కలగకుండా బ్రిడ్జ్ ఓవర్, పైపులైన్ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఆ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనుకున్న సమయం 66 గంటల కంటే ముందే 48 గంటల్లో పనులు పూర్తి చేయాలన్నారు. అందుకోసం ప్రత్యేక ప్రణాళికలతో ముందుకెళ్లాలని అధికారులకు సూచించారు. భారీ పైపు లైన్ కావడంతో పనులు చేసేటప్పుడు జాగ్రత్త వహించాలన్నారు. అవసరమైతే తగిన సాంకేతిక నిపుణుల సాయం తీసుకోవాలని వివరించారు. కావాల్సిన యంత్రాలు, పనిముట్లు, నిర్మాణ సామగ్రిని అదనంగా అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. పని చేసే సమయంలో రక్షణ చర్యలు పాటించాలన్నారు. దీంతో పాటు ఈ ప్రాంతమంతా సరైన బారికేడ్లు ఏర్పాటు చేయాలని, అనధికార వ్యక్తులను అనుమతించవద్దని సూచించారు. నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేసి నీటి సరఫరాను పునరుద్ధరించి, ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ డైరెక్టర్ రవికుమార్, సీజీఎంలతోపాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష

అనంతరం ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడే డివిజన్ల సీజీఎం, జీఎంలతో ఎండీ ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. ప్రభావితమయ్యే ప్రాంతాల్లో 10వ తేదీన నీరు సరఫరా అయ్యేలా చూడాలన్నారు. అప్పటి వరకు వాటికి ట్యాంకర్ల ద్వారా నీరు అందించాలని పేర్కొన్నారు. మరమ్మతు పనుల వల్ల నగరంలో దాదాపు 2.5 లక్షల కనెక్షన్లకు నీటి సరఫరాలో అంతరాయం కలుగుతందన్నారు. ముఖ్యంగా స్లమ్, బస్తీలకు ప్రాధన్యమిస్తూ ట్యాంకర్ల ద్వారా ఉచితంగా నీరందించాలన్నారు. అవసరమైతే ట్రిప్పుల సంఖ్యను సైతం పెంచాలని సూచించారు. ప్రభావితమయ్యే ప్రభుత్వ వసతి గృహాలు, ఆసుపత్రులకు సైతం ఉచితంగా ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయాలన్నారు. అవసరాన్ని బట్టి ప్రైవేటు ట్యాంకర్ల సేవలను ఉపయోగించుకోవాలన్నారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న ఫిల్లింగ్ స్టేషన్‌లలో ఎప్పటికప్పుడు తగినంత నీరు ఉండేలా చూసుకోవాలని తెలిపారు. ప్రజలందరూ ఈ సమయంలో నీటి వృథాను అరికట్టి, పొదుపుగా వాడుకోవాలని ఆయన కోరారు.

ఇంటర్ పరీక్షలపై అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- **డీఆర్వో సూర్యలత**
- **ఇంటర్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష**



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు అన్నిశాఖల అధికారుల సమన్వయంతో పనిచేయాలని హైదరాబాదు జిల్లా రెవెన్యూ అధికారి సూర్యలత సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇంటర్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై శనివారం తన ఛాంబర్‌లో జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖాధికారి, వైద్య, పోలీస్, జలమండలి, విద్యుత్, ఆర్టీసి, పోస్టల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 15 నుంచి ఏప్రిల్ 4వరకు ఇంటర్ పరీక్షలు జరగనున్నాయని, ఇందుకోసం జిల్లాలో మొత్తం 233 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. సుమారు 1.71లక్షల మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నారని తెలిపారు. ఈ పరీక్షలు ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు తిరిగి 2.00 గంటల నుంచి 5.00 గంటల వరకు నిర్వహిస్తారని తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు సెంటర్లకు ముందుగానే చేరుకోవాలని, పరీక్ష కేంద్రాలలోకి ఉదయం 8.30 నుంచి మధ్యాహ్న 1.30 గంటల వరకు అనుమతించడం జరుగుతుందన్నారు. కావున విద్యార్థులందరూ ఆ సమయానికల్లా సంబంధిత పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని ఆమె సూచించారు. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా స్పెషల్ బస్సులను నడపాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులందరూ పరీక్షా కేంద్రాలకు క్యాలిక్యులేటర్లు, సెల్‌ఫోన్లు, పెన్ డ్రైవ్‌లు, ఎలక్ట్రానిక్ వాచీలతో పాటు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకురాకూడదని చెప్పారు. పరీక్షా కేంద్రాల పరిధిలో జిరాక్సు షాపులను మూసివేసి 144 సెక్షన్ విధించాలన్నారు. పరీక్షా కేంద్రాలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చూడాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులకు ఆదేశించారు. పరీక్ష సమయంలో విదుత్తు సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్తు శాఖ అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రాలలో తాగునీరు అందుబాటులో ఉండేలా చూడాలని జలమండలి అధికారు లకు తెలిపారు. పోలీసు, రెవెన్యూ, ఆర్టీసీ, పోస్టల్, విద్యుత్తు, వాటర్ వర్క్స్, వైద్య విద్యా శాఖలు తమ పూర్తి సహకారాన్ని అందించాల్సిందిగా కోరారు. ఈ సమావేశంలో డీసీపీ బాబురావు, హైదరాబాద్ డీఐఈవో వడ్డెన్న, డీఈవో కార్యాలయ ఈడీ శ్రీనివాస్ రెడ్డి, అడిషనల్ ట్రాఫిక్ సీపీ ప్రసాద్, మెడికల్ ఆఫీసర్ సుధ, పోస్టల్ అధికారి విద్యాసాగర్, జీహెచ్ఎంసీ కె. పద్మజా, టీఎస్ఎస్‌పీడీసీఎల్ ప్రార్థన, తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివితే ప్రతిభావంతులవుతారు

- **నవజ్యోతి విద్యాసంస్థల చైర్మెన్ మలిరెడ్డి ఇందిరా రెడ్డి**



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

విద్యార్థులు చిన్ననాటి నుండే క్రమశిక్షణతోపాటు పట్టుదలతో చదివితే భవిష్యత్తులో ప్రతిభావంతులవుతారని నవజ్యోతి విద్యాసంస్థల చైర్మెన్, కరస్పాండెంట్ మలిరెడ్డి ఇందిరారెడ్డి అన్నారు. శనివారం చింతల్ డివిజన్ వైఎంఎస్ కాలనీలోని పట్వారి బ్రాంచ్ పాఠశాలలో (ప్రీ ప్రైమరీ నుండి 5 తరగతుల విద్యార్థులు) వార్షికోత్సవ (రిథమ్ 2023) వేడుకలు చిన్నారి విద్యార్థుల కేరింతల నడుమ ఉల్లాసంగా, ఉత్సాహంగా కొనసాగింది. ముందుగా డిజిటల్ క్లాసులు నిర్వహించే వన్ లెర్న్ ప్రతినిధి దుష్యంత్, క్వీన్ ఇంగ్లీష్ ద్వారా కమ్యూనికేషన్ విధానాన్ని పాఠశాలలో పటిష్ఠం చేస్తున్న సంస్థ ప్రతినిధి సందీప్ మల్లారెడ్డి, ప్రముఖ విద్యావేత్త ముప్పాళ్ళ సుబ్బారావు, పాఠశాల అధిపతి మలిరెడ్డి రవీందర్‌రెడ్డి, డైరెక్టర్ ఎం.ఆదిత్య కృష్ణ, బి.రూపాంజలితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ సాధ్యాన్ని సుసాధ్యం చేయగల సత్తా విద్యార్థులకు ఉందని, ఆ దిశగా విద్యతోపాటు వలు రంగాలలో రాణించి దేశ ప్రతిష్ఠను ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. విద్యార్థుల మనోభావాలకు అనుగుణంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. అప్పుడే వారి కలలు సాకారం అవుతాయని తెలిపారు. తమ అధ్యాపక బృందం సమిష్టి కృషితోనే ప్రతియేటా మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నామని స్పష్టం చేశారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో చిన్నారి విద్యార్థులు వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి ప్రదర్శించిన నాటికలు, నృత్యాలు ఆహుతుల్ని అలరింపజేశాయి. అతిథులు దుష్యంత్, సందీప్, మల్లారెడ్డి, ముప్పాళ్ళ సుబ్బారావులు మాట్లాడుతూ విద్యతోనే విశ్వాన్ని జయించవచ్చునని విద్యార్థులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుని కలిసిన డివిజన్ల అధ్యక్షులు

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

ప్రభుత్వ విప్, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుని తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం మేడ్చల్ - మల్కాజ్గిరి జిల్లా యువజన విభాగం కన్వీనర్‌గా నియమితులైన పుప్పాల భాస్కర్ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం భాస్కర్‌ని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వడ్డెర సంఘం అధ్యక్షులు ఎత్తారి మారయ్య, నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షులు దుదిమెట్ల సోమేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రామ్ రెడ్డి, రుద్రా అశోక్, పోలే శ్రీకాంత్, కౌన్సిలర్ శంకర్ నాయక్, మాజీ గ్రంథాలయ చైర్మెన్ నాగరాజు యాదవ్, జిన్నారం వెంకన్న, ధర్మారెడ్డి మైనార్టీ నాయకులు రెహమాన్, ప్రభాకర్ గుప్తా మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

నవతెలంగాణ-సిటీబ్యూరో

నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో మూడు నెలల ఉచిత శిక్షణ ఇస్తున్నామని అసిస్టెంట్ డైరెక్టర్ అంజయ్య శనివారం తెలిపారు. బండ్లగూడలోని న్యాక్ సెంటర్‌లో జనరల్ వర్క్ సూపర్‌వైజర్, ల్యాండ్ సర్వే, హౌజ్ వైరింగ్ తదితర వాటిల్లో ఉచిత శిక్షణ అందిస్తున్నామన్నారు. ఈనెల 15ను ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్‌తో పాటు100శాతం ఉద్యోగా వకాశాలు కల్పించనున్నట్టు తెలిపారు. పది, ఇంటర్ పాసైన వారు ధరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు 6302890077, 8897494984లో సంప్రదించాలన్నారు.



వ్యవస్థీకృత క్రీడా రంగం. భారత్‌లో ఈ పదానికి పెద్దగా విలువ లేదు!. సానియా మీర్జా, సైనా నెహ్వాల్, పి.వి సింధు సహా నవతరం వర్ధమాన క్రికెటర్లు త్రిష, యశశ్రీలు ఎవరూ ప్రభుత్వ క్రీడా వ్యవస్థ నుంచీ రాలేదు. అందరూ కుటుంబ సభ్యుల తోడ్పాటు, వెలకట్టలేని త్యాగాల ఫలితంగానే క్రీడల్లో చాంపియన్లుగా నిలిచారు. వ్యవస్థ సహకారంతో, వ్యవస్థ ద్వారా చాంపియన్లు నిలిచిన వారు ఇక్కడ ఎవరూ లేరు!. ఇదే విషయాన్ని టెన్నిస్ దిగ్గజం సానియా మీర్జా కుండ బద్దలు కొట్టింది. భారత టెన్నిస్‌ను, భారత క్రీడా రంగంలో మహిళల స్థానాన్ని మరో స్థాయికి తీసుకెళ్లిన హైదరాబాదీ ఇటీవల ఆటకు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. సొంతగడ్డపై (ఎల్బీ ఇండోర్ స్టేడియం) ఎగ్జిబిషన్ మ్యాచ్‌తో పరిపూర్ణ వీడ్కోలుకు సిద్ధమవుతున్న సానియా మీర్జా శనివారం తన టెన్నిస్ అకాడమీలో మీడియాతో ముచ్చటించింది. ఆ విషయాలు..

వ్యవస్థ మారాలి

- లేదంటే మరో సానియాను చూడలేం
- వ్యవస్థీకృత క్రీడా రంగం అవసరం
- టెన్నిస్ స్టార్ సానియా మీర్జా వ్యాఖ్యలు

నవతెలంగాణ-హైదరాబాద్

మంచి వ్యవస్థ కావాలి

అమెరికా సహా ఇతర దేశాల్లో క్రీడలకు మంచి వ్యవస్థలు ఉన్నాయి. సంస్థాగత వ్యవస్థలతో ఇతర దేశాలు వరుసగా ఏడాదికో చాంపియన్‌ను తయారు చేస్తున్నాం. అదే ఇక్కడ మన దగ్గర పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. అందుకే 20-30 ఏండ్లకు ఒక చాంపియన్ పుట్టుకొస్తున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడల్లోకి పంపించేందుకు తొలుత ప్రొఫెషనలిజం అవసరం. అది ప్రస్తుతం మన దగ్గర ఏమాత్రం లేదు.

మార్పు అవసరం

గత 40-50 ఏండ్లలో భారత్ నుంచి ఏటీపీ, డబ్ల్యూటీఏ ర్యాంకింగ్స్‌లో టాప్-100లో నిలిచిన ఆటగాళ్లను ఎవరినైనా అడగండి. విజయ్, ఆనంద్, మహేశ్, లియాండర్, రోహన్, నేను.. ఎవరైనా చెప్పేది ఒక్కటే. మేము వ్యవస్థ సహకారంతో ఎదగలేం. వ్యవస్థ సహకారం లోపించినా, అవరోధాలు ఎదురైనా అంతర్జాతీయ స్థాయిలో నిలదొక్కుకున్నాం. అప్పట్లో హైదరాబాద్‌లో హార్డ్‌కోర్టు సౌకర్యమే లేదు. ఒక వ్యక్తి తన ఇంట్లో హార్డ్ కోర్టు ఏర్పాటు చేసుకుంటే.. అతడి అనుమతితోనే అక్కడ ప్రాక్టీస్ చేసేవాళ్లం. ఇది ఎంత హాస్యాస్పదం. వ్యవస్థలో మార్పు అనివార్యం. వ్యవస్థలో మార్పు తీసుకురాకుంటే.. మరో 20 ఏండ్ల తర్వాత సైతం మరో సానియా ఎక్కడ? అనే ప్రశ్నే ఎదురవుతుంది.

నా భాగస్వామ్యం ఉంటుంది

సరైన సదుపాయాలు, సౌకర్యాలు, అంతర్జాతీయ స్థాయి శిక్షణ ఉంటే ఏ క్రీడల్లోనైనా ఫలితాలు వస్తాయి. కొన్ని ఆటల్లో ఫలితం సులభంగా రావచ్చు, మరికొన్ని ఆటల్లో అది కాస్త కష్టంగా రావచ్చు. కానీ వ్యవస్థను గాడిలో పెడితే ఫలితాలు కచ్చితంగా సాధ్యపడతాయి. జూనియర్ లెవల్, అన్ని స్థాయిల్లో టోర్నమెంట్లు.. ఇలా ఏం చేయాలనే అంశంపై నాకు పెద్దగా అవగాహన లేదు. కానీ ఒకవేళ వ్యవస్థలో మార్పు కోసం నన్ను సంప్రదిస్తే కచ్చితంగా నేను అందులో భాగమవుతాను. వర్ధమాన క్రీడాకారుల అభివృద్ధికి నా వంతు సహకారం అందిస్తాను.

అదొక్కటే లోటు

సుదీర్ఘ కెరీర్‌లో భారత్‌కు నాలుగు ఒలింపిక్స్‌లో ప్రాతినిథ్యం వహించాను. 2016 రియో ఒలింపిక్స్ సెమీఫైనల్స్ ఫలితం భిన్నంగా రావాల్సింది. కొన్ని కలలు సాకారం అవుతాయి, కొన్ని కలలు సాకారం కావు. నేను సాధించిన ఘనతల పట్ల ఎంతో గర్వపడతాను. కానీ ఒలింపిక్ పతకం కలగానే మిగిలింది. ఒలింపిక్ మెడల్ సాధించి ఉంటే నా కెరీర్ పరిపూర్ణమయ్యేది.

డబ్ల్యూపీఎల్ ఓ మైలురాయి

మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) మహిళల క్రికెట్‌లో ఓ మైలురాయి. రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ మెంటార్‌గా ఆ జట్టు సభ్యులతో మాట్లాడాను. అందరూ కఠోరంగా శ్రమించే యువ క్రికెటర్లు. అత్యధికంగా ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల నుంచి వచ్చిన అమ్మాయిలే ఉన్నారు. వేలంలో డబ్బులు పెట్టి క్రికెటర్లను కొనుగోలు చేసి, లీగ్ ఆడతారనే భావన 20 ఏండ్ల కిందట ఎవరూ ఊహించనిది. డబ్ల్యూపీఎల్‌తో మహిళల క్రికెట్‌లో గణనీయమైన మార్పు రానుంది.

టెన్నిస్‌లో ఇప్పుడు కష్టమే!

మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) తరహాలో టెన్నిస్‌లోనూ లీగ్ నిర్వహణ ప్రస్తుత పరిస్థితుల్లో ఆచరణ సాధ్యం కాదు. భారత్‌లో క్రికెట్‌ను ఏ క్రీడతోనూ పోల్చలేం. క్రికెట్‌లో అన్ని రాష్ట్రాల్లో, అన్ని స్థాయిల్లో క్రీడాకారులు అందుబాటులో ఉన్నారు. టెన్నిస్‌లో పరిస్థితి వేరు. టెన్నిస్‌లో అడుగుపెట్టిన వారు మధ్యలోనే వదిలేస్తున్నారు. నిలకడగా రాణించగలిగే క్రీడాకారుల బృందాలు అందుబాటులో ఉంటేనే లీగ్‌లు నిర్వహించేందుకు అవకాశం ఉంటుంది. టెన్నిస్‌లో లీగ్‌కు ఇంకా ఎంతో సమయం ఉంది.



నేడు చివరి ఆట

20 ఏండ్ల సుదీర్ఘ కెరీర్‌కు సొంతగడ్డపైనే పరిపూర్ణంగా వీడ్కోలు పలికేందుకు సిద్ధమైంది సానియా మీర్జా. ఎల్బీ స్టేడియంలో ప్రొఫెషనల్ కెరీర్‌ను మొదలెట్టిన సానియా మీర్జా.. ఇప్పుడు అక్కడే చివరిసారిగా రాకెట్ పట్టనుంది. ఇటీవల దుబాయ్ ఓపెన్‌తో అంతర్జాతీయ కెరీర్‌కు ముగింపు పలికింది సానియా. కుటుంబ సభ్యులు, సన్నిహితులు, అభిమానుల సమక్షంలో నేడు చివరి సారి ఆడనుంది. ఎల్బీ ఇండోర్ స్టేడియంలో మహిళల డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ మ్యాచుల్లో సానియా మెరువనుంది. ఇవాన్ డోడిగ్, రోహన్ బోపన్న, మరియన్ బర్తోలి, బెతానీ మాటెక్, కారా బ్లాక్‌లతో కలిసి నేడు సానియా ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో ఆడనుంది. ఉదయం 11 గంటలకు ఎగ్జిబిషన్ మ్యాచులు ఆరంభం కానున్నాయి.

నేడు ప్రైమ్ వాలీబాల్ ఫైనల్



కోచి : ప్రైమ్ వాలీబాల్ లీగ్ రెండో సీజన్ తుది అంకానికి చేరుకుంది. కోచి వేదికగా నేడు టైటిల్ పోరులో బెంగళూర్ టార్పెడోస్, అహ్మదాబాద్ డిఫెండర్స్ తాడోపేడో తేల్చుకోనున్నాయి. శనివారం జరిగిన రెండో సెమీఫైనల్లో కాలికట్ హీరోస్‌పై అహ్మదాబాద్ డిఫెండర్స్ 3-1తో ఘన విజయం సాధించింది. 17-15, 9-15, 17-15, 15-11తో కాలికట్ హీరోస్‌పై మెరుపు విజయం సాధించింది. సీజన్‌లో నిలకడగా రాణించిన కాలికట్ హీరోస్ సెమీస్‌లో చెమటోడ్చినా.. భంగపాటు తప్పలేదు. అహ్మదాబాద్ డిఫెండర్స్ తరఫున రామస్వామి, డానియల్, నందగోపాల్, మంజునాథ మనోజ్, ముతుసామిలు పాయింట్లు కొల్లగొట్టారు. చార్లెస్ జెరోమ్ వినిత్, జరాడి, జోశ్ ఆంటోనియో, రెహమాన్, మహేశ్ రాజ్, మోహన్‌లు మెరిసినా.. మ్యాచ్‌ను నిర్ణయాత్మక ఐదో సెట్‌కు తీసుకెళ్లటంలో విఫలమయ్యారు. నేడు తుది పోరు రాత్రి 7 గంటలకు సోనీ నెట్‌వర్క్‌లో ప్రసారం కానుంది.

ఉత్కంఠగా టెన్నిస్ పోటీలు



హైదరాబాద్ : 13వ హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్ పోటీలు రెండో రోజు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ వేదికగా 390 మంది క్రీడాకారులు పోటీపడుతున్నారు. మెన్స్ సింగిల్స్ (30) భార్గవ్ 8-0తో సాయినాథ్‌పై, ఈశ్వర్ సాయి 8-3తో జయేశ్‌పై, అనిరుధ్ 8-1తో ప్రమోద్‌పై, సురేశ్ 8-0తో సిరశాలపై విజయాలు సాధించారు. మెన్స్ సింగిల్స్ (40)లో చంద్రశేఖర్‌పై కిరణ్ 8-3తో, జహంగిర్‌పై అశ్విన్ కుమార్ 8-3తో, సురేశ్‌పై యోగేశ్ 8-4తో, దాసుపై శ్రీకాంత్ 8-0తో గెలుపొందారు. మహిళల సింగిల్స్ (ఓపెన్) సౌమ్య నాయుడు 8-0తో ప్రణితపై ఏకపక్ష విజయం నమోదు చేయగా.. గాయత్రి 8-2తో ప్రశాంతిపై, అరుణ భాస్కర్ 8-4తో అలేఖ్యపై, జానకి 8-0తో నీలం చోప్రపై పైచేయి సాధించారు.



డబ్ల్యూపీఎల్ మొదలైంది

మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) శనివారం ఘనంగా మొదలైంది. ముంబయిలో జరిగిన ఆరంభ వేడుకల్లో ఐదు జట్ల కెప్టెన్లు, బీసీసీఐ ఆఫీస్ బేరర్లు పాల్గొన్నారు. తొలి మ్యాచ్‌లో ముంబయి ఇండియన్స్, గుజరాత్ జెయింట్స్ తలపడ్డాయి. ఆరంభ వేడుకల్లో నృత్య ప్రదర్శనలు అభిమానులు విశేషంగా ఆకట్టుకున్నాయి.

డ్రెస్సింగ్‌రూమ్‌లో సహచరులతో..

ఇన్నింగ్స్‌ను పంచుకున్న హెడ్, లబుషేన్

ఇండోర్ : భారత్‌లో భారత్‌పై టెస్టు విజయం ఓ మైలురాయితో సమానం. అద్వితీయ విజయంతో పాటు ఐసీసీ డబ్ల్యూటీసీ ఫైనల్లో చోటు ఖాయం చేసుకున్న ఆస్ట్రేలియా శుక్రవారం ఇండోర్‌లో సంతోషంగా గడిపింది. తొలి సెషన్లోనే మ్యాచ్ ముగిసినా.. సాయంత్రం వరకు ఆస్ట్రేలియా క్రికెటర్లు మైదానంలో సందడి చేశారు. అశ్విన్, జడేజాలను ఎదుర్కొంటూ సాగిన ఇన్నింగ్స్‌లను ట్రావిశ్ హెడ్, మార్నస్ లబుషేన్‌లు సహచరులతో ఎంతో ఆనందంగా పంచుకున్నారు. విజయానంతరం డ్రెస్సింగ్‌రూమ్‌కు చేరుకున్న మార్నస్ లబుషేన్.. ఓ అర గంట తర్వాత సహచరులకు తను అశ్విన్, జడేజా మాయజాలానికి ఏ విధంగా చెక్ పెట్టాననే విషయాన్ని పంచుకున్నాడు. ఇక, బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో 2-1తో టీమ్ ఇండియా ఆధిక్యంలో కొనసాగుతున్నప్పటికీ ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో చోటు కోసం అహ్మదాబాద్ టెస్టులో గెలిచి తీరాల్సిన పరిస్థితి. భారత్, ఆస్ట్రేలియా చివరి టెస్టు మార్చి 9 నుంచి అహ్మదాబాద్‌లో జరుగనుంది.

'బలగం' బాగుందని ప్రశంసిస్తున్నారు : దిల్‌రాజు



దిల్‌రాజు

దిల్‌రాజు ప్రొడక్షన్స్ శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత నిర్మించిన సినిమా 'బలగం'. ప్రియదర్శి, కావ్యా కళ్యాణ్ రామ్ ప్రధాన తారాగణంగా నటించారు. వేణు ఎల్దండి దర్శకత్వం వహించారు. శుక్రవారం రిలీజైన ఈ సినిమా సక్సెస్ టాక్ తెచ్చుకుంది.

ఈ సందర్భంగా దిల్ రాజు శనివారం మీడియాతో మాట్లాడుతూ,'సినిమా చూసిన వారందరూ చాలా బాగుందని అన్నారు. విమర్శకులు కూడా పాజిటివ్‌గా స్పందించారు. చిన్న సినిమా హిట్ అయితే ఆ కిక్కే వేరు. నేను తెలంగాణలో చిన్న పల్లెటూరు నుంచి వచ్చాను. మనుషులు చనిపోయి నప్పుడు ఎలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. అప్పుడు ఎమోషన్స్ ఎలా ఉంటాయనే దాన్ని నేను కూడా దగ్గర నుంచి గమనించాను. మన సంస్కృతిలో ఏముందనే విషయాన్ని వేణు పట్టుకున్న తీరు నాకు బాగా నచ్చింది. ఆ సమయంలోనే సినిమా చాలా నేచురల్‌గా ఉండాలని చెప్పాను. ఈ సినిమా చూసిన వారందరూ అవార్డ్ వస్తుందని అంటున్నారు. అయితే నేను అవార్డు కోసం సినిమా చేయలేదు. వస్తే మంచిదే. డైరెక్టర్ వేణు ఎల్దండి మా బ్యానర్‌లోనే రెండో సినిమాను కూడా చేస్తున్నాడు. నెక్స్ట్ ఓ డాన్స్ మాస్టర్‌ను హీరోగా, సింగర్‌ను మ్యూజిక్ డైరెక్టర్‌గా పరిచయం చేస్తూ శశి అనే కొత్త దర్శకుడితో ఓ ప్రయోగాత్మక సినిమా చేస్తున్నాం' అని తెలిపారు.

నా 'పచ్చి కి' కథని కాపీ కొట్టి 'బలగం' తీశారు



గడ్డం సతీష్

"బలగం' సినిమా కథ 90 శాతం నాదే. నా అనుమతి లేకుండా నా పచ్చి కి కథని దిల్‌రాజు వాడుకోవడం తప్పు' అని రచయిత, సీనియర్ జర్నలిస్ట్ గడ్డం సతీష్ ఆరోపించారు.

శనివారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, '2011లో నేను రాసిన 'పచ్చికి' కథను 2014, డిసెంబర్ 24వ తేదీన 'నమస్తే తెలంగాణ'లో ఆదివారం మ్యాగజైన్ బతుకమ్మలో అచ్చు వేశారు. పచ్చికి అంటే పక్షికి అని అర్థం. సాధారణంగా మనిషి చనిపోయిన తర్వాత మూడు, ఐదు, ఏడవ రోజుల్లో పక్షికి ముద్ద పెడతారు. పక్షికి పెట్టేదాన్ని పచ్చికి అనే కథగా రాశాను. నా కథలో కాస్త మార్పులు, చేర్పులు చేసి దిల్ రాజు ఈ కథను సినిమాగా తీసి డబ్బులను ఆయన జేబులో వేసుకుంటున్నారు. పైగా బెదిరింపులకు పాల్పడుతున్నాడు. నాకు రావలసిన గుర్తింపు నాకు ఇవ్వాలి. సినిమా టైటిల్స్‌లో మూల కథ నాదేనని క్రెడిట్ ఇవ్వాలి. ఈ విషయాన్ని వారే అధికారికంగా అనౌన్స్ చేస్తే చాలా సంతోషం. లేకపోతే నేను చట్టపరమైన చర్యలు తీసుకుంటాను' అని చెప్పారు.



మాళవిక నాయర్, సంతోష్ శోభన్

అన్నీ మంచి శకునములే

సంతోష్ శోభన్, మాళవిక నాయర్ జంటగా బివి నందిని రెడ్డి దర్శకత్వంలో స్వప్న సినిమా పతాకంపై రూపొందుతున్న చిత్రం 'అన్నీ మంచి శకునములే'. లేటెస్ట్‌గా 'సీతారామం' స్టార్ దుల్కర్ సల్మాన్ ఈ చిత్ర టీజర్‌ని లాంచ్ చేశారు. రెండు విభిన్నమైన, ప్లజెంట్ కుటుంబాలను, వారి మధ్య అందమైన బంధాన్ని టీజర్ పరిచయం చేస్తుంది. ఈ 76-సెకన్ల వీడియోలో భావోద్వేగాలతో కూడిన రోలర్‌కోస్టర్ రైడ్‌లా ఉంది. హిల్ ఏరియా నేపథ్యంలో సాగే కథ, విజువల్స్ బ్యూటీఫుల్‌గా ఉన్నాయి. సంతోష్ శోభన్, మాళవిక నాయర్ మెయిన్ లీడ్ చాలా బాగుంది. రాజేంద్ర ప్రసాద్, రావు రమేష్, నరేష్, గౌతమి, షావుకారు జానకి ప్రజన్స్ కంప్లీట్ నెస్ ని తీసుకొచ్చింది ప్యూర్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లు చేయడంలో పేరుపొందిన నందిని రెడ్డి అందమైన భావోద్వేగాలతో కూడిన మరో ట్రీజీ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌తో ముందుకు వచ్చారు. మిత్ర విందా మూవీస్‌తో కలిసి ప్రియాంక దత్ ఈ చిత్రాన్ని నిర్మించారు. సమ్మర్‌లో బిగ్గెస్ట్ ఎట్రాక్షన్స్‌లో ఒకటిగా మే 18న సినిమాను విడుదల చేస్తామని టీజర్ ద్వారా మేకర్స్ అనౌన్స్ చేశారు.

గోపీచంద్



రామబాణం రిలీజ్ డేట్ ఫిక్స్

టాలీవుడ్‌లో ఉన్న క్రేజీ కాంబినేషన్లలో గోపీచంద్, డైరెక్టర్ శ్రీవాస్ కాంబినేషన్ ఒకటి. వారి కలయికలో గతంలో 'లక్ష్యం', 'లౌక్యం' వంటి సూపర్ హిట్లు వచ్చాయి. ఇప్పుడు 'రామబాణం' కోసం ఈ కాంబినేషన్ ముచ్చటగా మూడోసారి హ్యాట్రిక్ కోసం ప్రయత్నిస్తోంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిభొట్ల సంయుక్తంగా భారీస్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

ఇందులో గోపీచంద్ సరసన నాయికగా డింపుల్ హయతి నటిస్తుండగా, జగపతి బాబు, కుష్బూ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. లేటెస్ట్‌గా ఈ చిత్రం నుంచి మరో కొత్త పోస్టర్ విడుదలైంది. ఇది పరీక్షల సమయం కావడంతో విద్యార్థులను ఆల్ ది బెస్ట్ చెబుతూ మేకర్స్ రామబాణం నుంచి కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. గోపీచంద్ పవర్ ఫుల్ లుక్‌తో ఉన్న పోస్టర్ ఎంతగానో ఆకట్టుకుంటోంది. అలాగే ఈ చిత్రాన్ని మే 5న విడుదల చేయబోతున్నట్లు పోస్టర్‌లో పేర్కొన్నారు.

'విద్యార్థులందరికీ పరీక్షలు ముగిశాక వేసవిలో మిమ్మల్ని అలరించటానికి, అసలుసిసలు వినోదాన్ని పంచడానికి 'రామబాణం' దూసుకొస్తోంది. ఇందులో విక్కీ అనే పవర్ ఫుల్ పాత్రలో గోపీచంద్ సరికొత్తగా కనిపించనున్నారు. ఈ సినిమాలో గోపీచంద్ మేకోవర్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. 'లక్ష్యం, లౌక్యం' సినిమాలను మించేలా ఉండాలని శ్రీవాస్ ప్రత్యేక శ్రద్ధతో ఈ చిత్రాన్ని తీర్చి దిద్దుతున్నారు. ఫ్యామిలీ ఎమోషన్స్‌తో పాటు సామాజిక సందేశం కూడా మిళితమైన బలమైన కథాంశం ఉన్న చిత్రమిది. గోపీచంద్ 30వ చిత్రంగా వస్తున్న ఈ సినిమాని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధినేతలు టి.జి. విశ్వప్రసాద్, వివేక్ కూచిభొట్ల ఖర్చుకి వెనకాడకుండా ప్రముఖ నటీనటులు, ఉత్తమ సాంకేతిక నిపుణులతో భారీగా నిర్మిస్తున్నారు' అని చిత్ర బృందం తెలిపింది.

నవచిత్రం



శ్రీనివాస్ అవసరాల

మనలో ఒకరి కథలా..

పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, దాసరి ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఫీల్ గుడ్ రొమాంటిక్ ఫిల్మ్ 'ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి'. టీజీ విశ్వ ప్రసాద్, పద్మజ దాసరి నిర్మాతలు. శ్రీనివాస్ అవసరాల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి వివేక్ కూచిభొట్ల సహ నిర్మాత. 'కళ్యాణ వైభోగమే' చిత్రంతో వెండితెరపై మ్యాజిక్ చేసిన హిట్ జోడి నాగశౌర్య, మాళవిక నాయర్ ఈ చిత్రంలోనూ జోడీగా నటించారు. 'ఊహలు గుసగుసలాడే', 'జ్యో అచ్యుతానంద' సినిమాల తర్వాత శ్రీనివాస్ అవసరాల- నాగశౌర్య కలయికలో వస్తున్న సినిమా ఇది. ఈనెల 17న ఈ చిత్రం థియేటర్లలో భారీస్థాయిలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో దర్శకుడు శ్రీనివాస్ అవసరాల శనివారం విలేకర్లతో ముచ్చటించారు. ఆ విశేషాలు..

'ఈ కథ కూడా నిజ జీవితంలో నేను చూసిన కొన్ని సంఘటనల ఆధారంగా రాసుకున్నాను. ఇది జనాలకు దగ్గరగా ఉండే కథ. మనకు తెలిసిన కథలా, మనలో ఒకరి కథలా చాలా సహజంగా ఉంటుంది. ఈ సినిమా స్క్రిప్టెడ్ లాగా అనిపించదు. ట్రైలర్ చూశాక ఈ సినిమా ఎలా ఉండబోతుందో మీకో అవగాహన వస్తుంది. ప్రతి సినిమాకి ఓ శైలి ఉంటుంది. నా గత చిత్రాలకు భిన్నంగా ఈ సినిమా ఉంటుంది. ఈ సినిమాలో ఏడు చాప్టర్లు ఉంటాయి. ఒక్కో చాప్టర్ నిడివి సుమారుగా 20 నిమిషాలు ఉంటుంది. ఈ ఏడు చాప్టర్లు పదేళ్ల వ్యవధిలో జరుగుతాయి. ఈ పదేళ్లలో 18 నుంచి 28 ఏళ్ళ వరకు నాగశౌర్య, మాళవిక పాత్రల ప్రయాణం ఉంటుంది. వయసుకి తగ్గట్లుగా పాత్ర తాలూకు ప్రవర్తన, ఆహార్యంలో వ్యత్యాసం చూపించడానికి నాగశౌర్య ఎంతో కష్టపడ్డాడు. 'బిఫోర్ సన్‌రైజ్' అనే ఇంగ్లీష్ సినిమా నాకు చాలా ఇష్టమైన సినిమా. ఈ తరహా సినిమా తెలుగులో చేయాలి అనిపించింది. ఇలాంటి సినిమాలకు డైలాగ్స్ స్క్రిప్టెడ్ ఉంటే సహజత్వం పోతుంది. నటీనటులు సహజంగా మాట్లాడుతున్నట్లు ఉండాలి. దర్శకుడిగా నా బలం నటీనటుల నుంచి సహజ నటన రాబట్టుకోవడం. నేను ఫ్రేమ్‌లో మొదట నటీనటులు అభినయం ఎలా ఉంది అనేదే చూస్తాను. ఆ నమ్మకంతోనే ఈ సినిమా చేశాను. మా నిర్మాతలు నన్ను, నా కథని, ఈ ప్రయోగాన్ని నమ్మారు. 'బ్రహ్మాస్త్ర, అవతార్-2' సినిమాలకు తెలుగులో మాటలు రాసే అవకాశం చాలా హ్యాపీగా ఉంది. ఇక నటుడిగా కన్యాశుల్కం అనే వెబ్ సిరీస్ చేశాను. త్వరలోనే విడుదల కానుంది' అని చెప్పారు.

పగ కూడా అంతే..



సృష్టి డాంగే

వివి ప్రొడక్షన్స్ పతాకంపై ఎం.ఏ.చౌదరి దర్శకత్వంలో కె. కోటేశ్వరరావు నిర్మించిన చిత్రం 'పీరఖడ్గం'. మారుశెట్టి సునీల్ కుమార్ లైన్ ప్రొడ్యూసర్. సృష్టి డాంగే హీరోయిన్. ఈ చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని ఈనెల మూడో వారంలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దర్శకుడు మాట్లాడుతూ,'పగ కూడా ఒక మనిషిని నాశనం చెయ్యాలి అనుకుంటే ఎన్ని జన్మలైనా సరే, దాన్ని సాధించే వరకు మనిషి జీవితం మసి అయినా, ఆ శవమే మృగమై వెంటాడుతుంది. వాస్తవాన్ని వెంటాడుతూ గతం చేసిన యుద్ధమే ఈ సినిమా. గ్రాఫిక్స్‌కి ప్రాధాన్యత ఉన్న చిత్రమిది' అని తెలిపారు. 'సినిమా చాలా బాగా వచ్చింది. ప్రేక్షకులు మా చిత్రాన్ని ఆదరిస్తారని కోరుకుంటున్నా' అని లైన్ ప్రొడ్యూసర్ మారుశెట్టి సునీల్ కుమార్ అన్నారు. నిర్మాత డా.ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ, 'సినిమా చూశాను. మంచి గ్రాఫిక్స్‌తో చాలా గ్రాండ్‌గా తీశారు. పాటలు కూడా బావున్నాయి. లోకేషన్స్ చాలా రిచ్‌గా ఉన్నాయి. ఈ సినిమా పెద్ద సక్సెస్ సాధిస్తుంది' అని తెలిపారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

నష్టాల పేరుతో సర్వీసుల కుదింపు

మిగులు పేరుతో ఆర్టీసీ కార్మికుల బదిలీలు

- గతంలో 64 మంది.. ఇప్పుడు 80 మందికి స్థానచలనం
- డబుల్ డ్యూటీలతో పెరిగిన పనిభారం
- అద్దె బస్సులకు ప్రాధాన్యత



నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

టీఎస్ ఆర్టీసీ నష్టాల పేరుతో సర్వీసులను కుదిస్తున్నది. పల్లెవెలుగు బస్సులు తగ్గిస్తున్నది. మిగులు సిబ్బంది ఉన్నారంటూ కార్మికులను దూర ప్రాంతాలకు బదిలీ చేస్తున్నది. అదనపు డ్యూటీలు వేస్తూ రోజువారీ డ్యూటీ షెడ్యూల్స్ మరింత కఠినతరం చేస్తోంది. పని ఒత్తిడితో కార్మికులు దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నారు. ఇటీవల ఖమ్మంకు చెందిన ఓ కార్మికుడు కిడ్నీ వ్యాధితో చనిపోయారు. మరో కార్మికుడు గుండెపోటుతో మృతిచెందారు.

పని ఒత్తిడి..

ఖమ్మం రీజియన్ పరిధిలో 2600 మంది కార్మికులు ఉన్నాయి. గతంలో 600 వరకు ఉన్న షెడ్యూల్స్(ఒక కండక్టర్, ఒక డ్రైవర్ డ్యూటీ)ను 513కు కుదించడంతో కార్మికులు ఒత్తిడికి లోనవుతున్నారు. కొద్దిరోజుల కిందట 15 ఏండ్లుగా రీజియన్‌లో పనిచేస్తున్న కార్మికులను మిగులు సిబ్బంది పేరుతో 64 మందిని నిజామాబాద్, ఆదిలాబాద్ డిపోలకు బదిలీ చేశారు. తాజాగా 40 మంది డ్రైవర్లు, 40 మంది కండక్టర్లను హైదరాబాద్ రీజియన్‌కు పంపించారు. ఇంకా మిగులు సిబ్బంది ఉన్నారని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. సిబ్బందిని కుదించి ఉన్నవాళ్లతో డబుల్ డ్యూటీలు చేయిస్తున్నారని కార్మిక సంఘాలు విమర్శిస్తున్నాయి. ఆర్టీసీ కార్మికుల అక్రమ బదిలీలకు వ్యతిరేకంగా ఇటీవల సీఐటీయూ, ఏఐటీయూసీ ఖమ్మం ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయం వద్ద నిరసన తెలిపాయి. ట్రాన్స్‌ఫర్స్ నిలిపివేయాలని కోరుతూ ఆర్ఎంకు వినతిపత్రం ఇచ్చారు.

టైట్ 'షెడ్యూల్'

గతంలో 600కు పైగా ఉన్న షెడ్యూల్స్‌ను ఇప్పుడు 513కు కుదించారు. ఈ షెడ్యూల్స్‌లో ఖమ్మం, రీజియన్ డిపోల మధ్య వ్యత్యాసం ఉంది. డ్రైవర్, కండక్టర్‌ను కలిపి 2.5 చొప్పున షెడ్యూల్స్ లెక్కిస్తున్నారు. ఖమ్మం రీజియన్ 138 షెడ్యూల్స్ చూపిస్తుండగా.. డిపోలో మాత్రం 143గా పేర్కొంది. మధిరలో 62, సత్తుపల్లి 94, భద్రాచలం 87, కొత్తగూడెం 69, మణుగూరు 63, మొత్తంగా 513 షెడ్యూల్స్‌ను నడుపుతున్నారు. దీనిలోనూ ప్రయివేటుకు పెద్దపీట వేస్తున్నారన్న విమర్శలున్నాయి.. 266 హైర్ షెడ్యూల్స్ ఉండటం గమనార్హం. దీనికి బస్సుల కండీషన్, కేంద్రం తెచ్చిన 15 ఏండ్లు నిండిన వాహనాల రిజిస్ట్రేషన్ రద్దును సాకుగా చూపుతూ హైర్ బస్సులకు అధిక షెడ్యూల్స్ ఇస్తున్నారని కార్మికులు తెలిపారు. ఇలా ఆర్టీసీ ఎక్కడికక్కడ కార్మికుల విధులను టైట్ చేస్తుండటం, ప్రయివేటీకరణకు పెద్దపీట వేస్తుండటంపై కార్మిక సంఘాలు మండిపడుతున్నాయి.

కార్మికుల బదిలీలను నిలిపివేయాలి

కళ్యాణం వెంకటేశ్వరరావు- సీఐటీయూ ఖమ్మం జిల్లా కార్యదర్శి

ఖమ్మం రీజియన్‌లో మిగులు సిబ్బంది పేరుతో డ్రైవర్, కండక్టర్లను హైదరాబాద్ జోన్‌కు బదిలీ చేయడాన్ని ఉపసంహరించుకోవాలి. కార్మికుల కుటుంబాల స్థితిగతులను పరిగణలోకి తీసుకుని ఆదిలాబాద్, నిజామాబాద్ రీజియన్లకు పంపిన డ్రైవర్లను తిరిగి ఖమ్మం రీజియన్‌కు తీసుకురావాలి. రద్దు చేసిన పల్లెవెలుగు సర్వీసులను పునరుద్ధరించాలి. గతంలో మాదిరిగా షెడ్యూల్స్ నిర్వహించాలి.

బదిలీలు ఇప్పటికే అమల్లోకి వచ్చాయి

ప్రభులత- రీజినల్ మేనేజర్- ఆర్టీసీ- ఖమ్మం

టీఎస్ఆర్టీసీ నష్టాల్లో నడుస్తున్న నేపథ్యంలో ఎండీ ఆదేశాల మేరకు కార్మికులను బదిలీ చేశాం. ఇప్పటికే వంద మందికి పైగా కార్మికులు అదనంగా ఉన్నారు. వాస్తవానికి 73+ 73 చొప్పున బదిలీ చేయాల్సిన కార్మికులను 40+40 చొప్పున చేశాం. ఈ బదిలీ అమల్లోకి వచ్చాయి. ఇప్పటికే కార్మికులు విధుల్లో చేరుతున్నారు. ఇక్కడి నుంచి వారిని రిలీవ్ చేశాం. అక్కడ జాయిన్ అయ్యారో లేదో నాకు తెలియదు.

ఎక్కడికక్కడ కోత



రీజియన్‌లో ఖమ్మం, మధిర, సత్తుపల్లి, కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు డిపోలున్నాయి. నూత నంగా ఇల్లెందు డిపోను నెలకొల్పుతున్నారు. గతంలో ఉదయం డ్యూటీకి ఎక్కితే మధ్యాహ్నానికి దిగేవారు. ఇప్పుడు ఉదయం 5 గంటల నుంచి రాత్రి 7-8 గంటల వరకు స్ప్రెట్ డ్యూటీ నిర్వహించాల్సి వస్తోందని కార్మికులు వాపోతున్నారు. రోజుకు 14 గంటలు ఆన్ డ్యూటీలోనే ఉంటున్నారు. మధ్యలో రెండు గంటలు విశ్రాంతి ఇస్తున్నామని చెబుతున్నా ఏ బస్టాండ్‌లోనూ విశ్రాంతి గదులు లేవు. రూ.25 కోట్లతో నిర్మించిన ఖమ్మం నూతన బస్టాండ్‌లోనూ విశ్రాంతి గదులు లేవు. భోజనశాల కూడా లేదు. మూడ్రోజుల మస్టర్లను ఒక రోజుకు కుదించారు. ఆరురోజులు డ్యూటీ చేస్తే ఏడోరోజు ఆఫ్ ఇస్తున్నారని కార్మికుల ఆరోపణ. ఇటీవల కొత్తగూడెం డిపో పరిశీలనకు వెళ్లిన ఆర్ఎం తిరుపతి, మియాపూర్ (వయా చంద్రుగొండ), మంచిర్యాల సర్వీసులను కుదించాలని సూచించినట్టు తెలుస్తోంది. ఇలా చేయడం వల్ల డ్రైవర్ తగ్గి, మస్టర్ సేవ్ అవుతుందని పేర్కొన్నట్టు సమాచారం.

కంటి వెలుగు సరే....

- న్యూరాలజీ సంగతేంటి?
- కంటి పరీక్షలకు ఉస్మానియా న్యూరాలజీ డాక్టర్లు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ఉదాత్త లక్ష్యంతో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమం సర్వత్రా ప్రశంసలను అందుకుంటున్నది. ముఖ్యంగా వృద్ధులు, రోజు వారీ కూలీలు, వికలాంగులు తదితర వర్గాల వారు ఆస్పత్రికి వెళ్లే అవసరం లేకుండా తమ ఇండ్ల వద్దనే కంటి పరీక్షలు నిర్వహించడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. అవసరమైన వారికి వెంటనే రీడింగ్ గ్లాసెస్ అందజేస్తూ, ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్ రెఫర్ చేస్తూ, శస్త్రచికిత్సలు చేయాల్సి ఉంటే పెద్దాస్పత్రులకు పంపిస్తూ ప్రజలకు ఉపయోగపడుతున్నది. రెండో దశ కంటి వెలుగు కార్యక్రమాన్ని వంద రోజుల్లో విజయవంతం చేసేందుకు ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 1,500 వందల బృందాలను డాక్టర్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అయితే అందరూ కంటి వైద్య నిపుణులు లేకపోవడంతో మిగిలిన వారికి శిక్షణ ఇచ్చిన సంగతి విదితమే. కంటి వెలుగు కార్యక్రమం ఇతర ఆరోగ్య సేవల కార్యక్రమాలకు ఇబ్బందులు కలగకుండా కంటి వెలుగు కార్యక్రమాలను రూపొందించారు. ఆయా బందాల్లో జూనియర్‌లను తీసుకుంటే ప్రాథమిక పరీక్షలు చేసేందుకు సరిపోతుందని నిర్ధారణకు వచ్చారు. టీంలలో పని చేసేందుకు వీలుగా ఆయా ఆస్పత్రుల్లో ఇప్పటికే పని చేస్తున్న వారిని తీసుకున్నారు. ఇందులో భాగంగా ఉస్మానియా జనరల్ ఆస్పత్రి నుంచి కూడా ఐదుగురు డాక్టర్ల సేవలను వినియోగించుకుంటున్నారు. వీరిలో నిబంధనలకు అనుగుణంగా ముగ్గురు జూనియర్లను తీసుకోగా, మరో ఇద్దరిని న్యూరో సర్జరీ విభాగంలో పని చేసే సీనియర్ డాక్టర్లను తీసుకున్నట్టు సమాచారం. ఇప్పటికే ఉస్మానియా జనరల్ ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్యకు తగినట్టు వైద్య సిబ్బంది లేకపోవడం, అందులోనూ కీలకమైన న్యూరో సర్జరీ విభాగంలో 13 మందికిగాను కేవలం నలుగురే ఉన్నట్టు తెలుస్తున్నది. వీరిలో నుంచి ఇద్దరిని వంద రోజుల కంటి వెలుగు కార్యక్రమానికి పంపించడంతో మిగిలిన సిబ్బంది, జూనియర్లపై పని భారం పడటంతో పాటు రోగులకు ఇబ్బందికరంగా మారినట్టు చెబుతున్నారు. కేవలం ఉస్మానియా నుంచే కాకుండా మిగిలిన ఆస్పత్రుల నుంచి కూడా ఇలా న్యూరో సర్జరీ లాంటి విభాగాల నుంచి పంపించిన వారిని వెనక్కి రప్పించాలనీ, నిబంధనలకు అనుగుణంగా జూనియర్ల సేవలను వినియోగించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. తద్వారా కంటి వెలుగు కార్యక్రమం యధావిధిగా సాఫీగా సాగడంతో పాటు ఆయా ఆస్పత్రుల్లో అందించే సేవలకు విఘాతం కలగకుండా ఉంటుందని భావిస్తున్నారు.

బిడ్డతో కలిసి దూకిన తల్లి





- భర్త మరణం తట్టుకోలేక.. అపార్ట్‌మెంట్ పై నుంచి దూకి బలవన్మరణం
- పెద్దకూతురుని దత్తత తీసుకోవాలని సూసైడ్‌నోట్

నవతెలంగాణ-కంఠేశ్వర్

వారి సంసారం అన్యోన్యంగా సాగింది. అంతలో ఊహించని విధంగా భర్త గుండెపోటుతో మృతిచెందడంతో భార్య తట్టుకోలేకపోయింది. భర్త లేని తాను జీవించలేనని చిన్న బిడ్డతో కలిసి అపార్ట్‌మెంట్ ఐదో అంతస్తు నుంచి దూకింది. తల్లి ఘటనా స్థలంలోనే మృతిచెందగా.. చిన్నారికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స కోసం ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించి మృతిచెందింది. ఈ విషాదకర ఘటన నిజామాబాద్ నగరంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ లింబాద్రి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్‌కు చెందిన జటాల అనూష (27)కు నాలుగేండ్ల కిందట శ్రీనివాస్‌తో వివాహం జరిగింది. వీరు ప్ర స్తుతం కరీంనగర్‌లో నివసిస్తున్నారు. వీరికి ఇద్దరు కూతుర్లు శ్రీకృత(1), శ్రీహిత ఉన్నారు. వీరి సంసార జీవితం అన్యోన్యంగా సాగుతున్న వేళ.. రెండు నెలల కిందట భర్త గుండెపోటుతో మృతిచెందాడు. అప్పటి నుంచి తీవ్ర మనస్తాపానికి గురైంది. ఆమెకు తల్లిదండ్రులు లేరు. కొన్ని రోజుల కిందట నిజామాబాద్ నగరంలోని కంఠేశ్వర్‌లోని సాయి ఆర్‌కేఆర్ అపా ర్ట్‌మెంట్‌లో ఉంటున్న వారి పెద్దమ్మ ఇంటికి ఇద్దరు కూతుర్లను తీసుకొని వచ్చి ఉంటుంది. పెద్దమ్మ, పెద్దనాన్న మార్కెట్‌కు వెళ్లగా.. చిన్న కూతురు శ్రీకృతను తీసుకొని అపార్ట్‌మెంట్ ఐదో అంతస్తు నుంచి దూకింది. ఈ ఘటనలో అనూష అక్కడికక్కడే మృతిచెందగా.. చిన్నారికి తీవ్ర గాయాలు అయ్యాయి. హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ప రిస్థితి విషమించి మృతిచెందింది. మృతురాలి అన్న పుత్తూరు రవితేజ ఫి ర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు. 'నా చావు కు ఎవరూ కారణం కాదు. చిట్టి శ్రీహితను దత్తత తీసుకొని చూసుకో' అని మృతురాలు రాసిన సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

గోవధను నిషేధించండి

- ఆవును జాతీయ రక్షిత జంతువుగా ప్రకటించండి
- కేంద్రాన్ని కోరిన అలహాబాద్ హైకోర్టు

న్యూఢిల్లీ : దేశంలో గోవధపై అలహాబాద్ హైకోర్టు ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. గోవధను నిషేధించాలని కేంద్రాన్ని కోరింది. ఆవును జాతీయ రక్షిత జంతువుగా ప్రకటించాలని తెలిపింది. గోవధ, అమ్మకానికి ఆవును తరలించినందుకు తనపై దాఖలైన క్రిమినల్ కేసును కొట్టివేయాలని పిటిషనర్ మహ్మద్ అబ్దుల్ ఖాలిక్ అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అహ్మద్ విచారణ జరిపారు. పిటిషనర్ అభ్యర్థనను న్యాయమూర్తి తిరస్కరించారు. ఈ మేరకు కేంద్రాన్ని పైవిధంగా అభ్యర్థించారు. " మనం లౌకిక దేశంలో ఉంటున్నాం. హిందూ మతంతో పాటు అన్ని మతాల విశ్వాసాలను మనం గౌరవించాలి" అని న్యాయమూర్తి అన్నారు. ఆవును జాతీయ జంతువుగా ప్రకటించాలని కోరుతూ ఎంతో కాలంగా హిందూ సంస్థలు డిమాండ్లు చేస్తున్నాయి.

పోలీస్ పహారాలో గౌరవెల్లి ప్రాజెక్టు పనులు

- శుక్రవారం అర్ధరాత్రి నిర్వాసిత గ్రామానికి వచ్చిన పోలీసు బలగాలు
- ఊరంతా పోలీసులు మోహరించి గండి మూసివేత
- ఆడపిల్లలకు పరిహారం ఇవ్వాలని నిరసన
- పోలీసుల దాడిలో గాయపడిన నిర్వాసిత యువతి



నవతెలంగాణ-అక్కన్నపేట

పోలీసుల పహారా మధ్య గౌరవెల్లి ప్రాజెక్టు పనులను శుక్రవారం రాత్రి నుంచి ప్రారంభించడంతో నిర్వాసితులు తీవ్రంగా వ్యతిరేకించారు. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలోని ప్రాజెక్టు ప్రదేశానికి అర్ధరాత్రి ఒక్కసారిగా భారీ సంఖ్యలో పోలీసులు గ్రామంలోకి చేరుకుని నిర్వాసితులను బయటకు రాకుండా కట్టడి చేశారు. ఊరంతా నిండిపోయిన పోలీసులు ఎక్కడికక్కడా నిర్వాసితులను నిర్బంధించి రెండో గండి మూసివేత పనులు ప్రారంభించారు. కనీసం ఊళ్లోకి నీళ్లు కూడా రాకుండా చేయడం అందరినీ కలచివేసింది. శనివారం ఉదయం భూనిర్వాసితులు రోడ్డుపై బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. తమకు డబ్బులు ఇచ్చే వరకు ఇక్కడి నుంచి కదలబోమని రోడ్డుపై భీష్మించుకు కూర్చున్నారు. పోలీసులు నిర్వాసితులపై దాడి చేశారు. ఈ దాడిలో యువతి పెండ్యాల సౌజన్యకు, కొంతమంది మహిళా నిర్వాసితులకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని ఆస్పత్రికి తరలించారు. తర్వాత నిర్వాసితులను అక్రమంగా అరెస్టు చేసి వ్యాన్‌లో తరలించారు. ప్రస్తుతం నిర్వాసితులు ఏ పోలీసుస్టేషన్‌లో ఉన్నారో ఎవ్వరికీ తెలియడం లేదు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ.. గౌరవెల్లి ప్రాజెక్టు పనులను పోలీస్ పహారా మధ్య మొదలుపెట్టారని నిర్వాసితులు తెలిపారు. శుక్రవారం అర్ధరాత్రి ఊరంతా పోలీసులతో నిండిపోయారని, ఎక్కడికక్కడా తమను నిర్బంధించి రెండో గండి మూసివేత పనులు ప్రారంభించారన్నారు. కనీసం ఊళ్లోకి నీళ్లు కూడా రాకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టుకు తాము అడ్డుకాదని తమకు పరిహారం చెల్లిస్తే మేమెందుకు అడ్డుకుంటామని తెలిపారు. అందరికీ పరిహారం అందిన తర్వాతే కట్ట పనులు ప్రారంభించాలని ఇప్పటికే ఎమ్మెల్యేకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోకుండా పోలీస్ పహారా మధ్య ప్రాజెక్టు పనులు మొదలు పెట్టారని వాపోయారు. తమ భూములు సర్వస్వం కోల్పోయి పదిమంది రైతులకు నీరందుతుందని, తమ భూములను, ఇండ్లను త్యాగం చేశామని, అలాంటి తమకు ప్రభుత్వం న్యాయం చేయకుండా ఇలా పోలీసులను పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తూ ప్రాజెక్టు పనులు చేయడం అన్యాయమన్నారు. దాదాపు వందమంది పెండ్లయిన ఆడపిల్లలకు రావాల్సిన ప్యాకేజీ ఇవ్వకుండా ఎమ్మెల్యే సతీష్ కుమార్ కాలయాపన చేస్తూ, పోలీస్ పహారా మధ్య గండి మూసి వేయడం బాధాకరమన్నారు. తమ భూములు గుంజుకొని దిక్కులేనివారిలా ఇలా వెళ్లగొట్టడం మంచిది కాదన్నారు. అన్నింట్లో మహిళలకు సమాన హక్కు అని చెప్పిన ప్రభుత్వాలు ఇలా ఆడపిల్లలకు అన్యాయం చేయడం దారుణమన్నారు. ఆడపిల్లల ఉసురు ఈ ప్రభుత్వానికి మంచిది కాదన్నారు. తమ కన్నీటితో ప్రాజెక్టును నింపుతారా అంటూ ప్రశ్నించారు.

డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లొల్లి..!

- ఎంపికలో అవకతవకలు : ఆర్డీవో కార్యాలయం ముందు పేదల నిరసన
- ఒంటిపై పెట్రోల్ పోసుకుని మహిళ ఆత్మహత్యాయత్నం
- రాస్తారోకో.. ధర్నాతో ఉద్రిక్తత
- రీ సర్వే చేయాలని ఫిర్యాదులు



నవతెలంగాణ-మిర్యాలగూడ

డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ఎంపికలో అవకతవకలు జరిగాయని పేదలు ఆందోళనకు దిగారు. రీ సర్వే చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో ఓ మహిళ ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశారు. ఈ ఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ ఆర్డీఓ కార్యాలయం ఎదుట శనివారం జరిగింది. ఉదయం 10 గంటలకే గాంధీనగర్ కాలనీ ప్రజలు పెద్దఎత్తున ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని రోడ్డుపై బైటాయించి రాస్తారోకో చేశారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలోకి దూసుకెళ్లి నిరసన తెలిపారు. మిర్యాలగూడ పట్టణ శివారులో 560 డబుల్ బెడ్ రూమ్‌లు జీ ప్లస్ టూ పద్ధతిలో నిర్మించారు. మొత్తం 560 ఇండ్లు ఉండగా, 12,436 దరఖాస్తులు వచ్చాయి. వీటిని విచారించి అర్హుల జాబితాను ఎంపిక చేశారు. నిజమైన అర్హులకు జాబితాలో పేరు రాలేదని వారిని కూడా చేర్చాలని ప్రజల నుంచి తీవ్ర ఒత్తిడి రావడంతో తిరిగి దరఖాస్తులు స్వీకరించారు. వాటిని కూడా విచారించి అర్హుల పేర్లను కలిపి డ్రా పద్ధతిన లబ్దిదారుల ఎంపిక చేశారు. అయినా, విచారణ సరిగా చేయలేదని అనర్హులకే అవకాశం ఇచ్చారని పేదలు విమర్శించారు. ఈ నేపథ్యంలోనే శనివారం పేదలు ఆందోళనకు దిగారు. 14వ వార్డు షాబునగర్ రామనగర్, మూడో వార్డు తాళ్లగడ్డ, సీతారాంపురం, బంగారిగడ్డ, చైతన్యనగర్, ఈదులగూడెం, సుందర్‌నగర్ కాలనీల ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. దరఖాస్తుల పరిశీలన సమగ్రంగా జరపలేదని, పారదర్శకంగా విచారణ చేయలేదని ఆరోపించారు. దాని కారణంగా జాబితాలో అనర్హుల పేర్లు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మధ్యాహ్నం తర్వాత అభ్యంతరాలకు బదులు మళ్లీ దరఖాస్తులు స్వీకరించారని, వాటిని సమగ్రంగా పరిశీలించకపోవడంతో అందరి పేర్లు జాబితాలో చేర్చి డ్రా తీశారని తెలిపారు. దాని ఫలితంగా అనర్హులకు ఇండ్లు కేటాయించారని ఆరోపించారు. వార్డుల వారీగా లబ్దిదారుల జాబితాలో ఎక్కువ మంది అనర్హులు ఉన్నారని, నిజమైన అర్హులకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. 14వ వార్డు శబానగర్ రాంనగర్ ఏరియాలో పొదిల సుబ్బమ్మ, సిద్దాపురం రాధిక, పళ్ళు సత్యమ్మ, మొహమ్మద్ నసీమా, ఇంజి రమ్య, సబెర పేర్లు డ్రాలో వచ్చాయని, శుక్రవారం రాత్రి ఆర్డీవో కార్యాలయానికి పిలిచి సంతకాలు, ఫొటోలు తీసుకున్నారని, తెల్లారేసరికి తమ పేర్లకు బదులు మరో పేర్లు చేర్చారని ఆరోపించారు. గాంధీనగర్ వార్డులో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు కేటాయించలేదని వికలాంగులు ఆందోళన చేశారు. బంగారుగడ్డ 29వ వార్డుకు చెందిన భాగ్యలక్ష్మి పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసుకుంది. అక్కడే ఉన్న పోలీసులు నివారించి ఆమెను ఏరియాస్పత్రికి తరలించారు. 13వ వార్డు రామచంద్రగూడెంలో అదనంగా తీసుకున్న మూడు దరఖాస్తులను డ్రాలో వేయకుండా అధికార పార్టీ నాయకులే తమ వారికి ఇప్పించుకున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. 36వ వార్డులో విచారణ సరిగా జరగలేదని అధికార పార్టీకి చెందిన మున్సిపల్ చైర్మెన్ తిరునగర్ భార్గవ్ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడం గమనార్హం. దరఖాస్తులను రీ ఎంక్వయిరీ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ కౌన్సిలర్లు సైతం అవకతవకలు జరిగాయని విచారణ చేయాలని ఫిర్యాదులు చేశారు. నాలుగో వార్డ్ కౌన్సిలర్ చల్ల నాగమ్మ వెంకన్న తమ వార్డులో లబ్దిదారుల ఎంపిక పూర్తిగా అన్యాయంగా జరిగిందని, అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో ఎంపిక చేశారని కార్యాలయం ఎదుట బైటాయించి నిరసన తెలిపారు. ప్రజల ఆందోళనను తెలుసుకున్న బీజేపీ నాయకులు అక్కడికి చేరుకొని వారికి మద్దతుగా ధర్నా నిర్వహించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ అనిల్‌కుమార్ ఫిర్యాదులు స్వీకరించి సమగ్ర విచారణ జరుపుతామని హామీ ఇచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆర్డీఓ కార్యాలయం ఎదుట పేదల ఆందోళనతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. వన్ టౌన్ సీఐ రాఘవేంద్ర ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కబడ్డీ టోర్నమెంట్ విజేత హర్యానా రోడ్‌వేస్

- రన్నర్‌గా నిలిచిన బీఎంటీసీ
- జట్లను అభినందించిన టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

హైదరాబాద్ హకీంపేట ట్రాన్స్‌పోర్ట్ అకాడమీలో నిర్వహించిన అఖిల భారత ప్రజా రవాణా సంస్థల కబడ్డీ టోర్నమెంట్‌లో హర్యానా జట్టు విజయం సాధించింది. రన్నర్‌గా బెంగళూరు మెట్రోపాలిటన్ ట్రాన్స్ ఫోర్ట్ కార్పొరేషన్ (బీఎంటీసీ) నిలిచింది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన అసోసియేషన్ ఆఫ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండర్‌టేకింగ్స్ (ఏఎస్ఆర్టీయూ) ఆధ్వర్యంలో మూడు రోజుల క్రితం ప్రారంభమైన కబడ్డీ టోర్నమెంట్ శనివారం ముగిసింది. ఈ పోటీలకు టీఎస్ఆర్టీసీ ఆతిథ్యం ఇచ్చింది. దేశవ్యాప్తంగా ప్రజా రవాణా సంస్థలకు చెందిన 9 జట్లు ఈ టోర్నమెంట్‌లో పాల్గొనగా.. తుది పోరులో హర్యానా రోడ్‌వేస్ స్టేట్ ట్రాన్స్‌పోర్ట్, బెంగళూరు మెట్రోపాలిటన్ ట్రాన్స్ ఫోర్ట్ కార్పొరేషన్ (బి.ఎం.టి.సి) జట్లు తలపడ్డాయి. హర్యానా జట్టు ఛాంపియన్‌గా .. బెంగళూరు జట్టు రన్నర్‌గా పతకాలు అందుకోగా మూడో స్థానంలో మహారాష్ట్ర ఆర్టీసీ జట్టు నిలిచింది. బహుమతి ప్రధాన కార్యక్రమానికి టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ ముఖ్య అతిథిగా హాజరై మొదట మూడు స్థానాల్లో నిలిచిన హర్యానా (బంగారు), బెంగళూరు (రజతం), మహారాష్ట్ర (కాంస్యం) జట్ల సభ్యులకు ట్రోఫీలు, మెడల్స్, ప్రశంసాపత్రాలను బహూకరించి అభినందించారు. టోర్నమెంట్‌లో పాల్గొన్న టీం సభ్యులకు సర్టిఫికెట్లను అందజేశారు. ప్రజా రవాణా సంస్థల్లో పని చేసే ఉద్యోగులు క్రీడల్లోనూ ప్రావీణ్యాన్ని ప్రదర్శించడం గొప్ప విషయమని కొనియాడారు. ఆయా రాష్ట్రాల టీంల మధ్య మంచి వాతావరణంలో జరిగిన ఈ టోర్నమెంట్ క్రీడా స్ఫూర్తిని మరింత రెట్టింపు చేసిందన్నారు. కార్యక్రమంలో టీఎస్ఆర్టీసీ చీఫ్ పర్సనల్ మేనేజర్ కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గీతం యూనివర్సిటీకి న్యాక్ ఏ++ గ్రేడ్

నవతెలంగాణ-పటాన్‌చెరు

అత్యుత్తమ విద్యకు చిరునామాగా మారిన గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం 'న్యాక్ ఏ++' గ్రేడు (4 పాయింట్లకు గాను 3.54) సాధించి మరోసారి తన సత్తాను చాటుకుంది. యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఏర్పాటు చేసిన నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (ఎన్ఏఏసీ లేదా నాక్) గీతం పనితీరును విశ్లేషించి 'ఏ++' గ్రేడును కేటాయించిందని, ఇది ఏడేండ్ల పాటు అమలులో ఉంటుందని ఉపకులపతి ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం శనివారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. భారతదేశంలోని దాదాపు 4,201 ఉన్నత విద్యా సంస్థల్లో కేవలం మూడు శాతానికి మాత్రమే ఈ గ్రేడ్ దక్కినట్టు నాక్ వెబ్‌సైట్ ద్వారా వెల్లడవుతోందన్నారు. 'న్యాక్ ఏ++' గుర్తింపు పొందిన గీతం మరింత ఉన్నత స్థాయికి చేరుకుని, ప్రపంచ స్థాయి, సమగ్ర విద్యను అందించడంతో పాటు సమాజానికి దోహదపడాలనే దాని లక్ష్యానికి కూడా దగ్గరయినట్టు ఉపకులపతి తెలిపారు. ఈ గ్రేడు సాధించడం ద్వారా మరింత స్వయం ప్రతిపత్తిని సమకూర్చే కేటగిరీ-1 హెూదాను కూడా గీతం నిలుపుకుందన్నారు. అకడమిక్స్ వీసీ ప్రొఫెసర్ జయశంకర్ ఈ వారియర్, ఐక్యూఏసీ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజా ప్రభుతో సహా ఈ ఘనత సాధించిన సిబ్బంది, విద్యార్థులు, ఇతర భాగస్వాములందరికీ ప్రొఫెసర్ దయానంద అభినందనలు తెలియజేశారు. గతంలో, గీతం 2011లో 'నాక్-ఏ' గ్రేడు, 2017 'నాక్-ఏ+' గ్రేడు సాధించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.

డబుల్ బెడ్‌రూమ్ స్కీమ్ సక్సెస్ కాలే..

- ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య



నవతెలంగాణ-స్టేషన్ ఘనపూర్

'విశ్వనాథపూర్‌లో ఇయ్యలే.. శివునిపల్లిలో జాగా లేదు.. నమిలిగొండలో జాగా ఉంది.. కాలేజీలు పడ్డాయి.. అక్కడ పాంనూర్‌లో వాల్లకిచ్చినం కట్టలే.. ఉప్పుగల్లులో అక్కడా కాలే.. రాఘవాపూర్‌లో ఇస్తే కాంట్రాక్టర్ ముందు పడ్డాడు.. చేసినం.. పక్కన కొత్తపల్లి, పల్లగుట్ట, కళ్లెం పూరైనయ్... ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయ్.. ఏదేమైనా ఈ ప్రభుత్వంలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల స్కీమ్ సక్సెస్ కాలేదు' అని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య సంచలన వ్యాఖ్యలు చేశారు. జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ మండలంలో పలు అభివృద్ధి పనులకు శనివారం శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు కడుదుల జ్యోతి నర్సిరెడ్డి, జక్కుల పర్శరాములు అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పల్లెప్రగతితో దేశంలోని 29 రాష్ట్రాల్లో ఎక్కడా లేనివిధంగా తెలంగాణలో మౌలిక సదుపాయాలు కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. చివరికి డబుల్ ఇండ్లు సరిగ్గా కడుతలేరని సీఎం కేసీఆర్ గతేడాది మార్చిలో 75 గజాల స్థలం గలవారికి 5వేల ఇండ్ల నిర్మాణానికి అవకాశం ఇచ్చారని తెలిపారు.

రేవంత్ యాత్రతో బీఆర్ఎస్ నేతల్లో గుబులు

- టీపీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

టీపీసీసీ అధ్యక్షులు ఎనుముల రేవంత్‌రెడ్డి చేపట్టిన హాత్ సే హాత్ జోడో యాత్రకు వస్తున్న అదరణను చూసి బీఆర్ఎస్ నేతల్లో గుబులుపుట్టిందని టీపీసీసీ అద్దంకి దయాకర్ చెప్పారు. అందుకే రేవంత్ యాత్రపై అధికార పార్టీకి చెందిన నేతలు దాడులు చేస్తున్నారని విమర్శించారు. పూర్తి భద్రత కల్పించాల్సిన రాష్ట్ర ప్రభుత్వమే ఇలా దాడులకు పూనుకోవడమేంటని ప్రశ్నించారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. హైకోర్టు చెప్పిన కూడా ప్రభుత్వం రేవంత్ భద్రత విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. శాంతిభద్రతల సమస్యలను చూపించి యాత్రను అడ్డుకునే కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రేవంత్‌కు సరైన భద్రత కల్పించాలని కోరారు.

సిలిండర్ ధర పెంపుదలకు నిరసనగా

- మహిళా కాంగ్రెస్ బీజేపీ ఆఫీస్ ముట్టడి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

సిలిండర్ ధరలను తగ్గించాలంటూ మహిళా కాంగ్రెస్ ఆందోళన చేపట్టింది. శనివారం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం ముట్టడికి యత్నించింది. బీజేపీ ఆఫీస్ వద్ద కూర్చొని మోడీ, కేసీఆర్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోలీసులకు, మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావుకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం పోలీసులు మహిళ కాంగ్రెస్ నాయకులను, కార్యకర్తలను అరెస్ట్ చేసి నాంపల్లి పోలిస్ స్టేషన్ కు తరలించారు.

సర్వీసులో సీనియర్లు

- అయినా వెయిటేజీ ఇవ్వని సర్కారు
- వయోపరిమితి దాటుతుండటంతో ఇబ్బందులు
- ఆదుకోవాలని అవుట్ సోర్సింగ్ ల్యాబ్ టెక్నీషియన్ల వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఏండ్ల తరబడి వారందించిన సేవలకు తగిన గుర్తింపు లభించలేదని ఆవేదన చెందుతున్నారు. ఏదో ఒక రోజు ప్రభుత్వ సేవల్లో ఉంటే క్రమబద్ధీకర ణకు నోచుకుంటామనే ఆశతో ఇంతకాలం నెట్టు కొచ్చారు. రెగ్యులర్ పోస్టుల భర్తీకి సర్కారు నోటిఫికేషన్ ఇచ్చింది. వాటి భర్తీ విషయానికి వచ్చే సరికి తమను కాదనీ, జూనియర్లకు వెయిటేజీ ఇచ్చే విధంగా షరతులు విధించడంతో ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పిల్లలు పెద్దవారై కుటుంబ బాధ్యతలు పెరిగి, ఆర్థిక అవసరాలు తీరక ఇబ్బంది పడుతున్న తమకు జరుగుతున్న అన్యాయం సరి చేయాలని సంబంధిత అధికారులను, మంత్రిని కలిసి వినతిపత్రాలు సమర్పించారు. అందరి నుంచి సానుభూతి పొందారు. న్యాయం చేయాల్సిన అవసరముందనే భరోసా పొందారు. అయినప్పటికీ వెయిటేజీ అంశం తేల్చకపోవడం, మరో వైపు అది న్యాయవివాదంలో చిక్కుకుపోవడంతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. స్టాఫ్ నర్సులు, పారామెడికల్ సిబ్బందిని భర్తీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2017లో నోటిఫికేషన్ జారీ చేసింది. దీని ద్వారా 200 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులను భర్తీ చేయాలని తలపెట్టింది. 2018 మే నెలలో నిర్వహించిన రాత పరీక్షను 11,952 మంది అభ్యర్థులు రాశారు. అయితే ఈ పరీక్షలకు సంబంధించిన వెయిటేజీ అంశం కోర్టుల్లో తేలకపోవడంతో ఇప్పటి వరకు ఫలితాలు వెల్లడి కాలేదు. వైద్యారోగ్యశాఖలోని వైద్యవిద్య సంచాలకులు, ప్రజారోగ్య సంచాలకులు, తెలంగాణ వైద్యవిధాన పరిషత్ తదితర విభాగాల్లో పొరుగు సేవల ప్రాతిపదికన పని చేస్తున్న 439 మంది ల్యాబ్ టెక్నీషియన్లకు వెయిటేజీ కల్పించడాన్ని సవాల్ చేసిన కేసులో హైకోర్టు 2021లో అను కూలంగా తీర్పునిచ్చింది. అయితే దీనిపై అప్పీల్‌కు వెళ్లగా డివిజన్ బెంచ్ వెయిటేజీ ఇవ్వడాన్ని నిరా కరించింది. దీనిపై పొరుగు సేవల అభ్యర్థులు కొంత మంది తమకు వెయిటేజీని కొనసాగించేలా ఆదేశిం చాలని కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయిచారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలనే ప్రభుత్వ నిర్ణయం మేరకు ఇప్పటికే 151 మంది ఆ జాబితాలో ఉన్నారు. ఇక మిగిలిన వారిలో ఆయా స్కీంలలో పని చేస్తున్న వారితో పాటు అవుట్ సోర్సిం గ్ ల్యాబ్ టెక్నీషియన్లు ఉన్నారు. వీరిలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పని చేస్తున్న దాదాపు 4 వేల నుంచి 5 వేల మందికి వెయిటేజీ ఇస్తుండగా, పొరుగు సేవల ప్రాతిపదికన ఇస్తున్న వారి విషయంలో వివాదం నెలకొన్నది. 2006, 2008లో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసి నియమించు కుందనీ, ఆ మేరకు తాము సేవలందించామని చెబుతున్నారు. తమ నియామక ప్రక్రియలో ఏమైనా లోపాలుంటే అవి ప్రభుత్వానికి సంబంధించినవే తప్ప తమకెలా ఆపాదిస్తారని అభ్యర్థులు ప్రశ్ని స్తున్నారు. రెగ్యులర్, కాంట్రాక్ట్ ఉద్యోగుల మాదిరి గానే తాము సేవలందించామనీ, కరోనా లాంటి విపత్కర సమయాల్లో ప్రాణాలొడ్డి కరోనా వారియర్లు గా తమను పొగిడారని గుర్తు చేశారు. ఇప్పటికే వయోపరిమితి దాటుతున్న తమకు